ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక


18-5-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు






అడ్మిరల్ నిమిట్జ్ - యం. సి. సెటల్వాడ్

ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధివర్గ నాయకుడు శ్రీ ఎం. సి. సెటల్వాడ్, కాశ్మీరు జనవాక్య నిర్ధారణాధికారి అడ్మిరల్ చెస్టర్ నిమిట్జును లేక్‌సక్సెస్‌లో కలుసుకొని సంభాషిస్తున్న దృశ్యం.




భారత ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ లండన్ సమావేశానంతరం తిరిగి స్వదేశంవచ్చినప్పుడు, బొంబాయిలో విమానాశ్రయంవద్ద వారికి దేశనాయకులనేకులు అఖండస్వాగతసన్మానమిచ్చారు.

వార్తాచిత్రాలు



భారత జాతీయ కార్మిక సంఘ కాంగ్రెస్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంలో భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ కార్మిక శాఖా మంత్రి జగజీవనరాం గార్లు ఇండోర్ వెళ్లినప్పుడు మధ్యభారత సంస్థానకూటమి రాజప్రముఖులు గ్వాలియర్ మహారాజాగారు వారికి స్వాగత మిచ్చారు.

ప్రప్రథమంలో అట్లాంటిక్ ఒడంబడిక అనే సంకల్పం కలిగినప్పుడు, పశ్చిమరాజ్యాల విదేశాంగమంత్రులు ఐదుగురూ లండన్‌లో సమావేశమైనప్పటి చిత్రం : (కుడివైపు) బెవిన్-మధ్యలో బెల్జియన్ హెలిగేట్లతో స్పాక్, ఎడమవైపున ఫ్రెంచి ఫైనాన్సుమంత్రి రమాడీర్ ఉన్నారు.



అట్లాంటిక్ ఒడంబడిక



ఉత్తర అట్లాంటిక్ ఒడంబడికపై అమెరికన్ విదేశాంగశాఖా కార్యదర్శి డీన్ అఛిసన్ దస్కతు చేస్తున్నాడు. అఛిసన్ వెనక నిలబడి చూస్తున్నవారు ఉపాధ్యక్షుడు ఆల్బెన్ బార్క్లే, అధ్యక్షుడు హారీ ట్రూమన్, సంధిపత్రాల శాఖోద్యోగి ఫోలే.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 41

సంచిక 35

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర వైశాఖ బహుళ షష్ఠి బుధవారము



పేదతల్లి



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ మేనెల 18-వ తేది బుధవారము

చైనా యుద్ధం

చైనా అంతర్యుద్ధము దాదాపు చరమదశను చేరినదనే చెప్పవచ్చును. ఏ క్షణములోనైనా షాంఘై నగరము కమ్యూనిస్టుసేనల వశము కావచ్చును. ఉత్తరచైనా కమ్యూనిస్టువశమైనను, దక్షిణ చైనాయందు తమ ప్రభుత్వమును నిలుపుకొనగలమని కుమింటాంగ్ వర్గములు ఆదిలో ఆశించియుండిరి. కాని కమ్యూనిస్టుసేనలు యాంగ్‌సీనదిని దాటి షాంఘైపై కమ్ముకొని వచ్చుటతో ఆ యాశ లన్నియు నిరాశలైనవి. కేంద్రరాజకీయ సంఘము సలహా ననుసరించి చాంగ్‌కైషేక్ తిరిగి నాయకత్వము వహించినను శేషించిన చైనా కమ్యూనిస్టువశము కాకుండ చేయుట సాధ్యము గాదు. చైనా మాజీ ప్రధాని సన్‌ఫో ప్రయత్నములు ఫలించి దక్షిణ చైనా రాష్ట్రము లన్నియు చేరి ఒక ప్రత్యేక ప్రభుత్వము నెలకొల్పుకొని కమ్యూనిస్టు దండయాత్రను ప్రతిఘటించినను, అంతిమ పరిణామము భిన్నముగ నుండజాలదు.

బ్రిటిష్‌వారు మాత్రము యాంగ్సీ నదిలో జరిగిన పరాభవమునుండి తెప్పరిల్లుకొని, దూరప్రాచ్యమున తిరిగి తమ ప్రతిష్ఠను నిలుపుకొనుటకు హాంగ్‌కాంగ్‌నందు తమ సైనికబలమును కేంద్రీకరించుచుండిరి. ద్వితీయ సంగ్రామానంతరం చైనా అంతర్యుద్ధం తిరిగి ప్రజ్వరిల్లినప్పటి నుండియు, అమెరికా ప్రత్యక్షముగ చైనా కుమింటాంగ్ పక్షము తరఫున కమ్యూనిస్టుల ప్రతిఘటించెను. ఈవిధముగ అంతర్యుద్ధమునందు ప్రమేయము కల్గించుకొనుచు కుమింటాంగ్ - కమ్యూనిస్టు పక్షముల సమాధానపరచి మిశ్రమ మంత్రివర్గమును స్థాపించుటకు అమెరికా రాయబారులు జార్జి మార్షల్, అల్బర్టు వెడ్‌మేయరు ప్రభృతులు ప్రయత్నించిరి. కాని ఏ ప్రయత్నమూ ఫలింపలేదు. అందుకు అమెరికావిధానమే కారణమని చెప్పవలెను.

చైనాయం దేర్పడు మిశ్రమమంత్రివర్గము తమ చెప్పు చేతలలో ఉండవలెనని అమెరికా అభిమతము. స్వశక్తిపై ఆధారపడి యుండగల ప్రభుత్వము ఒకరి అదుపు ఆజ్ఞలలో ఉండుట అసంభవము గనుక, అమెరికా అధికారులు కుమింటాంగ్ మితవాద పక్ష ప్రాబల్యముగల మిశ్రమమంత్రివర్గమును నెలకొల్పుటకే ప్రయత్నించిరి. అమెరికా ఆర్థిక, సైనికసహాయము లేకున్న చాంగ్‌కైషేక్ ప్రభుత్వ మింతకాలము అధికారమునం దుండుటే అసంభవము అని కమ్యూనిస్టులు గ్రహించి యున్నందున అమెరికా రాయబారుల రాజీ ప్రయత్నములు ఫలింపలేదు. అంతటితో అమెరికా చైనా వ్యవహారము లందు "శ్రద్ధ" వహించుటను విరమింపలేదు. హాంకాంగ్‌లో బ్రిటన్ తన సైనికబలమును వృద్ధిచేసికొనుట అంతిమబలప్రదర్శనకే నని, అమెరికా ప్రోద్బలము గలదని భావించుటకు తగిన నిదర్శనములు లేకపోలేదు. బ్రిటన్, అమెరికాలు పూర్వమువలె చైనాయందు అదనపు ప్రాంతీయ హక్కులను నిలుపుకొనుట సాధ్యము గాదు. చైనా యావత్తు కమ్యూనిస్టుల వశమైన, బ్రిటన్ హాంగ్‌కాంగ్‌నందు ఒక్క క్షణమూ తన అధికారమును నిలుపుకొనజాలదు.

దాదాపు పది సంవత్సరముల క్రితము టీన్‌ట్సిన్‌లో జపాను బ్రిటిష్ పౌరులను ఘోరముగ పరాభవించినను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వము అవమానమును సహించియుండెను. కాని సింగపూర్‌పై జపాన్ దండయాత్ర జరుపగా—రెండు యుద్ధనావలపై విమాన దాడి జరుపుటతోనే ఇది ప్రారంభమైనది-బ్రిటిష్ ప్రభుత్వము వెంటనే జపాన్‌పై యుద్ధమును ప్రకటించెను. అట్లే 'అమెథీస్టు' విధ్వంసనమును బ్రిటిష్ ప్రభుత్వము సహింపజాలక పోయినను, భరింప వచ్చును. కాని హాంగ్‌కాంగ్‌కు ప్రమాదమాసన్నమైన, ఆ ప్రమాదమును ఎదుర్కొనుటకు మరొక సంగ్రామమునకైనను బ్రిటన్ సందేహింపక పోవచ్చును ప్రస్తుత పరిస్థితులనుబట్టి అట్టి ప్రమాదము అనివార్యమైనట్లే కన్పించుచున్నది. చాంగ్‌కైషేక్ తిరిగి నాయకత్వమును వహించుటకుకూడ బ్రిటన్, అమెరికాల ప్రోద్బలము ఉండవచ్చును.

రానున్న కొద్ది వారములు ఒక్క చైనాకే గాక దూర, సమీప ప్రాచ్యమునకు అంతటికీ అతి ప్రధానమైన కాలముగ పరిణమింప గలదు. చైనా సమస్య పరిష్కారమైన ఇతర ప్రాచ్య దేశముల సమస్యలు సులభముగ, శీఘ్రముగ పరిష్కారము కాగలవు. కనుకనే యావత్తు ప్రపంచము చైనా యుద్ధ గతిని అత్యంత శ్రద్ధతో పరిశీలించుచున్నది.

వలసల సమస్య

రెండు ప్రపంచ సంగ్రామములు కూడ పశ్చిమ రాజ్యములకు, అవి యనుసరించుచుండిన సామ్రాజ్య విధానమే అట్టి దారుణ సంగ్రామములకు దారి తీసెనను యథార్థమును బోధపరచినట్లు కన్పింపదు. తమ స్వాతంత్ర్యమును, తమ దేశమును సంరక్షించుకొనజాలక పోయిన ఫ్రాన్సు, ఇటలీ, హాలెండ్, బెల్జియం మున్నగు దేశములు, ద్వితీయ సంగ్రామానంతరము, రష్యా, అమెరికా, బ్రిటన్ మున్నగు దేశముల త్యాగము వలన తమ స్వాతంత్ర్యమును తిరిగి పొందుటతో తృప్తి చెందక, ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి పూర్వము తమకు ఉండిన వలస దేశములను తిరిగి సంపాదించుకొనుటకు విశ్వప్రయత్నములను చేయుట విపరీతముగ తోచక మానదు.

చతుస్స్వాతంత్ర్యముల సాధన, సంరక్షణలకని యుద్ధము సాగించి, అపార త్యాగములు చేసిన ప్రజాస్వామ్యములు ఈ సామ్రాజ్యముల పునరుద్ధరణకు కృషి చేయుట, దారుణ సంక్షోభములకు హేతువైన వలస విధానమును సమర్థించుట శోచనీయము. ప్రజాస్వామిక రాజ్యము లిట్టి ప్రతీప విధానము ననుసరించుటకు, ఆ ప్రజాస్వామికములు తమ ఆర్థిక వ్యవస్థాస్థిరత్వమును కాపాడుకొనుటకు అన్యదేశాలపై ఆధిపత్యము నెలకొల్పవలసి యుండుటే కారణము.

కనుకనే బ్రిటన్ మలయాలో తన అధికారమును నిలుపుకొనుటకు బ్రహ్మాండమైన సైనిక చర్యలను జరుపుచున్నది. అమానుషమైన శాసనములను అమలుచేయుచున్నది. అట్లె ఇండో-చైనాలో ఫ్రాన్సు ప్రతీప విధానమును బ్రిటిష్ కార్మికప్రభుత్వము సమర్థించు చున్నది. "బాగున్న రోజుల"లో ఇటలీ ఆర్జించిన వలసలను, తిరిగి ఏదోవిధముగ ఆ దేశమునకు సంక్రమింప చేయుటకు ప్రయత్నించు చున్నది. ఇటలీ వలసల భవిష్యత్తును గురించి ఐక్యరాజ్య సమితి చర్చలు జరుపుచుండ బ్రిటన్, ఇటలీ విదేశాంగ మంత్రులు ప్రత్యేక ఒడంబడికను కుదుర్చుకొని ఆ ఒడంబడికకు ఐక్యరాజ్య సమితి ఆమోదమును సంపాదింప ప్రయత్నించుట ఏవిధముగను సమర్థనీయము గాదు.

1951 వ సంవత్సరములో తిరిగి ట్రిపొలిటానియాపై ఇటలీ ధర్మకర్తృత్వమును నెలకొల్పుటకు బ్రిటన్ విదేశాంగమంత్రి బెవిన్ అంగీకరించుటయం దాశ్చర్య మేమియు లేదు. నైరృతి ఆఫ్రికాపై ఐక్యరాజ్యసమితి ధర్మకర్తృత్వమును నెలకొల్పుటకు జరిగిన ప్రయత్నములకు బ్రిటన్ ఆది నుండియు విఘాతములను కల్పించుటే గాక, నైరృతి ఆఫ్రికాను తమదేశంలో కలిపివేసికొనుటకు దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వము చేసిన ప్రయత్నములకు ఇతోధికముగ తోడ్పడుచుండెను. ఇట్టి రాజ్యముల ప్రాబల్యమునకు లోబడి యున్న ఐక్యరాజ్య సమితి నైరృతి ఆఫ్రికా విషయమునగాని, ఇటలీ వెనుకటి వలసల విషయమునగాని న్యాయమైన మార్గమును అనుసరింపజాలక పోవుట సహజమే. కాని అట్టి అసమర్థత, పక్షపాతవైఖరి సమితి వినాశనమునకే దారితీయగలవు.

బెవిన్-స్ఫోర్జా ఒడంబడిక వివరములు వెల్లడియైన నాటి నుండియు ట్రిపోలిటానియాయందు, అరబ్ విప్లవము ప్రారంభమైనది. గత వారము ట్రిపోలియందు జరిగిన సంఘటనల ఫలితముగ దాదాపు 50మంది గాయపడిరి. ఐక్యరాజ్య సమితి ఈ ప్రజాభిప్రాయమును నిర్లక్ష్యముచేసి బెవిన్ - స్ఫోర్జాఒడంబడికను ఆమోదించిన ఇప్పటి సంఘర్షణలు తీవ్రమై అంతర్యుద్ధమునకు దారితీయగలవు.

ఇంతవరకు తమ శక్తిపై తాము నిలబడలేకుండిన పశ్చిమ రాజ్యములు, ఇట్టి 'చిల్లర' యుద్ధములందు నిమగ్నమైయుండిన అమెరికా సహాయమంతయు వ్యర్థమగుటయే గాక, ఆ స్వతంత్ర దేశములన్నియు ఐక్యమై సామ్రాజ్య దేశముల ప్రతిఘటనకు సిద్ధము కావలసి వచ్చును. ఫలితము మరొక ప్రపంచ సంగ్రామమే. బ్రిటన్, అమెరికాలు రష్యాతోనే కాక, అస్వతంత్ర దేశము లన్నింటితోను యుద్ధము చేయవలసి యుండును. ఏటంబాంబుల సహాయముతో దురాక్రమణను ప్రతిఘటింపవచ్చును. లేక దురాక్రమణ జరిపి, తాత్కాలికముగ బ్రిటన్, అమెరికాలు అఖిల ప్రపంచముపైనను అధికారమును సంపాదింప వచ్చును. కాని ప్రజల స్వాతంత్ర్య తృష్ణను అణు అస్త్రములతో ఆర్పలేరు.

ప్రస్తుతము స్వపరిపాలనను

భారతరాజ్యాంగ పరిషత్తులో:

కామన్వెల్తు బాంధవ్యము - పండిట్ నెహ్రూ వివరణ

"భారత అభ్యుదయానికి ప్రతిబంధకమని రూపిస్తే ప్రప్రథమంగా నేనే ప్రతిఘటిస్తాను"

నాలుగు మాసాల అనంతరం మే 16 న న్యూఢిల్లీలో రాజ్యాంగ నిర్మాణసభ తిరిగి సమావేశ మైంది. ఇది ఇంచుమించు ముగింపు సమావేశ మనవచ్చు.

సమావేశం ప్రారంభం కావటంతోనే ప్రధాని నెహ్రూ కామన్వెల్తు తీర్మానాన్ని ప్రతిపాదించి లండన్ ఒడంబడికనుగూర్చి 'పూసగ్రుచ్చినట్లు సభవారికి నచ్చచెప్పారు.' 'యీ నిర్ణయం భారతదేశపు అభ్యుదయానికి ప్రతిబంధక మని యెవరైనా నిరూపించగలిగితే నేనే దాన్ని ప్రప్రథమంగా ప్రతిఘటించుతాను' అని సవాలు చేశాడు.

"ఈ సభవారున్నూ కాంగ్రెసున్నూ నాకు ఏమి ఆదేశించి పంపారో దాన్ని సంపూర్ణ విజయంతో సాధించుకు రాగలిగాను. స్వతంత్ర సార్వభౌమసిద్ధితో రిపబ్లిక్ సామ్రాజ్యంగా వెలుగొందుతూ, భారతదేశం పునరుజ్వలం కావటానికి యీ ఒడంబడిక అవకాశాన్ని కలుగజేస్తోంది. కామన్వెల్తుతో తెగతెంపులు చేసుకోదలిస్తే, అనేక మహా ప్రయోజనాలకు నీళ్లు వదులుకోవలసి వస్తుంది. పోరాడవలసివస్తే పోరాడనూ గలను, మైత్రి లభించితే స్నేహమూ చేయగలను. స్నేహం ద్వారా కార్యసాధన చేసుకోటానికి అవకాశం కనిపించుతుంటే పోరాడవలసిన అవసర మేమిటి?' అన్నారు. మరింతగంభీరంగా—

"గతచరిత్రలో నిద్రపోతున్న వారూ, భారతదేశం పట్లగాని, భారతదేశపు భవిష్యత్తు పట్లా విశ్వాసం లేనివారు ఈ ఒడంబడికను అంగీకరించలే రని నాకు తెలుసు. ఇటీవల చర్చిల్ వ్రాసినట్లు 'రణసమయంలో నిబ్బరం, అపజయంలో ధిక్కారం, విజయంలో ఉదారత, శాంతి సమయంలో సౌజన్యతా' వుండాలి. చర్చిల్ నర్మ సూత్రాన్ని కార్యరూపాన సాధించిచూపాం. నేనూ నా పార్టీ కూడా 1942 రణసమయంలో అచంచలులమై నిలుచున్నాం. స్వాతంత్ర్యాన్ని సాధించి విజయాన్ని పొందివున్న యీ తరుణములో బ్రిటను పట్లా, కామన్వెల్తు పట్లా ఉదారతనూ, సౌజన్యాన్నీ ప్రదర్శించుమని యీ సభవారిని కోరుతున్నాం. గత సమరాన్నీ సమర కారణాన్నీ, సమర సమయంలో పొందిన ఖేద క్లేశాలనూ మరచిపొండి. సౌజన్యసహకారాలతో ఇప్పుడు నూతన జగత్తును నిర్మించండి

"మరోవిధముగా చెప్పవలెనంటే, కామన్వెల్తుతో పొత్తులేకుండా ఉన్నట్లయితే, భారతదేశం లక్ష్యములో పెట్టుకొనిన యీ ఆదర్శములకు హాని వాటిల్లగలదు. కామన్వెల్తులో కలసివుండుటవలన మనం, ఆసియా ఖండంలోని మన పొరుగువారితో వేరై పోవుచున్నామని, లేదా, ప్రపంచంలో మిగతా అగ్రరాజ్యాలతో మనం సహకరించి పనిచేయగలుగుట కష్టతర మగునని కొందరు తలంచుచున్నారు. ఇది చాలా విచిత్రము. కామన్వెల్తులో ఉంటూఉండగనే, మిగతారాజ్యాలతో, సన్నిహిత సంబంధములను పెంపొందించుకోగలుగుట మనకు సులభసాధ్యమని నా తలంపు. లేకపోయిన కష్టతరమగును. ఇది కొంచెం విచిత్రంగా కన్పించవచ్చును. ఏమైనా కామన్వెల్తులో ఉండుటా మానుటా అనే విషయమై నేను తరచితరచి ఆలోచించితిని. మిగతారాజ్యములతో, మనం మైత్రి నెరపుకొనుటకుగాని, వాటితో సహకరించి పనిచేయుటకుగాని కామన్వెల్తు అడ్డు రాదు.

"ప్రస్తుత సమయంలో, కామన్వెల్తునుంచి వేరై పోయినట్లయితే మనం పూర్తి ఒంటరివారమైపోతాము. ఈ ఏకాకిత్వము యీ ఒంటరి జీవితము, మనకు దుస్సహము కాబట్టి పరిస్థితుల ఒత్తిడివల్ల, ఎవరితోనో ఒకరితో, యేదో ఒకవిధముగ పొత్తు నభిలషించుట తప్పనిసరి. యీ పొత్తు 'యిచ్చి పుచ్చుకొనే' పంథాలోనే ఉండవలెను. ఇంకొకవిధముగా చెప్పవలెనంటే, యిప్పటికన్న, ఎన్నో ఎక్కువ ఒప్పందములకు లోను గావలసివచ్చును. కాబట్టి యీవిధముగా మాచినట్లైన, మిగతా రాజ్యములతో, మైత్రి పూర్వకమైన ఒప్పందములను యేర్పాటు చేసుకొనుటకు మనకు స్వేచ్ఛ ఉన్నది. మిగతా రాజ్యముల మధ్య పరస్పర సామరస్యమును సంధానించు కృషిలో మనం యథేచ్ఛగా పాల్గొనవచ్చును.

"జాతి వివక్షతతోపాటు, యింకా మనం సహించలేకున్న వెన్నో జరుగుచున్నా కామన్వెల్తులో మనం ఎలా చేరగలము, అని ప్రశ్నించుచున్నారు. ఇది సముచితమైన ప్రశ్నయేనని మన ఆలోచనలను కొంత చీకాకుపరచే ప్రశ్నయేనని ఒప్పుకొనెదను. అయినా, ఒక రాజ్యముతో గాని, లేదా ఒక రాజ్యకూటముతోగాని మనం సఖ్యత యేర్పర్చుకొన్నామంటే, ఆ రాజ్యము యొక్క, లేదా ఆ రాజ్య కూటమి యొక్క, యితర విధానము లన్నింటిని మనము ఆమోదించెదమని అర్థంగాదు. అవి చేసే యేపనికైనా మనం ఒప్పందం యిచ్చెదమని అర్థంగాదు. కాబట్టి యీ ప్రశ్నకు ఆస్కారం లేదు. వాస్తవమునకు మన దేశీయులు, ప్రపంచంలో వివిధ దేశాలలో ఉన్న జాతివివక్షతపై పోరు సాగించుచున్నారు. ఐక్యరాజ్యసమితియెదుట ప్రధాన సమస్యలలో ఒకటి, "దక్షిణాఫ్రికా భారతీయ స్థితిగతుల" సమస్య ఐక్యరాజ్యసమితి, యీ సమస్యపై నిన్న ప్రశంసనీయమైన తీర్మానం ఆమోదించినది. ఈ తీర్మానమును సమితి చే ఆమోదింపజేయుటకు కృషిచేసిన మన ప్రతినిధి వర్గము ప్రశంసార్హులు; భారతప్రభుత్వ వైఖరిని బలపరచిన రాజ్యములకు దక్షిణాఫ్రికా తప్ప, అభినందనలు.

"పీడితజాతుల సముద్ధరణ, జాతి వివక్షతా నిర్మూలన పోరాటము. యిది మన విదేశాంగ రాజనీతి మూలస్తంభములలో ఒకటి. కామన్వెల్తులో ఉండుటవల్ల యీ రెండింటి విషయంలో యేమైనా రాజీపడుచున్నామా? లేదు. మనం కామన్వెల్తులో ఒక అధినివేశముగా ఉన్నప్పటికీగూడ, దక్షిణాఫ్రికా భారతీయ సమస్యపై పోరాటం సాగించుచునే ఉన్నాము. అసలు ఈ సమస్యను, కామన్వెల్తు పరిశీలనకు తెచ్చుట చాలాప్రమాదభరితం. ఇదే జరిగితే మీరు నేను ఏది తగదంటున్నామో అది జరిగితీరుతుంది. అనగా, యీ సమస్యను మరేసమస్యకుగాని కామన్వెల్తుకు నివేదించినట్లయితే, కామన్వెల్తు తీర్పిచ్చే అధికారముగల, అగ్రవ్యవస్థగా మారుతుంది. ఒక్కొక్కప్పుడు న్యాయవిచారణ స్థానముగా మారుటే గాక, సభ్యత్వ రాజ్యముల కార్యకలాపాలను గూడ తనిఖీ చేయుట సాగించును. ఈసూత్రాన్ని అంగీకరించినట్లైతే మన సర్వస్వతంత్ర ప్రతిపత్తిని కుంచింప చేసుకొనుట సుకరము గాదు.. కాబట్టి కామన్వెల్తును అగ్రవ్యవస్థగా పరిగణించుటకు మనం ఒప్పుకోము, ఒప్పుకొనుటకు సిద్ధంగా లేము. అంతే గాదు సభ్యత్వ రాజ్యముల మధ్య తగాదాలను కామన్వెల్తుకు నివేదించుటకుమనం అంగీకరించము అయితే స్నేహభావముతో యిటువంటి విషయములను చర్చించవచ్చు. అది వేరే విషయము. ఏమైనా, మనదేశము పరిపూర్ణ స్వాతంత్ర్యమును, కామన్వెల్తు సభ్యత్వ రాజ్యముల పరిపూర్ణ స్వాతంత్ర్యమును కాపాడుటే మా ఆసక్తి.

"ఏదైనా ఒకదేశం అనుసరించే విధానములలో కొన్ని మనకు నచ్చలేదు కనుక, ఆ దేశముతో మనకు పొత్తుఉండకూడదు అనే వైఖరిని మనం అవలంబించదలచితిమంటే, ప్రపంచములో యే దేశముతో గూడా మనకు సఖ్యత దుర్లభ మగును. ఎందుచేత ననగాప్రపంచ దేశములలో మనకు నచ్చని, ఏదో ఒక విధానమును అనుసరించుచుండును. గనుక ఏదేశంతోనైన ఒక్కొక్కప్పుడు సంబంధ బాంధవ్యాలను తెగతెంపులు చేసుకోవలసినంత తీవ్ర విభేదములు పెరుగవచ్చును. సంఘర్షణగూడ తటస్థించవచ్చును. సోవియటు యూనియను చేసే ప్రతిపనీ, మీకు సమ్మతం కాలేదు. గనుక, సోవియటు యూనియనుతో రాయబార సంబంధములు ఉండగూడ దని గాని, లేదా ఆమెరికా అనుసరించే విధానములు మీకు సమ్మతంగాని, అమెరికాతో యే ఒడంబడికా తగదని మీరు వాదించగూడదు. ప్రపంచంలో ఆయా రాజ్యములు, యీపంథాలో తమ విదేశాంగ రాజనీతినిగాని, మరే పనిగాని చేయవు.

"మనకు లాభదాయకం కాగలదని, ప్రపంచ శ్రేయస్సుకై మనం లక్షించిన ఆదర్శముల సాఫల్యతకు దోహద మివ్వగలదని, తలంచుట చేతనే మనం కామన్వెల్తులో చేరితిమి. తమకు లాభదాయకముగా నుండునని తలంచి మనం కామన్వెల్తులో ఉండవలెనని మిగతా రాజ్యములు కోరినవి. కనుక పరస్పర లాభముగా కాంక్షించే, ఆయా రాజ్యములు కామన్వెల్తులో చేరినవి. అయినప్పటికీ, కామన్వెల్తులో చేరిన రాజ్యములు, తన యిష్టము వచ్చిన పంథా త్రొక్కవచ్చునని సుస్పష్టం చేయబడినది. యథేచ్ఛాపూర్వకమైన యీ పంథా ఒక్కొక్కప్పుడు కామన్వెల్తును విచ్ఛిన్నంచేయుదాకా పోవచ్చును, అంతదాకా పోయినప్పుడు కామన్వెల్తు విచ్ఛిన్నమై పోతుంది.

"కాని, ఎన్నో విచ్ఛిన్నశక్తులు తమ దుష్ట కార్యకలాపములను సాగించుచున్న నేటి ప్రపంచంలో, ఒక్కొక్కప్పుడు యుద్ధమునకు దరిదాపులలో వుండవలసినట్టి యీ ప్రపంచంలో, ఏరాజ్యం యేరాజ్యంతోనైనా కుదుర్చుకొనే సఖ్యత విచ్ఛిన్నమైపోవుటకు ప్రోత్సాహ మివ్వ తగదు. అందులో దుష్టమైన భాగములను నిర్మూలించవచ్చు; మీ అభ్యుదయమునకు అడ్డువచ్చే దేనినైనా నిర్మూలించవచ్చు. లేకపోతే, పరస్పర సహకారబద్ధమైన సఖ్యత ఉండుట మంచిది. ఇలాంటి సఖ్యత, యీనాటి ప్రపంచంలో చెరుపుకన్నా మంచినే చేయగలదు.

"కామన్వెల్తు ప్రధానుల యీ నిర్ణయం, యిప్పుడు కొత్తగా వచ్చినది గాదు. ఇదివరకు ఉన్నదానికి పూర్తిగా కొత్త స్వరూప మిచ్చి కొత్త మార్గంలో చేసిన నిర్ణయమే యిది. మనం కామన్వెల్తులోనుండి విడిపోయినా మనుకొనండి. తిరిగి మనం కామన్వెల్తులో చేరదలచుకొంటే, అప్పుడది కొత్త ప్రయత్నం అవుతుంది. అదే విధముగా కొన్ని రాజ్యములు, మనతో చేరవలెనని అభిలషించినా, వాటితో మనం చేరినా, అప్పుడది కొత్త పని అని చెప్పవలెను. తత్పర్యవసానముగా కొత్త ఫలితములు కలుగగలవు. ప్రస్తుతం, కామన్వెల్తు భారతదేశముల సఖ్యత విషయానికి వస్తే, కామన్వెల్తుతో భారతదేశమునకు చిరకాలముగా సఖ్యత ఉన్నదని, ఆ సఖ్యత 47 ఆగస్టు 15 తో పూర్తిగా మారిపోయిన దని చెప్పవలెను.

"ఇప్పుడింతకన్నా ఎక్కువ మార్పే సంకల్పింపబడినది. కామన్వెల్తు, భారతదేశముల సఖ్యతా స్వరూపం నానాటికి మార్పు చెందుతున్నా యేదో ఒకరకంగా కామన్వెల్తుతో సంబంధం ఉంటూనే ఉన్నది."

కామన్వెల్తు ఒడంబడికపై చేవ్రాలు జరుగుటకు పూర్వం నడచిన చర్చల విషయమై ప్రస్తావించుచూ, పండిట్ నెహ్రూ యిట్లనెను. "నేనంత మంచిచెరగాణ్ణికాదేమోనని నాభయం. మార్కెట్ తంత్రాలకు పద్ధతులకు అలవాటు పడినవాణ్ణిగను. నేను మంచి యోధుణ్ణనీ, మంచి మిత్రుణ్ణనీ అనుకొనెదను. అంతేగాని నేను దళారినిగాను, దీనికోసమైనా మీరు ఘట్టిగా బేరం సాగించ దలచుకొన్నప్పుడు నన్ను పంపవద్దు.

"పెరవారికి ద్వేషం పుట్టించి, ఇక్కడా అక్కడా కొన్ని మంచి షరతులను సాధించే కంటే, ఎదుటిపక్షం సద్భావమును సంపాదించు

(20 వ పేజీ చూడుడు)

పై వారము నుండి రాబోవు నవల

'నాకబలి'

రచన:

వి. డి. ప్రసాదరావు

సాధించుకొనుటకు తాహతులేని దేశము లన్నింటిపైన ఒక్కొక దేశపు ధర్మకర్తృత్వమును నెలకొల్పుటకుగాక, సమితి ధర్మకర్తృత్వమును నెలకొల్పుటే ఉచితము. తమ వలసలందలి, ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను సమితికి నివేదించుటకు సిద్ధపడని, సమితి పరిశీలనకు సమ్మతింపని సామ్రాజ్య దేశములకు ఈ దేశములను అప్పగింతపెట్టిన, అట్టి ఏర్పాట్లు క్రమముగ మరొక సంగ్రామమునకు మాత్రమే దారి తీయగలవు. ఈ వలస సమస్యల పరిష్కారము పైననే సమితి, ప్రపంచ భవిష్యత్తు ఆధారపడి యుండును.

ముఖచిత్రం:

షోలంగిపురం
నృసింహస్వామి దేవాలయం.
చిత్రకారుడు:
రంగనాథన్, మద్రాసు.

బర్మా సాయుధ విప్లవం

శ్రీ నిష్టల కేశవరావు

19 వ శతాబ్దమునకు పూర్వము బర్మా జాతీయరాజులచే పాలింపబడుచుండెడిది. ఈ శతాబ్ద ప్రథమ భాగమున బర్మా రాజులు ఆంగ్లేయుల స్వాధీనమందుగల ప్రదేశములను ఆక్రమింపగోరుటచే ఆంగ్లేయులతో యుద్ధము సంభవించెను. ఈ యుద్ధమున బర్మారాజు ఓడిపోవుటచే, అస్సాం, అరకాను తీరప్రాంతము తేనేశ్వరము మరికొన్ని యితర ప్రాంతములు ఆంగ్లేయుల వశ మయ్యెను. 1852 లో మరియొక యుద్ధము సంప్రాప్తమయ్యెను. దీనివలన దిగువ బర్మా ఆంగ్లేయులవశ మయ్యెను. 1885కు పూర్వం వరకూ బర్మాతో మిగిలిన భాగము స్వతంత్రముగా నుండెను. ఆ కాలములో ఫ్రెంచివారు ఆంగ్లేయులపై ద్వేషభావము వహించుటచే, వారు ఫ్రెంచి ఇండోచైనానుంచి బ్రిటిష్‌బర్మాపై దండెత్తుదురేమో ననియూ, బర్మారాజు ఆంగ్లవర్తకులకు కల్పించిన చిక్కులను గమనించి బ్రిటిష్‌వారు బర్మాను పూర్తిగా ఆక్రమించిరి. నాటినుండియూ బర్మా బ్రిటిష్ సామ్రాజ్య భాగములో నొకటిగా వర్ధిల్లెను.

20 వ శతాబ్దమున బర్మీయులు భారతీయుల వలెనే స్వాతంత్ర్య సమరము కావింప నారంభించిరి. స్వాతంత్ర్య ప్రియులగు బర్మీయులు "ఆంగ్‌సాన" మొదలగు వారి నాయకత్వమున నిలచిరి. ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరము మిత్రమండలి సైన్యములు జపానీయులను ఓడించి, బ్రిటిషువారు బర్మాను పునరాక్రమించిన తరువాత 1947 అక్టోబరులో బర్మా సంపూర్ణ స్వాతంత్ర్యమును అంగీకరించిరి.

1948 అక్టోబరు 20 వ తేదీన బర్మా రాజ్యాంగపరిషత్తు ప్రారంభింపబడెను. సమర్థుడైన జాతీయనాయకుడు ఆంగ్‌సాన్ నాయకత్వమున స్వతంత్రబర్మా ముందడుగు వేయసాగెను. కాని ఆరుమాసములు స్వాతంత్ర్యము అనుభవించిన తరువాత బర్మా తన ప్రథమపుత్రుడగు ఆంగ్‌సాన్‌ను కోల్పోయెను. దేశంలో అంతరజాతియైన కరెన్లకూ, బర్మా జాతీయ ప్రభుత్వమునకూ అభిప్రాయభేదములు కలుగకుండునట్లు మిస్టర్ ఆంగ్‌సాన్ శక్తివంచన లేకుండా పనిచేసి తన సమర్థతను ప్రపంచమునకు వెల్లడిచేసెను. శాంతి ప్రియుడూ సమర్థుడూ అయిన ఆంగ్‌సాన్‌ను ఎవరో హత్యచేసిరి. సమర్థుడగు నాయకుడు లేనందున బర్మా యూనాడు అనేక ఇబ్బందులు పడవలసివచ్చెను. బర్మా ప్రధాని ఆంగ్‌సాన్ హత్యను విమర్శిస్తూ సుప్రసిద్ధ అమెరికన్ జాతీయ పత్రిక "న్యూయార్క్ టైమ్సు" తన సంపాదకీయ వ్యాసంలో యీ విధంగా వ్రాసింది. "బర్మా యీనాడు తన నాయకుడు లేని నష్టాన్ని అనుభవిస్తోంది. సమర్థతగల నాయకుడు బర్మా స్వాతంత్ర్యము లభించిన ఆరు మాసాలలోనే హత్యచేయబడ్డాడు. ఆంగ్‌సాన్ హత్య కంటే బర్మాలో జరిగిన అవివేక కార్యమింకొకటి లేదు."

కరెన్లు

వీరు బర్మాలో ఒక ప్రత్యేక జాతికి చెందినవారు. వీరు మూర్ఖులు. వీరికి పట్టుదల ఎక్కువ. దేశంలో అల్పసంఖ్యాకులు. పూర్వం బర్మాలో బ్రిటిషు ప్రభుత్వరక్షణకు ప్రాణాలు ధారపోసిన జాతి. జపానువారిని బర్మానుండి తరుముటకూ, దేశాన్ని ఫాసిస్టు మూకలనుండి రక్షించుటకు వీరు మిత్రమండలి సైన్యములతో సంపూర్ణముగ సహకరించిరి. అందుచేత బ్రిటిషువారు వీరిజాతి స్వాతంత్ర్యమును మన్నింతుమని వాగ్దానము కావించిరి. బ్రిటిషువారు చెప్పినట్లుగా బర్మా యూనియన్ ప్రభుత్వం, స్వాతంత్ర్య బర్మా రాజ్యాంగ పరిషత్తు ప్రారంభించబడిన నాడే దేశంలో కల మైనారిటీ జాతి పునరుద్ధరణకు అనేకవిధములైన ప్రణాళికలను ప్రవేశపెట్టెను!

ఈ కరెన్ జాతి అధికంగా కల ప్రాంతాలలో "కరెన్ నేషనల్ యూనియన్", "కరెన్ యూత్ ఆర్గనైజేషన్" అని రెండు ప్రముఖ సంస్థలు కలవు. ఇందులో ఒక సంస్థ అయిన "యూత్ ఆర్గనైజేషన్" వారు, ఓరావతీ, తెనాస్సిరం, ఇన్‌సేన్, హంతవాడి, పెగూ జిల్లా, నాగ్‌లెజాన్ జిల్లాలతో ప్రత్యేక కరెన్ రాష్ట్రాన్ని స్థాపించవలసిందని ఆందోళన చేయసాగిరి. కాని బర్మా ప్రభుత్వం 1948 అక్టోబర్ 20 తేదీన బర్మా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మిస్టర్ బా-ఉ అధ్యక్షతక్రింద ప్రాంతీయ స్వీయపరిపాలనా విచారణ సంఘం అని పేరుతో నొక కమీషన్‌ను స్థాపించిరి. ఈ కమీషన్ ఉత్తర బర్మా అంతా పర్యటన జరిపి కరెన్లు కోరిన ప్రత్యేక కరెన్ రాష్ట్రానికి కల అవకాశములనుగురించి అనేకవిధములుగా పరిశీలన జరిపి, చివరకు ఈ "ప్రత్యేక కరెన్ రాష్ట్రం" బర్మా యూనియన్‌లో అంతరభాగంగా స్థాపించవలె నని బర్మా రాజ్యాంగపరిషత్తుకు సిఫార్సు చేయుటకు నిశ్చయించుకొనెను.

కాని యిచ్చట గల విశేషము ఒకటి కలదు. కరెన్ నేషనల్ యూనియన్‌సంస్థ కోరిన ప్రకారం ఆయా ప్రదేశములందు వారి జనాభాను చూస్తే కరెన్లు ఎంతో మైనారటీగా వున్నారని బుజువయ్యెను. (మరియూ కరెన్ ప్రజలలో చాలామంది ఈ సంఘంతో ఎలాంటి సంబంధమూ పెట్టుకొనక పూరకుండిరి.) వీరిలో చాలామంగి బౌద్ధులు. కావున వీరు కరెన్ రాజకీయపక్షాలతో ఏవిధమైన సంబంధమూ పెట్టుకొనక అఖిలబర్మా బౌద్ధకరెన్ సంఘం చెప్పుచేతలలో కలరు. ఇంకనూ వీరు కరెన్ల తిరుగుబాటును తీవ్రంగా ఖండించి ప్రభుత్వ విధానాన్నే బలపరుస్తూ వచ్చేరు. ఇదీ కాక కరెన్ నేషనల్ యూనియన్‌కూ, కరెన్ యూత్ ఆర్గనైజేషన్‌వారికీ చాలా అభిప్రాయ భేదాలున్నాయి. కరెన్ నేషనల్ యూనియన్ కోరిన పూర్వోక్తములయిన డివిజన్లలో ప్రత్యేక కరెన్ రాష్ట్ర నిర్మాణం అక్రమమనీ యూత్ ఆర్గనైజేషన్‌వారి వాదం. అందుచేత నేషనల్ యూనియన్‌వారి కార్యక్రమాన్ని ఖండించడమే కాకుండా, సమయానికి ప్రత్యేక కరెన్ రాష్ట్ర నిర్మాణానికి సంబంధించినంతవరకూ ప్రభుత్వప్రతిపాదనలను బలపరిచేవారు.

ఇంక ప్రభుత్వవైఖరిని చూస్తే న్యాయానికి మరేదేశమూ అల్పసంఖ్యాకులపట్ల యీమాత్రం ఉదారస్వభావంగా ప్రవర్తించలేదని విస్పష్టమౌతున్నది.

బర్మా రాజ్యాంగపరిషత్తు ననుసరించి ప్రభుత్వం రెండు శాసనసభలద్వారా జరుగుచున్నది. అందులో మొదటిది "ఛాంబర్ ఆఫ్ డెప్యూటీస్"; "రెండవది ఛాంబర్ ఆఫ్ నేషనాలటీస్" ఇందులో మొదటిది కేవలం జనాభాను పట్టి ప్రాబల్యం కలదు. ఈ సభలో మైనారటీ వర్గానికి చెందిన కరెన్ల జనాభానుపట్టి 2 స్థానాలు మాత్రమే దక్కినా, రెండవ సభలోమాత్రం 125 స్థానాలకు, కరెన్‌జాతి జనాభాను పట్టి చూస్తే 10 స్థానాలు మాత్రమే రావలసివున్నది. అయినను ఉదారస్వభావముకల బర్మా యూనియన్ ప్రభుత్వం వీరిలోని అసంతృప్తిని పోగొట్టుటకు వీరికి 24 స్థానాలను ప్రత్యేకంగా కేటాయించెను.

ఇంక బర్మా మంత్రివర్గం చూస్తే 17 మంది మంత్రులుగల యీ మంత్రివర్గంలో ఇద్దరు యీ కరెన్‌జాతికి చెందినవారు. మంత్రివర్గంలో ఒక మంత్రి ప్రత్యేకంగా "కరెన్ అఫ్లిస్టు"కూ వారి ప్రత్యేక వ్యవహారములు చూచుకొనుటకూ నియమింపబడెను. నేటి స్వాతంత్ర్య బర్మా సర్వసేనాని యీ కరెన్‌జాతికి చెందినవాడే! ఇంక సైన్యాన్ని పరిశీలిస్తే కరెన్లదే అధిక సంఖ్య. ఇందుకు కారణం వారిలో స్వతహాగల క్రమశిక్షణ, ధైర్యసాహసాలూ చూచి పూర్వం బ్రిటిష్ గవర్నమెంటు యీ జాతిని అధికంగా సైన్యంలోకి చేర్చుకునేది. నాటి సైన్యమే నేటికినీ స్వాతంత్ర్యబర్మాసైన్యంక్రింద పరిగణింపబడుచున్నది. కావున నేటికినీ బర్మా యూనియన్ సైన్యంలో కరెన్లదే పైచేయి, దీనినంతటినీపట్టి పరిశీలించిచూస్తే అధికసంఖ్యాకుల చేతిలో అల్పసంఖ్యాకులకు అన్యాయం జరుగుచున్నదన్న వాదం కేవలం నిరాధారం అని బుజువగుచున్నది.

బర్మా సుప్రీంకోర్టు ఛీఫ్‌జస్టిస్ సర్ బా-ఉ అధ్యక్షతక్రింద స్థాపించబడిన ప్రాంతీయ స్వీయపరిపాలనా విచారణసంఘం, కరెన్ల ప్రత్యేకరాష్ట్ర వాంఛకు కల అవకాశాలను గురించి యూనియన్ ప్రభుత్వమునకు సిఫార్సు చేసెను. బర్మా యూనియన్ ప్రభుత్వం ఈ సిఫార్సును గమనించి, వారి ప్రత్యేకరాష్ట్ర వాంఛపట్ల ఎంతో సానుభూతినీ సోదరభావమునూ ప్రదర్శిస్తూ 1949 ఫిబ్రవరి 1 వ తేదీన బర్మా శాసనసభలో ప్రతిపాదించేరు. ఈ శాసనసభలో ప్రసంగిస్తూ ప్రధాని థాకిన్‌నూ యీ మైనారటీ వర్గానికి చెందిన కరెన్ల ప్రత్యేక రాష్ట్ర వాంఛను మన్నింతుమని వివరిస్తూ కరెన్ రాష్ట్రం ప్రభుత్వంలో అంతర్భాగంగా ఉండవలెనా? అక్కరలేదా? అను విషయం ప్రభుత్వం నిర్ణయించవలెననీ కరెన్ నాయకులు మాత్రం రాష్ట్ర పరిహద్దులను నిర్ణయించవలెననీ చేసిన తీర్మానాన్ని ఉభయపక్షాలూ అంగీకరించాయి.

ఇది యిలా ఉండగా కరెన్ యూనియన్, "కరెన్ నేషనల్ డిఫెన్సు ఆర్గనైజేషన్" అని ఒక ప్రయివేటు సంస్థను నెలకొల్పెను. ఇందులో పూర్తిగా అహంభావపూరితులైన కరెన్ యువకులు చేరిరి వీరు యీ సంస్థవల్ల సైనిక శిక్షణ పొందిరి. ముష్కరులైన యీ కరెన్లు అవకాశవాదులగు బర్మాకమ్యూనిస్టులతో చేయిచేయి కలిపిరి. బర్మాలో కల వివిధ కమ్యూనిస్టులు యీ కరెన్లకు సాయపడుదుమని వాగ్దానము కావించిరి. బర్మా కేంద్రకమ్యూనిస్టుపార్టీలో అంతర్భాగంగా కల రెడ్‌ఫ్లాగ్ కమ్యూనిస్టులూ, వైట్ ఎల్లో బ్యాండు కమ్యూనిస్టులూ, వైట్‌బ్యాండు కమ్యూనిస్టులూ కరెన్లను బలపరుస్తూ వచ్చేరు. దేశంలో వామపక్షానికి చెందిన "పీపుల్స్ వాలంటియర్స్" సంస్థకూడా తాత్కాలికంగా కరెన్‌కమ్యూనిస్టులను బలపరచడం ప్రారంభించేరు.

ఇది యిలా ఉండగా తీవ్రజాతీయతకు పేరుపొందిన "కరెన్ నేషనల్ డిఫెన్సు ఆర్గనైజేషన్" ప్రభుత్వమును మోసగించుటకు ఒక ఎత్తు ఎత్తింది. దేశంలో రానున్న అంతర్యుద్ధ ప్రమాదాన్నుంచి కరెన్ జాతిని రక్షించుటకు తాము కంకణము కట్టుకున్నట్లు ఒక ప్రకటనను చేసిరి. దేశంలో అనేక ప్రాంతాలలో యీ సంస్థవారు ఆత్మరక్షణ దళాల్ని స్థాపించారు. ఇంకనూ వీరు దేశాన్ని అంతర్యుద్ధప్రమాదాన్నుంచి రక్షించుటకు తాము సంసిద్ధులమని ప్రభుత్వమునకు ప్రతిపాదించిరి. దీనినంతయూ గమనించి మారాలోచన లేని థాకిన్‌నూ, అతని మంత్రివర్గమూ, ఈ కరెన్ నేషనల్ డిఫెన్సు ఆర్గనైజేషన్ జాతికి చెందిన సంస్థ అని గుర్తెరుగక వీరి హామీని విశ్వసించి, వారికి ఆయుధములూ, యితర సామానులు సరఫరా చేసిరి. ఇంకనూ వీరిని నమ్మి అనేక ప్రముఖ కేలక స్థావరాలలో కల నగరముల రక్షణ బాధ్యతను వీరికి అప్పగించిరి. వాలంటియర్సు అని చెప్పుకొన్న యీ సంస్థ సభ్యులకు అనేక సౌకర్యాలను కలిగించి బోలెడంత ధనం జీతాల క్రింద యీయసాగింది. ఇలా అనేక విధాలుగా తమకు దొరికిన అవకాశాలను వినియోగించి ప్రభుత్వమును మోసగించడానికి యీ ఆర్గనైజేషన్ వారు వెనుకాడలేదు.

బర్మా కరెన్లతో బర్మా కమ్యూనిస్టులు లీనమై సాయుధవిప్లవానికి ప్రచారం చేయసాగేరు. అసలు యీ కరెన్లకూ కమ్యూనిస్టులకూ ఏమాత్రం పడదు. వీరి రెండుపక్షాలమధ్యా అభిప్రాయభేదాలు చాలా కలవు. జాతిమత విచక్షణ లేని బర్మా కమ్యూనిస్టులు యూనియన్ ప్రభుత్వంను ఎలాగేనా కూలద్రోయాలని తాత్కాలికంగా యీ కరెన్లతో చేరి సాయుధవిప్లవానికి సంసిద్ధులైనారు. ఈమధ్య, చైనాలో కమ్యూనిస్టులు సాధించిన సాయుధవిప్లవ విజయాలు యీ బర్మా కమ్యూనిస్టులను కలవరపెట్టసాగెను. బర్మా కరెన్లకు, నేషనల్ డిఫెన్సు ఆర్గనైజేషన్ అనేక విధాలుగా ప్రభుత్వాన్ని మోసగించి వివిధరకములైన ఆయుధములను పంచిపెట్టెను. బర్మా కమ్యూనిస్టులు తమ పలుకుబడిని ఉపయోగించి దగ్గరనున్న చైనానుంచి ఆయుధాలను సంపాదించి సాయుధవిప్లవానికి సంసిద్ధులైనారు.

ఇంక, కచిన్, చిన్, జాతులవారిని బర్మా రాజ్యాంగ పరిషత్తు ననుసరించి ప్రభుత్వం వీరిని అల్పసంఖ్యాకులుగా గుర్తించింది. తమపట్ల ప్రభుత్వం అనుసరించిన వైఖరి వీరికి తృప్తినీయలేదు. కావున వీరు బర్మాప్రభుత్వంపై కసి తీర్చుకొనుటకు విప్లవకారులతో చాటుగా సంభాషణలు ప్రారంభించేరు. ఇది యిలా ఉండగా కరెన్, కమ్యూనిస్టు విప్లవకారులు తాము శాంతిప్రియుల మని చెప్పుకొనుచూ ఉత్తరబర్మా అంతా పర్యటనచేసి బలవంతంగా దేశరక్షణ విరాళములను ప్రోగుచేసిరి. బర్మా ప్రభుత్వ సైన్యంలో పనిచేస్తున్న కరెన్లను విప్లవానికి ప్రోత్సహించారు. చిండ్విన్ నది ఎగువ భాగము దాడులకు అనువైనదని గుర్తించి, బర్మాకమ్యూనిస్టులు అక్కడ కల ప్రాంతీయ కొండజాతులవారు అయిన "కచిన్", "చిన్", జాతులవారి వద్ద చేరి, బర్మాయూనియన్‌ప్రభుత్వంవారిపట్ల అనుసరించిన వైఖరిని, వారికి చేసిన అన్యాయాన్ని వారికి బోధించి, అచంచల ప్రభుభక్తి కల ఆ ప్రాంతీయులను సాయుధవిప్లవానికి రేకెత్తించారు. అమాయకులూ, మూఢులూ అయిన యీజాతులవారు ప్రభుత్వంపై కత్తి కట్టేరు.

దేశంలో విప్లవం నెలకొనే సూచనలు యింకా అధిక మయినాయి. ప్రభుత్వ మిలిటరీ, పోలీసు దళాలకు చెందిన కరెన్ల సహాయంతో ప్రభుత్వ ఖజానా దోచుకో మొదలిడిరి. మాచిన్‌నుంచి రంగూన్‌కు పోతున్న 25 లక్షలు రూపాయలను మిలిటరీపోలీసుశాఖలో కల కరెన్ల సహాయంతో ఆఖజానాను లూటీచేసి వివిధరకములైన ఆయుధాలనూ, మందు సామానులనూ కొని సాయుధవిప్లవానికి తయారుచేసేరు. ఇది యిలా ఉండగా ఒక్కమారు కరెన్‌కు కమ్యూనిస్టులు తిరుగుబాటు ప్రారంభించేరు. యూనియన్ ప్రభుత్వసైన్యంలో పనిచేస్తున్న కరెన్ దళాలు విప్లవంసాగించాయి. మూఢులగు యీకరెన్లు

(22 వ పేజీ చూడుడు)

బాపూజీ ఆశించిన పంచాయితీరాజ్యం

శ్రీ ముక్తేవి శ్రీరంగాచార్యులు

సంవత్సరాల తరబడి నిరీక్షిస్తూన్న పంచాయతీ బిల్లు స్వరూపము బయట పడింది. పంచాయతీలమీద నేటివరకు ఉన్న జిల్లాబోర్డుల అధికారాలకు స్వస్తి చెప్పి గ్రామాలు మరల ప్రాచీన ఔన్నత్యం పొందుటకు అనువగు విధంగా స్వయంనిర్ణయాధికారి సంస్థలుగా ఏర్పర్చుటకు ఈబిల్లు తీసుకొస్తూన్నామని మద్రాసు ప్రభుత్వం ప్రకటించింది. బాపూజీఆశయాలను ఈ బిల్లు ఎంతవరకు ఫలింపజేస్తుంది, మిగిలిన రాష్ట్రాలు ఏం చేస్తూన్నాయి అనే విషయాలన్నింటినీ పరిశీలిద్దాం.

ప్రాచీనకాలంలో పంచాయతీ విధానం

ప్రాచీనకాలంలో భూమిహక్కు పంచాయతీలే అనుభవించేవి. రాజు మధ్యలోనే సృష్టింపబడ్డాడు. తంజావూరి రాజుల కాలంలోనూ కూడా వారు గ్రామసంఘాలనుంచి భూమిని కొని బ్రాహ్మణులకు దానం చేసినట్లు చరిత్రాధిరాలు గలవు. ఔరంగజేబు కూడా ఢిల్లీకి పరిసర భూమిని కొన్నాడు. క్రీ. శ. 1025 లగాయతు 1042 వరకు సింహళదేశపు ప్రభువుగా ఉన్న మహేంద్రుని శాసనంద్వారా కూడా ఈలాంటి గ్రామ సాంఘిక న్యాయసూత్రాలే అమలులో ఉన్నట్లు తెలుస్తున్నది.

ఇందుకు పౌరాణిక ప్రమాణాలు కూడా అనేకము ఉన్నాయి. కృతయుగంలో రాజు లేనట్లు శాంతిపర్వంలో ఉన్నది. అధర్మం, హింసలు చెలరేగినందున ఆ పిమ్మట రాజును సృష్టించినట్లు భీముడు ధర్మరాజుతో చెప్పిన కథాక్రమం శాంతిపర్వంలో ఉంది. పంచాయతీదార్లు అయిదుగు రుండవలెనని శుక్రనీతిలో ఉన్నది. ఈ గ్రామపెద్దలు చేయు నిర్ణయాలు ప్రభువు విధిగా అంగీకరించాలని బృహస్పతి నీతిశాస్త్రంలో ఉంది. ఆ రోజులలో పరాయి గ్రామంవాడు నేరం చేస్తే ఆ నేరం చేసినవాడిని సదరు గ్రామస్థులు 45 రోజులలో అప్పగించవలెననియు, వారీ ఆచూకీ తీయలేనిచో ఆ గ్రామం 125 కాలదండముల బంగారం చెల్లించాలనియు నియమము ఉండేది. గ్రామ పాలకులు దొంగని పట్టజాలనిచో ఆ నష్టము కట్టి ఇవ్వాలనియు, ఆలా చేయనిచో మరణదండన అనియు కూడా ఆపస్తంభుడు గ్రామపాలకుల విధులనుగూర్చి తెలియజేస్తూ తన సూత్రాల్లో వ్రాశాడు. ఈ మాదిరిగా గ్రామపంచాయతీ దార్లకు అధికారంతోపాటు బాధ్యతకూడా ఉంటూ ఉండేది. ఆ పిమ్మట రాజభాగం 1/6 వంతు అని నిర్ణయించబడ్డది. క్రీ. శ. 1800 సంవత్సరములో ఈష్టుఇండియా ఉద్యోగిగా పనిచేసిన డాక్టరు బుచనన్ రాజభాగం పోను మిగిలిన పంటలో ఈ దిగువ విధంగా పంపిణీ జరిగినదని తన డైరీలో వ్రాసుకొన్నాడు. పురోహితునకు 5, గ్రామధర్మానికి 5, మండలికి 2, కుమ్మరికి 2, కమ్మరికి 2, వడ్రంగి 2, చాకలి 2, కొలగానికి 4, వెట్టికి 7, నాయకునకు 8, గుమాస్తాకు 10, తలారికి 10, కరణానికి 45, మునసబ్‌కు 45, నీటిసప్లయిదారు 20 ప్రకారం ఈ మాదిరిగా పంచుకొనేవారని వ్రాసుకొన్నాడు. ఈమాదిరిగా "డిమాక్రటిక్ సోషలిజమ్" అనాడే అమలులోపెట్టి మనం ప్రపంచఖ్యాతి గాంచాము.

అగర్వాలాప్రణాళిక ఏం చెబుతూంది?

అందువల్లనే బాపూజీ ఆ ప్రాచీనకాలం నాటి పంచాయితీ విధానాన్ని చేపట్టుటే మన ఆదర్శంగా ఉండాలని ఎలుగెత్తి పలుమారులు మనజాతిని హెచ్చరించాడు. ఇంతేగాక మన దేశానికి అనువైనవిధంగా పంచాయితీ రాజ్య ప్రణాళికను తయారుచేయవలసిందిగా అగర్వాలాను నియమించాడు. బాపూజీ కోరిక మన్నించి అగర్వాలా ఒక ప్రణాళికను తయారుచేసి మన ముందు ఉంచాడు. అందులో నియమాలు ఈవిధంగా ఉన్నాయి. యుక్తవయస్కులందరూ ఓటర్లుగా ఏర్పడి ప్రతిగ్రామంలోనూ, పంచాయితీదార్లను ఎన్నుకొని పంచాయితీని నెలకొల్పాలి. మూడు సం॥రాల కొకమారు ఎన్నిక జరపాలి, పంచాయితీదార్లందరు కలిసి అధ్యక్షుని ఎన్నుకొనుటకు ప్రయత్నించాలి. ఆలా సాధ్యపడనిచో ఓటర్లందరు కలిసి అధ్యక్షుని ఎన్నుకోవాలనియు, ఏ పంచాయితీదారున్నూ మూడుసార్లుకంటె ఎక్కువ పర్యాయములు ఎన్నుకొనబడరాదనియు, గ్రామోద్యోగియుల సభ్యులుగా ఉండరాదనియు ఆ ప్రణాళికలో తెలియజేశారు. ఈ పంచాయితీదార్లు జనాభానుబట్టి 5 లగాయతు 11 వరకు ఉండవచ్చునన్నాడు. ఇవి పాఠశాలల మీద అజమాయిషీ, రక్షణ, శిస్తులునిర్ణయం, సమిష్టి వ్యవసాయం, గ్రామవర్తకవ్యాపారాలు, ఆరోగ్యం, వస్తురూపంలోనే శిస్తులు వసూలు చేయడము మొదలగు ఏగ్రామంయొక్క కార్యకలాపాలు ఆ గ్రామ పంచాయితీ చే నిర్వహిస్తాయి. సివిల్, క్రిమినల్ తీర్పులు పంచాయితీలే చెపుతాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో జిల్లాకోర్టులకు అప్పీలు చేసుకొనవచ్చును. ఇలా ప్రతిగ్రామంలోనూ పంచాయితలను ఏర్పాటుచేయాలి. ఆ పిమ్మట 20 గ్రామాల పంచాయితీ అధ్యక్షులు కలిసి తాలూకా పంచాయితీగాను, తాలూకా పంచాయితీ అధ్యక్షులు జిల్లా పంచాయితీగాను, జిల్లా పట్టణపంచాయితీ అధ్యక్షులు రాష్ట్రపంచాయితీగానూ ఏర్పడాలన్నారు. రాష్ట్రపంచాయితీయే రాష్ట్రశాసన సభ. రాష్ట్రపంచాయితీదార్లందరు కూడి అధ్యక్షుని ఎన్నుకొంటారు. వివిధరాష్ట్రపంచాయితీ అధ్యక్షులు కలిసి కేంద్రపంచాయితీని ఏర్పాటు చేయాలి. అన్నిరాష్ట్రాలలో ఒకే సభ పని చేస్తుంది. నేటివలె రెండు ఉండరాదు. ఈమాదిరిగా ఏ గ్రామానికి ఆ గ్రామం రిపబ్లిక్‌గా ఏర్పాటుచేయబడుతుంది మనదేశమంతా ఈ మాదిరిగా గ్రామ, తాలూకా, జిల్లా, రాష్ట్ర, పంచాయితీలను ఏర్పాటుచేసుకొని ఆయాపంచాయితీలు తమ ఆధ్వర్యంక్రిందనున్న ప్రాంతాల్లో తమతమ కార్యకలాపాలు సాగించాలి. గ్రామ పంచాయితీలకు పై పంచాయితీలు సలహాలను మాత్రమే ఇచ్చేవిగా ఉంటూఉంటాయి. పూర్తి స్వాతంత్ర్యము గ్రామపంచాయితీల పరమై యుంటుంది. కేంద్ర, రాష్ట్రపంచాయితీలకు మంత్రులు కులాలవారిగాక మేధాసంపత్తినిబట్టి నియమింపబడుదురు. అయితే పంచాయితీ సభ్యులెవ్వరునూ మంత్రులుగా నియమింపబడరాదు. జిల్లాజడ్జీలను జిల్లా పంచాయితీయున్నూ హైకోర్టుజడ్జీలను రాష్ట్ర పంచాయితీయున్నూ, సుప్రీంకోర్టు జడ్జీలను కేంద్రపంచాయితీయున్నూ ఏర్పాటుచేస్తుంది. జిల్లాకోర్టులమీద హైకోర్టుకున్నూ, అందుమీద సుప్రీమ్ కోర్టుకున్నూ అధికారం ఉంటుంది. వీటిపైన ఆయా పంచాయితీలకు ఎట్టి అధికారం ఉండదు. అవినీతి, అసమర్థత ఉంటేనే తప్ప నూతన పంచాయతీ వీలైనా ఈ జడ్జీలను మార్చరాదు. అన్ని పంచాయతీలకు మూడు సం॥ రాల కొకమారు ఎన్నిక జరపాలి. ఇవి అగర్వాలాప్రణాళికలోని ముఖ్యసూత్రాలు. ఇక ఈప్రణాళికను ఆధారంగాతీసుకొని ఏయేరాష్ట్రాలలో ఎంతవరకు పని జరిగిందో పరిశీలిద్దాం.

సంయుక్తరాష్ట్రంలో పంచాయితీ విధానం

21 సం॥ రాల పై బడిన వారందర్లు ఓటర్లుగా చేర్చబడ్డారు. ప్రత్యేక నియోజకవర్గాలు అంటూ లేవు. అన్నీ సంయుక్తనియోజకవర్గాలు మాత్రమే. ఈరాష్ట్రప్రభుత్వం న్యాయపరిపాలనా నిర్వహణకొరకు అదాలత్ పంచాయతీలనూ, మిగిలిన కార్యకలాపాలకు గోన్ పంచాయితీలను విడు విడిగా రెండురకాలు అయిన పంచాయితీలను గ్రామాల్లో ఏర్పాటుచేసింది. సంయుక్తరాష్ట్రం మొత్తం జనాభా 5½ కోట్లు. 2 కోట్ల 72 లక్షలు ఓటర్లుగా చేరారు. రాష్ట్రం మొత్తంమీద 35 వేల గోన్ పంచాయితీలున్నూ 81 వందల అదాలత్ పంచాయితీలున్నూ ఎన్నికల ద్వారా ఈ సం॥రము ఫిబ్రవరి మాసాంతానికి ఏర్పాటుచేసింది ఆ రాష్ట్ర ప్రభుత్వం.

గోన్ పంచాయతీలు. గోన్ పంచాయితీలు గోన్ సభల కార్యప్రణాళికను అమలు జరిపేవిగా ఉండి పనిచేస్తాయి ఈ గోన్ సభలు అనగా జనరల్ బాడీలాంటివి, బడ్జెటు పాసుచేసి అమలు చేయిస్తాయి. గోన్ పంచాయితీలు అనగా వర్కింగ్ కమిటీలాంటివి. ఇవి బడ్జెటు తయారుచేసి గోన్ సభల ఎదుట పెడతాయి ఈ ప్రకారంగా జనరల్ బాడీలాంటిది ఒకటి, వర్కింగ్ కమిటీలాంటిది మరొకటి గలవు. ఈ ప్రకారంగా రెండువిధములుగా విభజించబడి కార్యకలాపాలు సాగిస్తూన్నాయి. ఇవి వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధికి కూడా తోడ్పడి పనిచేస్తాయి. గ్రామవలంటీర్ దళాన్ని కూడా ఇవి ఏర్పాటు చేసుకోవచ్చును. ఈ గోన్ పంచాయితీలు మన జిల్లాబోర్డులు, మునిసిపాలిటీలు చేసే పనులన్నింటినీ నిర్వహిస్తాయి. మైనారిటీలకు, షెడ్యూలు తరగతికి చెందిన వారికి జనాభానుబట్టి సీట్లు ఏర్పర్చబడ్డాయి. గోన్ సభలు వివిధకార్యక్రమాలు చేయుటకై సబ్ కమిటీలను నియమించి కార్యప్రణాళికలను అమలు జరుపవచ్చును. ఈమాదిరిగా కార్యక్రమం సాగించుటకై రాష్ట్రం మొత్తంమీద 16 లక్షలు గోన్ సభల సభ్యులు ఎన్నికై కార్యక్రమం ఉపక్రమించారు.

అదాలత్ పంచాయత్ ముఖ్యంగా న్యాయ పరిపాలన నిర్వహణకై ఈ అదాలత్ పంచాయితీలను ఏర్పాటుచేసారు. దీంతోపాటు విద్యమీద కూడా అధికారం ఇవ్వబడింది. ఇండియన్ పెనల్ కోడు సెక్షనులక్రింద, జూదం, మొదలగు విషయములతోపాటు విద్యమీదకూడా ఇవి అధికారం కలిగిఉన్నాయి. రు. 100/-ల వరకు జరిమానా విధించవచ్చును. సివిల్ విషయములో 100-0-0 లకు మించకుండా విచారించవచ్చును. మైనర్లు, విభాజ్యము, లెగసీ మొదలగువాటిపై వీటికి అధికారం లేదు. భూమిసంబంధమైన లాండు రివిన్యూ ఆక్టుక్రింద వచ్చే తగాదాల రు. 200/ లు విలువ మించనవి అయితే ఇవే పరిష్కరించవచ్చును. గోన్ సభలలోవలె వీటిలో మైనారటీలకున్నూ షెడ్యూలు తరగతులవారికిన్నీ సీట్లు రిజర్వు చేయబడలేదు. సంయుక్త నియోజకవర్గాలుద్వారా ఎన్నికలు జరుపబడ్డాయి. ఒక లక్ష 76 వేల అదాలత్ పంచాయితీదార్లు ఎన్నుకోబడి న్యాయపాలన జరిపిస్తున్నారు. ఎన్నికలన్నీ శాంతి-సామరస్యాలతో జరిగాయి.

బీహార్‌లో పంచాయతీ రాజ్యం

వయోజనులంతా ఓటర్లుగా ఉన్నారు. యు. పి. లోవలె న్యాయపరిపాలనకొరకు గ్రామ కచేరీయున్నూ మిగిలిన కార్యకలాపాలకు గ్రామ పంచాయితీయున్నూ రెండుగా ఏర్పాటు చేయబడి కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

గ్రామపంచాయత్: వయోజనులందరు అనగా 21 సం॥ రాలపైబడిన వారందరు ఇందులో సభ్యులే. ఈ సభ్యులందరు కలసి "ముఖ్య" అనువానిని సం॥ రాని కొకమారు పంటకాలంలో ఎన్నుకొంటారు. ఆతడే 7 లగాయతు 15 వరకు కార్యవర్గ సభ్యులను నామినేట్ చేసుకొంటాడు. ఆతనిలో చెడు ప్రవర్తన ఉంటే తీసివేసే అధికారం (ప్రతి సాలీనా కలిసినప్పుడు సభ్యులు మెజారిటీ ఓటుతో) ప్రజల హస్తగతమై యున్నది. ఆతను పోతే ఆతనితోపాటు కార్యవర్గము రద్దయినట్లే. "ముఖ్య" మన పంచాయతీ బోర్డుల అధ్యక్షునిలాంటి వాడన్నమాట. సభ్యుల కాలపరిమితి మూడు సం॥రాలు. జిల్లాబోర్డులకీ, వీటికి మధ్యలో పంచాయితీ కమిటీ అంటూ ప్రతిజిల్లాలలోనూ ఉన్నది. దీంట్లో ఆ జిల్లా హెల్తుఆఫీసరు, జిల్లాఇంజనీరు, ముగ్గురు (ఆజిల్లాపంచాయతీముఖ్యులలో నుంచి ఎన్నిక అయినవారు) ముఖ్యులు కలిపి జిల్లా పంచాయతీ కమిటీగా ఏర్పడి ఈ పంచాయితీల కార్యక్రమాలను పరిశీలిస్తూ ఉంటారు.

గ్రామకచ్చేరీ.—పై గ్రామపంచాయతీ 15 గురు పంచలను ఎన్నుకోవాలి. ఈ 15 గురుని కలిపి గ్రామకచ్చేరీ అంటారు. 15 గురు కలిసి "సర్ పంచ్" అనువాళ్లు ఎన్నుకోవాలి. 5 సం॥రాలవరకు ఈఎన్నిక సభ్యులు అధికారంలో ఉంటారు. వీరిని తొలగించే అధికారం ప్రభుత్వముదేగాని ప్రజలది గాదు. ఒక కేసును పరిష్కరించవలసివచ్చినప్పుడు 15 గురు "పంచల" నుండి ముగ్గురిని ఉభయపార్టీలు కలిసి జడ్జీగా ఎన్నుకొంటే ఆ ముగ్గురు విచారిస్తారు. ఈముగ్గురులో "సర్ పంచ్"కూడా ఒకడైయుండాలి. ఆలా ఏకగ్రీవంగా జరుగకపోతే "సర్ పంచ్" మిగిలిన ఇద్దరిని నామినేట్ చేస్తాడు. వీరిని బెంచి అంటారు. వీరికి మూడవ క్లాసు మేజస్ట్రేట్ అధికారాలు ఉంటాయి. వీర తీర్పుపైన 30 రోజులలోగా గ్రామకచ్చేరీకి అప్పీలు చేయవచ్చును. ప్లీడరుగాని ఎవుట్ గాని లంచిఎదుట వాదించరాదు.

గ్రామకచేరీలోగాని, గ్రామపంచాయితీ కార్యవర్గంలోగాని ప్రభుత్వోద్యోగి సభ్యుడుగా ఉండరాదు. 25 సం॥రములలోపు వయస్సుగలవానినిగాని, గ్రామంలో లేనివారిని గాని ఎన్నుకోరాదు.

అస్సాం పంచాయితీ

న్యాయవిచారణకొరకు పంచాయితీ అదాలత్తున్నూ, మిగిలిన కార్యకలాపాలకు పంచాయితీ కార్యవర్గమున్నూ పనిచేస్తాయి. చాల వెనుకబడిఉన్నదని తలచే ఈ అస్సాంరాష్ట్రమే అనేకవిధాల మిగిలిన రాష్ట్రాలకంటె ముందంజ వేసింది. వయోజనులందరు వోటర్లే. వీరందరూ కలిసి కార్యవర్గాన్ని, అధ్యక్షుని, ఉపాధ్యక్షుని 3 సం॥రాలవరకు ఎన్నుకొంటారు. 200 మందికి ఒక్కొక్కరు చొప్పున జనసంఖ్యనిబట్టి కార్యవర్గ సభ్యులు ఎన్నుకోబడాలి. అధ్యక్షుడు మంత్రులను నియమించి వారలకు ప్రత్యేక శాఖలను అప్పగిస్తారు. భూములను విభజించుకొనుటలో గరిష్ఠసంఖ్య నిర్ణయించి (12 బాగాలు) అంతకు తక్కువ పంపిణీచేసుకోరాదనియు, ఆలా అవకాశం లేకపోయినప్పుడు ఆగష్ఠసంఖ్య భూమి ఒకరే తీసికొని మిగిలినవారు పంచాయితీ నిర్ణయించిన ధనము ప్రతి సాలీనా పంటనుంచి ఇతరులకు యిస్తూఉండాలని ఆస్తినిగూర్చి ఆక్టులో నిర్వచించబడింది. ఈలాంటి కాంపెన్సేషన్ ఏ భాగస్వామి, ఎవరికి ఇవ్వాలో కూడా పంచాయితీయే నిర్ణయిస్తుంది. అందుపైన అప్పీలు కూడా లేదు. భూమిని కొనుటలో గూడా చక్కని నియమం చేశారు. ఒక పంచాయితీలో అచ్చట ఓటరుగానివారూ ఎవరు స్థలం కొనరాదని నియమం చేశారు. వైద్యం, విద్యమీదకూడా అధికారం ఇవ్వబడింది. 2/3 జనాబా ఒప్పుకొంటే అచ్చట సహకార సేద్యం అమలులో పెట్టవలెనని కూడా నియమం ఏర్పర్చారు. ఇష్టంలేనివారికి కమీషన్ నిర్ణయించే కౌలు సాలీనా యివ్వబడుతుంది. ఈమాదిరిగా వ్యవసాయ రంగంలో చాల మార్పులు తెచ్చారు. కార్మికులకు అధికవసతులు కల్పించుటకు "కార్మిక పన్ను" ఏర్పర్చారు. దీనిప్రకారం 18 లగాయతు 40 వరకు వయస్సు కలిగి పనిచేసే కార్మికు లందరు సం॥రానికి వరసాగ్గా 3 రోజులు చొ॥న 36 రోజులు పనిచేసిగాని లేక నిర్ణీతమైన పన్నుగాని చెల్లించి తీర్చుకొనవచ్చునన్నారు. ఏ భూమినీ బంజరుగా ఉంచరాదు. సాగుకు కొంతకాలము అవకాశం యిస్తారు. ఆ కాలములోపున సాగుజేయలేకపోతే పంచాయితీ వశపరుచుకొని కంపెన్సేషన్ యిస్తుంది.

పంచాయితీ అదాలత్: 35 సం॥రాల పైబడి యున్నవానిని ప్లీడర్‌గాని ఔట్‌గాని వానిని, ఓటరు అర్హత గల్గియున్నవానిని అదాలత్ సభ్యునిగా ఓటర్లు ఎన్నుకొంటారు. పంచాయితీలో కూడా సభ్యత్వ ముండరాదు. 3 సం॥రాల కాల పరిమితి. ఇలా ఎన్నిక అయినవారందరూ కలిసి అధ్యక్షుని ఎన్నుకొంటారు. సివిల్‌లో రు 200లు వరకున్నూ క్రిమినల్ కేసులున్నూ వీరు విచారిస్తారు. దగ్గిరబంధువు గాని వ్యాపారంలో భాగస్వామిమీదగాని కేసు వస్తే ఆ సంబంధించిన పంచాయితీదారు ఆ విచారణలో పాల్గొనరాదు.

సి. పి; బీహార్ లలో పంచాయితీ

ఇచ్చట పంచాయితీలకు జానపదలు అంటారు. సభ్యుడుగా ఉండేవాడు 25 సం॥ రాలులోపు వయస్సుగాని, ఏ ప్రభుత్వోద్యోగి గాని, ఇతర సంఘాల్లో ఎన్నిక గౌరవ సభ్యత్వముగాని ఉండరాదు. సం॥రాని కొకమారు అధ్యక్షుని, ఉపాధ్యక్షుని ఈ జానపద సభ్యులు

(17-వ పేజీ చూడుడు)

కాపిటలిజం:

వ్యాపారాలలో 'త్రిమూర్తుల' యాజమాన్యాలు

జోసెఫ్ సి. ఓమహోని
(అమెరికా సెనేటు సభ్యుడు)

[భారత ప్రభుత్వము, పెద్దపెద్ద వ్యాపారస్థుల సహకారం సంపాదించటానికై, వాళ్ల నెన్నోవిధాల లాలిస్తూవచ్చింది. కార్మిక లోకంతోపాటు మధ్యతరగతిజనంకూడా, వ్యాపారస్థులకు నెహ్రూ ప్రభుత్వం తాబేదారుగా అయిపోతుందని విమర్శించారు. వ్యాపారస్థులుమాత్రం తమకు తగినంత స్వేచ్ఛా వ్యాపారానికి ప్రభుత్వం అదను యియ్యటం లేదని, తమ వ్యాపారధనాన్ని దేశంలో చలామణీలోకి త్రిప్పటానికి ఏమాత్రం సుముఖత్వం చూపకుండా ఉన్నారు. ఇంకా స్వేచ్ఛా వ్యాపారానికి ప్రభుత్వము అవకాశం ఇస్తేతప్ప వీలులేదన్నట్టు, మాట లెలా ఉన్నా ఆచరణలో మాత్రం చూపిస్తున్నారు. వీళ్లకు కళ్లముందర రమ్యంగా కనపడేవి, అమెరికన్ పెద్ద వ్యాపారస్థుల విధానాలు. దేశవ్యాపారం అంతటిమీదా అమెరికన్ పెద్ద వ్యాపారస్థులకున్న యాజమాన్యం ప్రభుత్వాన్ని మించికూడా ప్రజపైన యాజమాన్యం చలాయించటం—అక్కడ అమెరికన్లకున్నట్టు పెద్ద వ్యాపారస్థులకు చట్టబద్ధమైన విశృంఖల స్వేచ్ఛావిహారం మన దేశంలోని ఒక్క మన దేశమని ఏమిటి—ఏ దేశంలోనైనా పెద్ద వ్యాపారస్థులు కొద్దిమంది కోరేది ఇదే—స్వేచ్ఛా వ్యాపారం పేరిట, యావత్తు దేశజనుల జీవిత ప్రమాణాలను అవసరాలను, తమగుప్పెటలో పెట్టుకొని తమ ఇష్టం వచ్చినట్లు నడిపించటం. ఈ పెద్ద వ్యాపారస్థుల ప్రభావం అంతకంతకూ పెరిగి పెద్దదై, ఇంతింతై మరి ఇంతయై, నభోవీథిపై నింతై, దేశ ప్రభుత్వాన్నీ అన్నివర్గాల జనాన్ని కూడా తన గుప్పెటలో పెట్టుకొని ఆడిస్తుంది. ఈ పెద్దరికం భరించరానంత పెద్దదిగా తయారవుతూంది. భారతీయ వ్యాపారస్థులలో, ముగ్గురు నల్గురు పెద్దలు కోరే విదేనా? అయితే ఈ పెద్దరికంప్రభావం అమెరికాలో ఏమేం చేసిందో కొంత గమనించుకొంటే, మన హెచ్చరికలో మనం ఉండగలుగుతామేమో! వ్యాపారస్థులు ఇంత పెద్దరికం వహించటం వ్యాపారానికే క్షేమకరం కాగలదు.]

ఒక చిన్న ఉదాహరణ తీసుకొందాం. చౌక రకంసిగరెట్లు పాకెట్లులు పదిసెంట్లువి ఉండేవి. (సెంటు అంటే దాదాపు అర్ధణాఅనకోండి—అమెరికా జీవిత ప్రమాణాలకు ఆ ధర చౌక ధరే!) వాటి కథ గమనిద్దాం. "కొంచెం తక్కువ రకం పొగాకుతో తయారు చేసినా, సామాన్య అమెరికన్ పౌరుడు, ధర తక్కువలో కొనుక్కోగలిగితే, పరకో పాతకో కూడబెట్టుకో వచ్చు అనే దృష్టిలోనే ఉంటాడు గదా!" అని ఆలోచించి, ఒక చిన్న వ్యాపారస్థుడు స్వంతంగా ఈ సిగరెట్లు పరిశ్రమను స్థాపించి, చౌకరకం సిగరెట్లు అమ్మటం మొదలు పెట్టాడు. కొండేళ్లలో ఈ వ్యాపారం ఎంతగా అందుకుం దంటే, అమెరికాలో అమ్మకం అయే సిగరెట్ల మొత్తంలో, నాల్గోవంతు ఈ సిగరెట్లే అమ్మకం అయేవి. ఇల్లా ఉంటుండగా అకస్మాత్తుగా ఈ సిగరెట్లు మార్కెట్లో మాయమయాయి. సిగరెట్లు తాగేవాళ్లంతా ఎక్కువ ఖరీదు సిగరెట్లు కొనుక్కొని తీరుట తప్ప వేరే గత్యంతరం లేకపోయింది.

గత సంవత్సరం అమెరికన్ ప్రతినిధుల శాసనసభలో దీని "లోగుట్టు" బైలుపడింది. ఈ సిగరెట్లకి మంచిఅమ్మకం ఉన్నా కూడా, పొగాకు వర్తకంలో అగ్రాసనాధిపత్యం వహించిన త్రిమూర్తుల ఆజ్ఞమీద, ఈ చిన్నవ్యాపారాన్ని గొంతునులిమి అంతంచేయవలసివచ్చింది. ఈ త్రిమూర్తులెల్లా ఇంత అధికారం సంపాదించారు, వ్యాపారాల సృష్టిస్థితిలయాలమీద వీళ్లకింత అధికారం ఎలా వచ్చింది అని చూసుకొంటే, ఒక్క పొగాకువ్యాపారంలోనే కాదు, అమెరికన్ వ్యాపారరంగ మంతటా, ఇల్లాంటి పెద్దవ్యాపారస్థుల అనుపాజ్ఞలలోనే ఆయా వ్యాపారాల సృష్టిస్థితిలయాలున్నాయని, తత్ఫలితంగా ప్రజల జీవితం కూడా వాట్లకు అనుగుణ్యంగా మార్చుకొంటేతప్ప బ్రతుకు లేదనీ తెలిసివస్తుంది.

అసలీ శతాబ్ద ప్రారంభంలో పొగాకు పెద్ద వ్యాపారస్థులు చిన్నవ్యాపారస్థులుకూడా చాలామంది ఉండి, వ్యాపారం మంచిపోటీగానే జరుగుతూ, వ్యాపారస్థుని ఉనికి, లాభం అన్నీ కూడా అతనిదగ్గరఉన్న వస్తువులు ప్రజలకెంత ప్రయోజనకరాలు, ఎంత మేలిమిగలగలవీ, వ్యాపారంలో నిజాయితీ ఎల్లాంటిదీ, అన్న సామాన్య ధర్మసూత్రాలమీద ఆధారపడి ఉండి, వ్యాపారం సంఘజీవన ఆరోగ్యానికి పోషకంగా ఉండేది.

కాని రానురాను పెద్దకంపెనీలు చిన్నకంపెనీలను తమలో లీనంచేసుకొంటూ, ఐక్యత పేరిట ఏకకంపెనీలుగా (*merger*) మారి గట్టిపడి, పెద్ద వ్యారస్థుల పెద్దరికం అంతకంతకూ పెద్దదౌతూ వచ్చింది. మార్కెట్టునంతా ఇవే ఆకట్టుకొంటూ, ధర్మకర్తృత్వం పేరిటి యాజమాన్యం సంపాదించుకొన్నాయి. "టొబాకో ట్రస్టు" అన్న సంఘం మార్కెట్టును ఏలసాగింది. దీని ప్రభావం ఎంత పెరిగిందంటే 1911 లోనే, అమెరికన్ ప్రభుత్వం శాసనం ద్వారా, ఈ ధర్మకర్తృత్వాన్ని కరిగించి, శిల్పరూపుమాపేయవలసి వచ్చింది.

కాని 1940 నాటికి, పొగాకు వ్యాపారంలో ఈనాడు త్రిమూర్తులై కూర్చున్న మూడు కంపెనీలు, మళ్లీ, ఎంత పెద్దవిగా పెరిగి పోయాయంటే, 1911 నాటి టొబాకో ట్రస్టుకంటె ఈ ఒక్కొక్క కంపెనీయే ఎంతో పెద్దదిగా పెరిగిపోయింది. మళ్లీ ప్రభుత్వం, ఈ "ఏకాధిపత్యా"లను నిర్మూలించడానికి కేసులు పెట్టి చర్యలు తీసుకోవలసివచ్చింది. ఏకాధిపత్య ప్రయత్నాలమీద ఆంక్ష పెట్టవలసివచ్చింది. సుప్రీంకోర్టు వ్యాపారంపైన గుత్తకు పుచ్చుకొంటూన్న ఈ ఏకాధిపత్యాల చర్యల నన్నిటినీ తీవ్రంగా ఖండిస్తూ, పెద్దపెద్ద జరిమానాలు వేసింది. అయినప్పటికీకూడా, ఈమూడు కంపెనీల ఆధిపత్యం, మరింత పెరిగి పెద్దదయింది గాని ఏమీ తగ్గలేదు. 1940లో ప్రభుత్వం ఈకంపెనీలమీద దావాలు తెచ్చేటప్పటికి, అమెరికన్ సిగరెట్లు వ్యాపారంలో నూటికి దాదాపు 68 పాళ్లవరకూ అమ్మకం ఈమూడుకంపెనీల చేతుల్లో ఉండేది.

1948 లో ఈ కంపెనీలు అమెరికన్ సిగరెట్టువ్యాపారంలో నూటికి 86 పాళ్లు వ్యాపారం చేసేస్థితికి పెరిగాయి.

ఈ ఆధిపత్యాన్ని పగలగొట్టాలనే ప్రయత్నంలోనే తక్కిన ఆ 14 వంతుల స్వతంత్ర వ్యాపారస్థులు తమ శక్తికొద్దీ ప్రయత్నించి, చౌకసిగరెట్లు అమ్మకం చూపించారు. శాసన సభ్యులముందు ఈ విషయంలో సాక్ష్యాలు తెలిపినవాళ్లు చెప్పిన విషయాలు ఇవీ:— ఈ చౌక సిగరెట్లు మార్కెట్టులోకి రాగానే, మూడు పెద్దకంపెనీలవాళ్లూ తమ సిగరెట్లధర, తమకయిన ఖర్చు కంటేకూడా తక్కువ ధరకు తగ్గించేశారు. స్వతంత్ర వ్యాపారస్థులను పడగొట్టేందుకు, చౌకరకం పొగాకు బేరాలలోకి తాము జొరబడి, స్వతంత్రవ్యాపారస్థులు కొనలేనంతగా, ఆ సిగరెట్లకు కావలసిన పొగాకు ధరలు పెంచేశారు. వాళ్లు కొనేజాగాలలోకి తామూ జొరబడి మార్కెట్టు ధరలు హెచ్చించేశారు. తక్కువరకం పొగాకు రైతులదగ్గర నుంచి మొత్తంగా ఒట్టిల బేరాలకు తామే అవసరం లేకపోయినా కొనేశారు. అప్పటికి అమ్ముతూన్న సిగరెట్టులలో నాల్గవవంతు మొత్తం దాకా తమ సిగరెట్లు అమ్ముతూన్న ఈ స్వతంత్ర వ్యాపారస్థుల చిన్నికంపెనీలు ఈ ధాకకు తట్టుకోలేకపోయాయి. క్రమంగా నూటికి ఇరవైఐదుపాళ్లు అమ్మకంనుంచి నూటికి అరపాలు ($\frac{1}{2}$%) కి ఈ అమ్మకం పడిపోయి ఆ కంపెనీలు రూపుమాసిపోయాయి. ఆ వ్యాపారం పూర్తిగా ఇల్లా తమ చేతుల్లోకి వచ్చేశాక, పెద్దకంపెనీలు మూడూ మళ్లీ కావలసినట్టుగా సిగరెట్టు ధరలు పెంచేశాయి.

(హైదరాబాద్ లో స్వతంత్రంగా బయలుదేరిన చిన్నసిగరెట్టు ఫ్యాక్టరీలకూ 1940 ల ప్రాంతాలలో, ఇదే అవస్థ పట్టింది. గోల్డుఫ్లేక్ సిగరెట్టు పెట్టెలు, చౌక రకం సిగరెట్ల ధరకే అమ్మకంలో పోటీకి వచ్చాయి. ఫ్యాక్టరీలను పెద్ద కంపెనీతో ఐక్యంచేస్తే తప్ప చిన్నవ్యాపారస్థులకు గత్యంతరం లేకపోయింది. ఆ తర్వాత గోల్డుఫ్లేకుల ధరలతోపాటు, చౌక సిగరెట్ల ధరలుకూడా, ఒక్కకంపెనీ చెప్పుచేతల్లోకే వెళ్లిపోయాయి.

ఒకరిద్దరి పెద్దరికంలో దేశం వ్యాపారం అంతా గుప్పిటలో ఇమిడినట్లు ఇమిడి ఉండటం ఒక్క ఈ పొగాకువిషయంలోనే ప్రత్యేకంగా జరిగిం దనుకోకండి. అక్కడి ప్రతివ్యాపారంలోనూ ఆధిపత్యం అంతా త్రిమూర్తుల్లోనో, ద్విమూర్తుల్లోనో ఇమడటం జరుగుతూంది.

తిండివిషయంలో చూడండి.

అమెరికాలో, రొట్టెల పిండి వ్యాపారం మొత్తంలో, నోటికి 38 పాళ్లు, మూడుకంపెనీల చేతుల్లో జరుగుతూంది. మాంసం ప్యాకేజీలలో జనానికి సప్లయి యావత్తులోనూ, మాంసం అమ్మకంమొత్తంలో నూటికి 43 పాళ్లు మూడు కంపెనీల ద్వారా జరుగుతుంది. మూడు పాల కంపెనీలు, దేశానికి కావలసిన డబ్బాపాలు, పాలపాడి వ్యాపారంలో నూటికి 44 వంతులు గుత్తకు పుచ్చుకొన్నాయి. మీగడ అమ్మకం నూటికి 63 పాళ్లు వీళ్లదే. మూడురొట్టెల కంపెనీలు, దేశానికి కావలసిన రొట్టెలు, బిస్కత్తులు, మొదలైన తినుబండారాలలో, నూటికి 74 పాళ్లు తామే అమ్ముతున్నాయి. సబ్బుబిళ్లలు, అమ్మకం నూటికి 80 వంతులు మూడుకంపెనీలది. పళ్లరసం డబ్బాలు జాడీలు అమ్మకం మొత్తంలో నూటికి 85 పాళ్లు, మూడు కంపెనీ లిది.

మేరీలాండు అన్న జిల్లాలో, చిన్నచిన్న రొట్టెల వ్యాపారస్థులు స్వంతంగా, రొట్టె ఒకటికి 5 సెంట్లకు అమ్మకంపెట్టారు. పదిసెంటు సిగరెట్టు పెట్టెలకు పట్టిన గతే ఈ రొట్టెల కంపెనీలకు పట్టింది. ఈ వ్యాపారంలో త్రిమూర్తులూ ఈ చిన్న కంపెనీలను, ఐదుసెంట్ల రొట్టె అమ్మకం మానుకొంటారా లేక ధరలలో యుద్ధం మొదలెట్టమా అని బెదిరించారు. కొందరు లొంగిపోయారు. మరికొందరు భీష్మించారు. పెద్ద కంపెనీలు అంతకన్నా మంచి రొట్టెను పెద్ద సైజులో చచ్చు చౌకధరకు అమ్మాయి. చిన్న కంపెనీలు దివాలా తీశాయి. పెద్ద కంపెనీలు మళ్లా యథాప్రకారం ధరలలో పెత్తనం సాగించుకొన్నాయి. (ప్రభుత్వము

(17 వ పేజీ చూడుడు



మద్రాసు ప్రధాని కుమారస్వామిరాజా (రాజాజీ వెనుక నున్నవారు) రాజగోపాలాచారిగారికి అధికారులనూ, అనధికారులునూ పరిచయం చేస్తున్నారు.

కమ్యూనిజం:

కార్మిక కర్షకుల స్వర్గలోకం

ఫెరెన్స్ నాగీ

(హంగరీ కర్షక నాయకుడు. 1946-47 లలో హంగరీ ప్రధాని)

సోవియట్ యూనియన్ ప్రభావ ఆధిపత్యాల లోకి వచ్చిన దేశాలలో కార్మికుని పరిస్థితి ఏమిటి? అంతకు ముందుకంటే మేలుగా ఉందా, లేక అధ్వాన్నంగా ఉందా?

ఈ ప్రశ్నలకు జవాబు స్వయంగా గ్రహిద్దామని నేను యూరప్‌లో పర్యటనం చేశాను. జవాబులంటే కేవలం వాదాత్మకమైన విస్తృత సూత్రీకరణాలలో కాదు.

ప్రత్యక్ష విషయాలైన, రోజుకూలి, పని చెయ్యవలసిన గంటలు, దొరకుతున్న తిండి, సుఖపడటానికి ఉన్న అవకాశాలు వీట్ల ప్రమాణాలలో ఈ ప్రశ్నలకు జవాబులకై వెదకాను. సోవియట్ ఉక్కు తెరకు లోపలి విదేశాలలో నివసిస్తూ పనిచేస్తూన్న 1300 మంది కార్మికులను ఋజువర్తనులను, అడిగి తెలిసికొన్న విషయాలు ఈ జబాబులు. వీరిలో 200 మంది కర్మాగారాలలో పనిచేస్తున్నవారు. వీరి జవాబులతో అక్కడి కార్మికుల స్థితి విషయంలోని నాసందేహాలు తీరిపోయాయి. ఏ "కార్మికుని" పేరిట సోవియట్ ప్రభుత్వము, తన అధికారాన్ని ప్రబలం చేసికొందో, ఆకార్మికుని పరిస్థితి, సోవియట్ ఉపగ్రహదేశాల్లో, ఏనాటి కన్నా కూడా అధ్వాన్నంగా ఉంది తప్ప బాగు పడలేదు.

ఈనాడు అక్కడి కార్మికుడు, మునుపటి కన్న తక్కువ భత్యానికి మునుపటికన్నా ఎక్కువ పని చెయ్యాల్సిఉంది. కోటాప్రకారం ఇచ్చిన.పని అంతా అప్పచెప్పకపోతే, తీవ్రమైన శిక్ష తప్పదు. సమ్మె చేయటానికి సుతరామూ వీలులేదు. యజమాని - అంటే ఈనాడు సర్వాధిపత్యాలతో వ్యవహరిస్తున్న ప్రభుత్వమే అతనికి యజమాని. చేసిన తీర్పుకు, సన్నగా గొణుగు కోటానికైనా వీలులేదు. వృత్తి ఉద్యోగాలలో అతని పురోగమనం, అతని నిజాయితీమీదా, అతని కౌశలం ఎలా మీదా ఆధారపడి ఉంది— సోవియట్ తత్వంపట్ల భక్తివినయప్రపత్తులపై అధికారులముందు ప్రదర్శించగల చాకచక్యం పైననే పురోవృద్ధి ఆధారపడిఉంది.

ముఖ్యంగా హంగరీ విషయం ఉదాహరణగా తీసికొంటాను. హంగరీ నా మాతృదేశం. దాని పరిస్థితి అంతా కరతలామలకంగా నాకు తెలుసును. అక్కడి పరిస్థితులూ, తక్కిన అల్లాంటి ఉక్కు తెరలో పలి ఉపగ్రహ దేశాలూ సరిగ్గా ఒక మాదిరిగానే ఉన్నాయని నాపర్యటనంవల్ల నాకు తెలిసివచ్చింది.

ఈమధ్య బుడాపెస్టులో, ఒక పెద్ద ఫ్యాక్టరీలో, కార్మికుల విధాయిక సమావేశం జరుగుతోంది. ఈసమావేశాలకు కార్మికులంతా విధాయకంగా హాజరై తీరాలి. సమావేశంలో, రష్యా తర్ఫీదుపొందిన ఒక లేబరు యూనియన్ నాయకుడు సోవియట్ యూనియన్‌లో ప్రజలు అనుభవిస్తూన్న స్వర్గసౌఖ్యాలను రమ్యంగా వర్ణిస్తున్నాడు. వాళ్లతో పోల్చి చూస్తే అమెరికాలో కార్మికుడు కేవలం బానిస స్థితిలో ఉండి, యజమానులు రసం పిండుకుతింటూన్న పిప్పిలాగ ఉన్నాడని చెప్పాడు.

అతని ఉపన్యాసం పూర్తి అయింది. ఒక ముసలికార్మికుడు, పని ముట్లు చేసే వాడు, లేచాడు. "అయ్యా మీరు చెప్పిందంతా నిజమయితే, మాలో సరిగ్గా పనిచెయని కొంమేడులను, ఈ సోవియట్ స్వర్గసౌఖ్యాలు అనుభవించేందుకు రష్యా పంపిస్తారేమి ?—ఇల్లా పనికి బరకవేసే అభాగ్యులను అమెరికా పంపిస్తే, వాళ్లకు సరియైన శిక్షగా ఉంటుంది కదా?"అని అడిగాడు.

ఉపన్యాసకుడు ప్రశ్నకు జవాబు చెప్పకుండా తోసేశాడు కాని ఆవృద్ధుడిపేరుమాత్రం నోటుచేసుకొన్నాడు. మర్నాడు ప్రొద్దున్నే ఆ వృద్ధు డింటికి ఇద్దరు పోలీసులు వచ్చి పృగణి లాక్కుపోయారు. కొత్త విద్యాబుద్ధులు చెప్పేందుకు రష్యాకు పంపేంచా"మని కుటుంబానికి తర్వాత తెల్పారు.

"ఎక్కడ నోరు జారిందో, ఏమాట బైలుపడిందో, తొందరపడి సణుగుదూ గొణుగుదూ ఏమన్నానల్లురిముందూ రానిచ్చారో, తెల్లారేలప్పటికి పోలీసులు వచ్చి లాక్కుపోతారేమో" అన్న భయమే నిత్యం కార్మికుల మనస్సులలో అల్లాడుతూంటుంది. పోలీసురాజ్యంలోని ప్రజల భీతాంగాన్ని, స్వతంత్రప్రజలు అర్థం చేసికోటం కష్టం. అధికారుల అవకతవకలనుంచి ప్రజకు రక్షణ అనేది ఏ దిశలుంచీ లేదు. ఏ క్షణాన్న పడితే ఆక్షణాన్న "అధికార" భూతము అతన్ని బందినిచేసి, మరుపటిగంటలో అతని ప్రాణాలు బలితీయవచ్చును. లేదా మధ్యాహ్నానికి ఊరల్ కొండలలో ఉన్న కాంసెంట్రేషన్ కాంపులలో నిర్బంధసేవ చేయటానికి తీసుకుపోవచ్చును.

సోవియట్ ఉపగ్రహ దేశా లన్నిటిలోనూ వారానికి 48 గంటలు పని ప్రామాణికం చేసేశారు, ఈ 48 గంటలలో సామాన్య కార్మికుడు మునుపటికన్నా 1938 లో చేసిన పనికన్నా $1\frac{1}{2}$ రెట్లు పనిచేసి చూపించాలి.

మాస్కో నాయకులు, హంగరీకి కోటా నిర్ణయించారు. ఆ కోటాప్రకారం, హంగరీ ఇన్ని కోట్ల గజాల గుడ్డను, ఇన్ని కోట్ల టన్నుల ఉక్కును, విధాయకంగా తయారుచేసి పంపించాలి. బుడాపెస్టులో ప్రభుత్వం "జేహుజార్" అంటూ, ఈ కోటాను మళ్లీ, తన ఫ్యాక్టరీ లన్నిటికి పంచుతుంది. ఫ్యాక్టరీ యజమానులు కార్మికుని కింత అని పని అప్పగిస్తారు. ఆ పని కార్మికుడు పూర్తి చెయ్యలేకపోతే శిక్ష తప్పదు.

నాకు చెప్పిన ఒక కార్మికుని కధనం వినిపిస్తా. అతనుమునుపు పక్కా కమ్యూనిస్టు వాడిగా ఉండేవాడు - అతనికి కల్గిన అనుభవమే తక్కిన కార్మికుల అనుభవంలోకి నిత్యం వస్తూంది. అతను నాతో చెప్పిన కథ ఇది.

"ఒకనాడు ప్రొద్దున్న ఫోర్మన్ నా మగ్గం దగ్గరకు వచ్చి, మిల్లు డిప్యూటీ డైరక్టరు పిలుస్తున్నాడని చెప్పాడు. డిప్యూటీ డైరక్టరు, లావుగా పొట్టిగా ఉంటాడు. అకస్మాత్తుగా ఈ ఉద్యోగం అతనికి లభించింది. అంతవరకూ ఏదో హోటలులో వెయిటర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. ఆవెయిటర్‌గా మంచికమ్యూనిస్టు అవటం వల్లా, గూఢచారిగానూ, వార్తా హారుడుగానూ, పార్టీకి చాలా విశ్వాసంతో సేవ చేసినందువల్లా అతనికి ఈ హరాద్దా ఖ్యం పట్టింది. అంతే తప్ప, బట్టలనేత విషయంలో ఓనమాలు కూడా అతనికి తెలియవు. నాపనిలో నేను చాలా వెనకబడ్డానని, "రివాజు"గా చెయ్యవలసిన పనిచేసి అప్పగించటం లేదనీ తీవ్రంగా మందలించాడు. ఈపనిలో చాలా "ఆచితూచి" పని చెయ్యవలసిన అవసరం ఉందనీ, చాలా జాగ్రత్తగా చెయ్యవలసి ఉంటుందనీ, యంత్రాలు మునుపటి అంత సమంగా పనిచెయ్యటంలేదనీ విశదపరుచుకొన్నాను. కాని ఈ క్షమాపణ లేవీ పనికి రావన్నట్టు చెయ్యి ఊపాడు. ఈమాటుకు నెల జీతం సగం తెగ్గోస్తారని చెప్పాడు. ఇంకో మారు ఇల్లా జరిగితే, నాకు ఇచ్చే రేషనులన్నీ తగ్గించేస్తారని చెప్పాడు. అప్పటికీ పనిలో చురుకుదనం అందుకోకపోతే, ఏంజరుగుతుందో వేరె చెప్పక్కర్లేదన్నాడు. అదీ కాకుండా నా మాటల ధోరణి చూస్తే, పార్టీపైన విశ్వాసం సడిలినట్లు కనబడుతూం దని హెచ్చరించాడు.

"అత నన్నట్లుగా ఏం జరుగుతూందో నాకూ బాగానే తెలుసును. అందుచేత నాకుటుంబాన్ని తీసుకొని, సరిహద్దున ఉన్న ఒక బంధువు సహాయంతో, నేను నాభార్యా ఒక గడ్డిబండిలో దాకుకొని ఆస్ట్రియా చేరుకున్నాం".

అని చెప్పాడు - ఆ కార్మికుడు.

అనేకమంది హంగేరియన్ కార్మికులు అతను తొక్కిన తోవే తొక్కారు.

ఆస్ట్రియన్ పోలీసుల అంచనాప్రకారం గత సంవత్సరంలో, 20,000 మంది మధ్య యూరప్ కాందిశీకులు, ఆస్ట్రియా చేరుకొన్నారట. వీరిలో ఎక్కువమంది హంగేరియనులే.

1938 లో, కొత్త పనితనం గల ఫ్యాక్టరీ కార్మికుడు, ఒకగంటకు, సంపాదించిన కూలితో ఆరు పౌనుల బ్రెడ్డు వచ్చేది. యుద్ధ కాలంలో బెర్లిన్ అజమాయిషీలో, హంగేర్ ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నప్పుడు ఒకగంట కూలి రాబడితో మూడుపౌనుల బ్రెడ్డు కొనుక్కోగలిగేవాడు. ఈనాడు యంత్రాలలో పనిచేసే, కుశలుడైన కార్మికుడు, గంట పూర్తిగా పనిచేస్తే, ఒకపౌను బ్రెడ్డు సంపాదించుకోగల్గుతాడు.

ఒకప్పుడు రెండు డాలర్లు ఖరీదున్న కాలిజోడు ధర ఇప్పుడు పది డాలర్లు. 20 డాలర్లకు వచ్చిన సూటు 100 డాలర్లు. ధరలు ఇల్లా హెచ్చుతోంటే, చాలా పరిశ్రమలలో, కార్మికుల వేతనాలు, నూటికి 20 పాళ్లు తగ్గించబడ్డాయి. అతని రేషనుకార్డుకువచ్చే తిండే అతను సరిగ్గా కొనుక్కోనేందుకు, (రేషను కార్డు ప్రకారం రోజు కొక భోజనంకంటే ఎక్కువ ప్రాప్తం లేదు), ఇంటిఅద్దె ఇచ్చుకొనేందుకు - (ఐదేళ్ల క్రిందట ఎదురుడబ్బు ఇచ్చినా అల్లాంటి కొంపలో ఉండబోయేవాడు కాదు) బట్టలు చిరుగుమాసికలు కుట్టించుకునేందుకూ కూడా సరిగ్గా డబ్బు చాలదు.

ఈ ఇనుపతెరవెనకగా ఒక కొత్తమాదిరి, పారిశ్రామికపు జమీందారీకొలువు బయలుదేరుతూంది. హిట్లరు ప్రభుత్వంలో అల్లాంటి రాచరిక పద్ధతే బయలుదేరింది. ఈమాదిరి అధికారంలో, ప్రతి ఫ్యాక్టరీలో ఉండే "కార్మిక ఫోర్మన్" అట్టడుగున బయల్దేరే తాబేదారు. ఫోర్మన్ అంటే పనివాడితసంరీత్యా, అతను ఫోర్మన్ కాదు. పార్టీకి రక్షకభటత్వం వహించిన పార్టీప్రతినిధి.

కమ్యూనిస్టు అభిమానం ఉన్న స్వతంత్ర దేశాలలోని స్వతంత్ర కార్మికులంతా, ఇక్కడి కార్మికులతో ఫోర్మన్ మాట్లాడేవిధానం ఒక్కసారిచూడగల్గితే బాగుండునని అనిపిస్తుంది. ఒక్కసారి అల్లా చూస్తే, ప్రజాస్వామ్యాలలోని కార్మికులలో కమ్యూనిస్టు సంఖ్య తగ్గిపోతుంది —అని నేను చూసిన కార్మికుల్లో ఒకడు నిట్టూర్చాడు.

సామాన్య కార్మికునికన్నా, ప్రతిఫోర్మన్‌కు రేషనులు ఎక్కువ ఉంటాయి. వాళ్ల ఇళ్లకన్న మంచి ఇళ్లు ఇస్తారు. స్వేచ్ఛగా సెలవులుంటాయి. పార్టీ అనుయాయిగా మంచి పలుకుబడి తెచ్చుకోగలిగితే, మంచి అధికారాలున్న ఉద్యోగాలు కూడా లభించి అభివృద్ధిలోకి రాగల్గుతాడు.


ఈనాడు హంగేరీలో నల్లా పెద్దదయిన, చక్కెర ఫ్యాక్టరీకి అధ్యక్షుడు, రెండేళ్లక్రితం పిండిమరలో బండ కూలిపనిమాత్రమే చేసేవాడు. పార్టీ నిర్మాణంలోనూ, కమ్యూనిస్టు వ్యతిరేక చర్యలను పట్టియిచ్చి తీవ్రంగా ఖండించటంలోనూ, పితూరీలు చెప్పటంలో ప్రజ్ఞవలననూ, ఆ అధ్యక్షస్థానంలోకి అవలీలగా రాగలిగాడు.

దేశంలోని పెద్ద విద్యుచ్ఛక్తి కర్మాగారానికి అధ్యక్షుడు, పూర్వం కాఫీహోటలులో వెయిటర్ ! ఇల్లాంటి అసమర్థులు అనుభవహీనులు ఐనవాళ్లచేతుల్లో ఆధిపత్యాలు నడుస్తున్నాయి.

పార్టీకిగాని యూనియన్‌కుగాని చందాలు కావలసివచ్చినప్పుడు, కార్మికులు "అభిమానంతో ఇచ్చిన చందాలు"గా చూపించటానికి కూడా ప్రత్యేకపద్ధతులున్నాయి. కార్మికుడు ఆ చందా ఇయ్యకపోయాడా, కొరివితో నెత్తి గోక్కున్నాడన్నమాటే.

ఈమధ్య ఒక హంగేరీ ఫ్యాక్టరీలో, పార్టీ ప్రవక్త, నెలజీతంలో నూటికి రూపాయి, గ్రీక్ గొరిల్లాల సహాయానికి ఇయ్యవలసిందని కార్మికులకు బోధిస్తున్నాడు. "సత్-కమ్యూనిస్టు"

(17-వ పేజీ చూడుడు)



బుద్ధజయంతి ఉత్సవ సందర్భాన మొన్న 12వ తేదీన బౌద్ధభిక్షువులతో గోష్ఠి జరుపుతున్న రాజాజీ.

విజ్ఞానవిశేషాలు :

గాలి-దాని ఉపయోగములు

శ్రీ గుండెపూడి శ్రీరామమూర్తి

స్వాభావసిద్ధముగా భూమిపై నుండు గాలి క్రింద చూపబడిన పట్టికయందలి ఇతర వాయువులు కలిగియుండును.

వాయువు పేరు	ఘనపరిమాణము బట్టి	బరువును బట్టి
నత్రజని (*Nitrogen*)	78 06	75. 5
ప్రాణవాయువు (*Oxygen*)	21.00	23. 2
ఆర్గాను (*Argon*)	·94	1. 3
కర్బన ద్వి ఆమ్లజనిదము (*Carbon dioxide*)	.04	.05

కొద్దికొద్దిగా మరి ఇతర వాయువులు గాలిలో కలసియున్నప్పటికీ మామూలుగా స్వభావసిద్ధపు గాలి క్రింద నత్రజని, ప్రాణవాయువు మరియు ఆర్గానుమాత్రమే లెక్కవేసెదరు. వివిధవాయువు లేనిష్పత్తులలో కలసియున్నను మొత్తముమీద భూమిపై అన్నిచోట్లను ఆయా నిష్పత్తులు చాలావరకు ఒకేవిధముగా నుండును. కానీ ఆ నిష్పత్తులు, పెద్దపెద్ద పట్టణములలోనూ, బాగుగ కవాటములులేని స్థలములలోను సమయాను కూలముగా మారుచుండును. గాలిలోని వివిధ వాయువులను రకరకములైన ప్రయోగములతో విడదీయవచ్చును. గాలిని ఒకపెద్ద సీసానుండా ఎర్రగ కాచబడిన తామ్రపుతిడికల పైకి పంపి గాలిలోని ప్రాణవాయువును తీసివేయనగును. తామ్రపుతడిక లున్న గాజుగొట్టములోనికి పంపే ముందు నీటియావిరి తీసివేయుటకై వాయు సమ్మేళనమును నిర్జలగంధకికామ్లపుసీసాలోనికి పంపెదరు. ఈవిధముగా తయారయిన నత్రజని, తామ్రపు తడికలపై పంపగా వచ్చిన దాని కన్న అనేకరెట్లు పరిశుభ్రమైనది.

మందవాయువులు - ఆర్గాన్ (*Argon*):— గాలిలోని మందవాయువులు కనిపెట్ట బడుట చేతను, మరికొన్ని నూతనపద్ధతులు నెల కొల్పబడుటచేతను రసాయనశాస్త్రములో మందవాయువులచరిత్ర చాలా ఆకర్షణీయము గను, అమితోత్సాహకరముగను ఉండును. 1892 లో ర్యాలీ (*Rayielgh*) అనునొక ఆంగ్ల శాస్త్రవేత్తగారినుండి గైకొనబడిన నత్రజని, నత్రజని కలిగియున్న పదార్థములనుండి వచ్చిన నత్రజనికన్న అనేకరెట్లు బరువుగ నున్నదని కనిపెట్టెను. దీనికి కారణము గాలి లోని నత్రజనితో ఇంకనూ తెలిసికొనబడనట్టి మరొక ఇతర వాయువు సమ్మిళితమై యుండుటయే. ఇంతకు పూర్వము కనుగొనబడని, తయారుచేయబడని ఈ వింత వాయువును చాలా స్వల్పముగా రాంసే (*Ramsay*) అను మరొక ఆంగ్లశాస్త్రవేత్త క్రిందివిధముగా తయారు చేశాడు. గాలిలోనుండి వచ్చిన నత్రజని బాగుగా వేడిచేయబడిన కాల్సియమగ్నీషియ మిశ్రముపై పంపబడును. నత్రజని కాల్సియము, మగ్నీషియములతో రసాయనికమార్పు చెంది కాల్సియ నత్రిదము, మగ్నీషియనత్రిదము అను పచ్చని పదార్థములుగా తయారగును. ఈవిధంగా నత్రజని తీసివేయబడును. దీనికన్న మంచి పద్ధతి ఆవ్గ లోనే లార్డు ర్యాలీ (*Lord Rayleigh*) సూచించాడు. ఈ పద్ధతిలోనైననూ తయారగు నూతన వాయువు తీసుకున్న గాలిలో 1% మాత్రమే. ఈనూతనవాయువు ననేకవిధముల రసాయన మార్పులు చెందించ ప్రయత్నించినను అన్నియు వృథాప్రయాసయే అవుటచే 'చురుకు కానిది' అను అర్థమిచ్చు 'ఆర్గాను' అను నామధేయ మివ్వబడినది ఈ నూతనవాయువుకు.

ఇతరమందవాయువులు.—నూతనముగా కనుగొనబడిన ఆర్గాన్ చేష్టలలో కొన్నివింతలు కానవచ్చుటచే ర్యాలీ మరియు రాంసే మొదలగు రసాయన శాస్త్రవేత్తలు ఈ నూతన వాయువు కూడా పరిశుభ్రము కాదని సంకోచించుటకు వీలయినది. ద్రవీకరింపబడిన గాలిచే వాతావరణమునుండి వచ్చిన ఆర్గాను కూడా ద్రవీకరణ మొనరింపబడినది. జనింపబడిన అతితక్కువ వుష్ణోగ్రతవద్ద ఆవిరిచేయుటయునూ, ద్రవీకరణ మొనరింపబడుటయూ కొనసాగబడును. తయారయిన ఆర్గాను మరికొన్ని ఇతర మందవాయువులతో కూడియున్నదని చివరకు తెలియనగును. ఈ మరికొన్ని ఇతర మంద వాయువులలో రెండు వాయువులు మాత్రమే ద్రవీకరణ మనుభవించబడిన వుదజనిచే (*Liquified Hydrogen*) జనించు అతి తక్కువ వుష్ణముచే విడదీయనగును. మరి మూడు నూతనమయిన మందవాయువులకీ క్రిందినామము లివ్వబడినవి వాటివాటి చేష్టల ననుసరించి. (1) నియాను (*Neon*) అనగా నూతనమయిన, (2) క్జినాను (*Xenon*) అనగా విచిత్రమనియు, (3) క్రిప్టాను (*Krypton*) అనగా దాగియున్న అని అర్థము. పై మూడు వాయువులతోపాటు హీలియము (*Helium*) అను వాయువుకూడా వున్నటుల కనుగొనబడినది. మొట్టమొదటలో హీలియము అను వాయువు భానునియందు మాత్రమే వసించియుండు నని తలచిరి. 1869 లో లాకియరు (*Lockyer*) అను శాస్త్రవేత్త దివాకరునిఛాయ (*Spectrum*) ను పరిశీలించి దానిలో ఏవేవో కొన్ని రేఖ లున్నవనియు, కానీ భూమిపై ఏ ఇతరఛాయలోని రేఖలతోనూ ఏకీభవించకపోవుటచే ఈ నూతనవాయువు సూర్యునిలో తెలిసికోతగినంతగా యున్నదనియు కనుగొనెను. 1895 లో రాంసే (*Ramsay*) అను శాస్త్రవేత్త ఆర్గాను తయారుచేయుటకు భూమిలోని పలురకములైన ఖనిజములను (క్లీవైట్ మొదలయిన) బాగా వేడిచేశాడు. సూర్యునిలో హీలియము వున్నదనుటచే వచ్చిన ఛాయలోని రేఖలతో నేకీభవించు మరికొన్ని రేఖలు వేడి చేయగా వచ్చిన వాయుచ్ఛాయలో కనుగొనబడినవి. అందుచే అప్పటినుండి ఈ నూతన వాయువునకు 'హీలియము' సూర్యునిలో దాగివున్న (*Hidden in Sun*) అను పేరివ్వబడెను. కొద్దికొద్దిగా వాతావరణములోనే యున్నప్పటికీ.ఇప్పుడు హీలియము భూభాగమునందలి వూటలలోని నీటినుండి తయారగుచున్నది.

ద్రవీకరణమొనరింపబడిన గాలి - అందుండి ప్రాణవాయువు.—సాధారణముగా పరిశుభ్రమయిన ప్రాణవాయువు (*Oxygen*) ద్రవీకరణ మొనరింపబడిన గాలినుండి లభించుచున్నది. కర్బన ద్వి ఆమ్ల జనిదమునుండి, నీటి ఆవిరినుండి పరిశుభ్రపరుపబడిన గాలి చాలా ఎక్కువ వత్తిడితో (*Pressure*) వత్తిడిచేసిన తరువాత వత్తిడి తక్కువగా యున్న గదిలో వ్యాకోచము నొందించెదరు. ఆ తరువాత గాలి కొంతవరకు చల్లబడును. దానిలోని ఉష్ణము హరింపబడుటచే చల్లబడినగాలి లోనికి వచ్చునటువంటి గాలిని చల్లపరుచుట కుపయోగించబడును. ఇలా అనేక పర్యాయములు జరిగిన తరువాత క్రిందనున్న గదిలోనికి చుక్కలు చుక్కలుగా ద్రవీకరణమొందిన గాలి చేరును. తయారయిన గాలి ప్రాణవాయువును తయారుచేయుటలో ముఖ్యముగా నుపయోగింతురు.

గాలి-ఇతరస్థాపనలు —

1. హరిణము (*Chlorine*) తయారుచేయుటకు నెలకొల్పబడిన డీకన్సుపద్ధతి (*Deacon's Process*) అనవసరమైన రంగులను పోగొట్టుటకును, క్రిములను నాశనమొందించుటకును హరిణము చాలా అవసరము. కాన హరిణము క్రింది పద్ధతిన విరివిగా తయారుచేసెదరు. ఉదజని హరిదము (*Hydrogen Chloride*) ను ప్రాణవాయువుతో ఆమ్లీకరణ మొనరించినపుడు హరిణమున్నూ, నీరున్నూ తయారగును. రసాయనమార్పుచే కొంత వుష్ణము జనించును. అందుకై ఈ మార్పు చాలా తక్కువఉష్ణోగ్రత వద్ద నెలకొల్పవలెను. చాలా తక్కువ వుష్ణోగ్రత వద్ద రసాయన మార్పు అతి త్వరితగతి లేక మందగించును. అందుచే రసాయనమార్పునకు సహాయకారి (*Catalyst*) ఒకటి కావలెను. ఇచ్చట వుపయోగించు సహాయకారి తామ్రహరిదము. కావలయు వుష్ణము 450° మాత్రము. తయారయిన హరిణము. నత్రజనితో కలసియుండును. అందుచే ఈ మిశ్రము భావనచూర్ణము (*Bleaching Powder*) తయారుచేయుటలో నుపయోగింతురు.

2 గంధకికామ్లము తయారుచేయుట గంధకికామ్లము రసాయన శాస్త్రవేత్తలకు, కంసాలివారికి, మరి ఇతర పనులకును అనేక విధములుగా చాల వుపయోగకారిగా నుండుటచే అది ఈ క్రిందివిధముగా సమృద్ధిలో తయారు చేసెదరు. గంధకికామ్లము తయారుచేయుటకు గంధకత్రి ఆమ్ల జనిదము ముఖ్యము. గంధక త్రి ఆమ్ల జనిదము, ఇనుపగంధకిదమును (*Iron Shlpide*), బాగుగా గాలిలో కాల్చుటచే వచ్చిన గంధక ద్వి ఆమ్లజనిదమును (*Sulphur dioxide*) విరివిగా గాలితో 500° వద్ద ప్లాటినము సహాయకారిలా వుపయోగించినపుడు తయారగును. తయారయిన గంధక త్ర్యామ్ల జనిదము బాగుగా దుమ్ముకణములు మొదలగు మాలిన్యములనుండి పరిశుభ్రపరుపబడిన తరువాత 98% నిజ్జల గంధకికామ్ల మున్నగదిలోకి పంపబడును. ఈగదిలోకి రెండవ వేపునుండి నీటిప్రవాహము పంపబడును. గంధక త్రి ఆమ్ల జనిదమున్నూ, నీటి సరఫరాయున్నూ గంధకికామ్లము ఎల్లప్పుడు 98% వుండేలా అమర్చబడును. గంధకికామ్లపు పరిమాణము మెల్లిగా హెచ్చును. తయారయిన గంధకికామ్లము లోహములను కరుగుటకునూ, లోహముల తయారుచేయుటకునూ, అనేకరకములయిన లవణముల తయారుచేయుటకును, విద్యున్మలామా చేయుటకునూ వుపయోగించబడుచున్నది. అమూల్యములైన ఎరువులకును, అనేకవిధములయిన ప్రేలెడు వస్తువుల (*Explosives*) తయారుచేయుట కుపయోగించబడుచున్నది.

3. బర్కిలాండు మరియు ఐడ్సు పద్ధతి వాతావరణపునత్రజనినుండి నత్రికామ్లముతయారు చేయు పద్ధతి నత్రజనియును ఆమ్లజనియును చాలా ఎక్కువ వుష్ణోగ్రత వద్ద రసాయన సంయోగము నొందింపబడును. ఈ ఎక్కువ యుష్ణోగ్రత నీటితో చల్లార్చబడిన రెండు తామ్ర ధ్రువముల మధ్య నెలకొల్పబడిన విద్యుచ్చాపము చేవచ్చును. రసాయన మార్పు జరిగిన తరువాత నత్రజన్యామ్ల జనిదము వచ్చును. ఆటుపిమ్మట ఆమ్లీకరణము నొంది నత్రజనిద్వి ఆమ్లజనిదము (*Nitrogen Peroxide*) లా మారును. తయారయిన నత్రజని ద్వి ఆమ్లజనిదము నీటిలో కరుగనిచ్చిన నత్రికామ్లమునూ, నైట్రస్ ద్రావణమును తయారగును. నైట్రస్ ద్రావణము వియోగము చెంది నత్రికామ్లమునూ, నత్రజన్యామ్ల జనిదము నిచ్చును. ఏరీతిగా తయారయిన నత్రికామ్లము రజతనత్రితము, మొదలయిన అమూల్య పదార్థముల తయారుచేయుటయందేకాక నైట్రో గ్లిసరిన్, నైట్రో సెల్యూలోసు అను ప్రేలెడు సామగ్రిలోనూ, నానా చిత్రగ్రహణములోనూ విలువగలిగిన నత్రితి రంగులలోనూ ముఖ్యముగా ఉపయోగించబడుచున్నది. కాన ఇలా నత్రికామ్లమును గాలినుండి తయారుచేసిన అనేక విధముల తోడ్పడును.

4. నవాసారము (*Ammonia*) ఆమ్లీకరణమొందించుట - ఆస్వాల్డు పద్ధతి నవాసారమును (*Ammonia*) నత్రజనినుండియు, వుదజనినుండియు హాబర్ బాష్ పద్ధతివల్ల తయారుచేసెదరు. తయారయిన నవాసారము నామ్లీకరణ మొనరించెదరు—బాగుగా విభజింపబడిన సహాయకారితో. అప్పుడు నత్రజని ద్వి ఆమ్లజనిదము తయారగును. దీనిని నీటిలో కరగించినచో నత్రికామ్లము తయారగును. ఇది బాగుగా పరిశుభ్రపరుపబడి బలపరుపబడును.

5. సయనమైడు పద్ధతి : ఈపద్ధతి రెండు విధములుగా ఉపయోగపడుచున్నది. ఈ పద్ధతే నవాసారము తయారుచేయుటకుగాని, లేక నైట్రోలీమ్ అను ఎరువు తయారు చేయుటకుగాని వుపయోగించవచ్చు. మొట్టమొదట కాల్సియకర్బనిదము (*Calicium-Carbide*) రెండు కర్బనపు కడ్డీల మధ్య నేర్పరుపబడిన విద్యుచ్చాపముతో కాల్సియ ఆమ్లజనిదము, కర్బనము లేదా బొగ్గు బాగుగా వేడిచేయుటచే తయారగును. తయారయిన కాల్సియ కర్బనిదము 1100° వరకు నత్రజని వాతావరణములో విద్యుచ్చాపమువలన వేడిచేయబడును. అప్పుడు కాల్సియం సయనమైడు, గ్రాఫైటును తయారగును. ఈ రెంటి మిశ్రమును నేరుగా చెల్లుకు నైట్రోలీమ్ (*Nitrolim*) అను నేరు ఎరువులా వుపయోగించవచ్చును. ఈ మిశ్రము విడివేయబడే చల్లని నీటితో బాగుగా కడుగబడును రసాయనమార్పు చెందని కాల్సియ కర్బనిదము నీటితో సంయోగము చెంది తీసివేయబడును. మిగిలిపోయిన కాల్సియము సయనమైడు సోడియ కర్బనితము (*Sodium-Carbonate*) తో నీటి ఆవిరిచే వేడిచేయబడిన తరువాత బాగుగా వత్తిడిచేయబడిన నీటియావిరి ఈ మిశ్రముపై పంపబడును. అప్పుడు కాల్సియం సయనమైడు నీటి ఆవిరితో సంయోగము చెంది నవాసారము నిచ్చును. ఈ నవాసారము నీటియావిరిచే గొంపోబడి ద్రవములాగా మారును. ఈ నవాసారము ముఖ్యముగా ఎరువులు తయారు చేయుటకునూ, ప్రేలెడు సామగ్రి తయారు చేయుటకునూ ఉపయోగించబడుచున్నది.

6. లోహముల లేక ధాతువుల తయారు:—ఈ క్రింది ధాతువుల తయారుచేయుటలో కూడా గాలి విరివిగా ఉపయోగించబడుచున్నది: (1) తామ్రమును కాపరుపైరైట్సు అను ఖనిజమునుండి తయారుచేయుటలోనూ, (2) తుత్తునాగ గంధకిదమునుండియున్నూ, (3) ఇనుము నుతయారుచేయు 'వడిగాలి కొలుములలోను', (4) ఉక్కు తయారుచేయుటలోనూ వుపయోగించబడుచున్నది కాన గాలివలన శాస్త్రవేత్తకనేక ఉపయోగములు గలవు.

గాలిలోని వివిధ వాయువుల ఉపయోగములు-ప్రాణవాయువు' ప్రతి ప్రాణికోటికి ప్రాణవాయువు మూలాధారము. ప్రాణవాయువు లేనిదే ఏ ప్రాణియు బ్రతకజాలదు. ప్రాణవాయువు మండెడు వస్తువుల విరివిగా మండింపజేయును. ప్రాణవాయువున్నూ, వుదజనినిన్నీ సరిఅయిన పాళ్లలో 'ఆక్సి-హైడ్రోజన్ ఫ్లేము' అను దానిలో గొప్పగొప్ప లోహసంబంధపు దూలముల కరగించుట కుపయోగించును. రెండు లోహము లతుకబెట్టుటకుకూడా వుపయోగించును. ఈ వుపయోగమునకే యుపయోగపడు 'ఆక్సిఎసిటలీను' ఫ్లేములో ప్రాణవాయువు విరివిగా వుపయోగించబడుచున్నది. ఉదజని : వుదజని చాలా తేలికయిన వాయువవుటచే ఇంతకు పూర్వము ఎగిరెడి బెలూన్సులో నుపయోగించెడివారు కాని వుదజని సులభముగా మండుటచేతను, అనేకప్రమాదములు సులువుగా సంభవించుటకు వీలుకలుగటచేతను యుదజనిస్థానే ఇప్పుడు మందవాయువు, తేలికవాయువునైన హీలియము నుపయోగించబడుచున్నది. కాన ప్రమాదముల భయము తొలగించబడినది. హీలియము కనుగొనబడుటచే ఎరువులకును, ప్రేలెడి వస్తువులకు చాలా ముఖ్యమయిన నవాసారము వాతావరణములోని యుదజనినుండియేగదా తయారగుచున్నది! నత్రజని నత్రజనియును, నత్రికామ్లము తయారుచేయుటకును, నవాసారము తయారు చేయుటకునూ, ఉపయోగించబడుచున్నది. ఇవి కనుగొనబడుటచే అనేకములైన పెద్దపెద్ద పరిశ్రమలు జరుగుచున్నవి. మంద వాయువులు – మందవాయువులు వేడిమిచేతను, విద్యుత్తుచేతను మరి ఏ యితరములైన విధముల చేతను మార్పు చెందవు కాన విద్యుద్దీపముల నింపుటలో నుపయోగించబడుచున్నవి. మందవాయువులవల్లనే నియానులాంపులు, నియానువెలుగులు మొదలగు ప్రకటనలకును, వేడుకలకునూ వుపయోగించు లైట్లు తయారగుచున్నవి. (అమ్మోనియా, నవాసారవాయువు ద్రవీకరణ మొనరింపబడినపుడు నవాసారవాయుద్రావకము (*Liquid Ammonia*) వచ్చుచున్నది. దీనినుండి చల్లపరుపబడు యంత్రములును వాయువుల ఘనీభవపరుచు యంత్రములును కనుగొనబడినవి.

కథానిక:

జాలి గుండె



శ్రీ కంచి వాసుదేవరావు

౧

నీలాకాశము నల్లగా అయింది. యీదురుగాలి కొడ్తోంది. కప్పలు బెకబెకలాడుతున్నాయి. వర్ష పుజల్లు పడ్తోంది. కేశవులు చిరిగిన శాలువ కప్పుకుని మాసిన నవారుమంచముపైని కూర్చుని శూన్యములోకి ఏదో ఆలోచనగా చూస్తున్నాడు. వీధిలో వాననీళ్ల గుంటలోకి ఒక కప్ప వురికింది. అసలే బురదగావున్న నీళ్లు మరింత బురదయ్యాయి. కేశవులు ఎదురుగావున్న అరుగుమీద తల దాచుకోవడానికి ఒక జీర్ణవస్త్రములు దాల్చిన ఒక ముష్టివాడుని చూశాడు. పాపము అనుకున్నాడు నెరసినగడ్డాల్ని సవరించుకుంటూ "క్రొన్నాళ్ల క్రిందటివరకు నీపని యిలాగే వుండేదికదా!" ఎవరో అరచినట్లయింది. అవు ననుకున్నాడు. తన తొలిపాతికేళ్ల జీవితము గుర్తుకు వచ్చింది.

అప్పుడు

నెయ్యి నూనె మొగము చూడని రోజులని, విరబిగిసిన పచ్చడి మెతుకులే పంచభక్ష్యపరమాన్నాలు అనుకున్న రోజులని, ఒకపూట, రెండుపూటలు, వారానికి మూడురోజులు పస్తున్న రోజులని తను చూసాడు.

హేమంతఋతువులో చలికి గజగజ వణకుతూ కప్పుకోవడానికి దుప్పటి లేక ఒంటిలాగ ముడిచిపెట్టుకున్న రోజులని, చిరుగుబట్టలుతప్ప మంచిబట్టలు కట్టని రోజులను తను చూస్తాడు.

సొంత యిల్లు లేకపోగా అద్దెను యిచ్చుకో లేక ఒక పక్క కూలిపోతున్న గబ్బిలాల కొట్టులోను, పూరిగుడిసెలలోపున ఎవరి వీధి వసారాలో అయినా బాటసారిలాగ నిద్రపోయిన రోజులు వున్నాయి.

వారాలు చేసుకుంటూ, కలిగిన అమ్మ యిచ్చిన పాతబట్టలు కట్టుకుంటూ.. దయతల్చిన స్నేహితుడు ఎవరయినా చదువుకోడానికి రానిస్తే అదే అదృష్టమనుకుని మామూలు దీపాలక్రింద చదువుకున్న రోజులు...అల్లా కాకపోతే మున్సిపల్ దీపాలక్రింద చదువుకున్న రోజులు వున్నాయి.

చేసుకొన్న పెళ్లాముని, ఆవిడ ముద్దు ముచ్చటలు తీర్చలేక "యిన్నాళ్ల యింది కాపురానికి వచ్చి, ఒక చీరఅయినా కొని పెట్టారూ? పెళ్లాము ముద్దుముచ్చటలు తీర్చలేనివాళ్లు ఎందుకు పెళ్లి చేసుకోవాలి ?" అంటూ ఆవిడ సణుగుళ్లకి సాదింపులకి జవాబు చెప్పలేక క్రుంగిపోయిన రోజు లున్నాయి.

పుట్టిన తొలుచూరుపిల్లాడికి తల్లిపాలు లేకపోతే అవుపాలు, డబ్బా పాలు కొనడానికే కానీ పుట్టక పిల్లవాడ్ని మాడ్చినరోజులున్నాయి. పసికందుకి బల్లవస్తే వైద్యసహాయము చేయించలేక దేవుడిమీద భారము వేసి, ఆ పిల్లవాణ్ణి పోగొట్టుకున్న రోజు వుంది.

బ్రతుకు తెరువుకోసము యిల్లిల్లు చెప్పులు అరిగేట్టు, కాదు కాళ్లు అరిగేట్టు ప్రయివేట్లు చెప్పతానంటూ తిరిగిన రోజులు...పొట్టకూటి కోసము ఆత్మాభిమనమును ఒకమూలకు నెట్టి అడ్డమయినవాళ్ల కాళ్లు పట్టుకొని దేవులాడిన రోజులు వున్నాయి.

బ్రతుకుమీద విసుగూ విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకొందామని ప్రయత్నించినరోజులూ, అదృష్టాల్ని దేవతల్ని తూలనాడిన రోజులూ వున్నాయి. కలిగినవాళ్లని చూసి యీర్ష్యపడిన రోజులు వున్నాయి. "నా బ్రతుకు నేను బతకకుండా యీ పెళ్లాముని ఎందుకు తెచ్చుకుని, దాని ముద్దుముచ్చటలు తీర్చలేకపోవాలి? పుట్టిన పిల్లాడికి వైద్యసహాయము చేయలేక ఎందుకు బతుకుతున్నాను" అంటూ ఏడ్చిన రోజులు వున్నాయి.

లోకమనేది—"పూర్వజన్మలో పెట్టిపుట్టవద్దా? పూర్వజన్మలో లేనిది యిపుడు రమ్మంటే ఎల్లా వస్తుంది?" అని. లోకము భావించేది కేశవులికి తను ఏవిధమయిన గౌరవమర్యాదలూ చూపించ నవసరము లేదని తమదగ్గరికి వారాలికి... చందాలకి వచ్చిన యీ కేశవులికి ఏవిధమయిన ఆత్మగౌరవముంటుందీ అని అనుకునేది లోకము. యీ జన్మలో ఏదైన దానధర్మములు చేస్తే మళ్లా జన్మంలో మంచిగతు లుంటాయని కేశవులికి లోకము దానముచేసేది. స్వార్థముతో దానము చేసేది కానీ, ఒక అభాగ్యుడ్ని వుద్ధరిద్దామన్న కుతూహలముతో కాదు. ఆ అభిప్రాయము వుండబట్టే లోకము కేశవులులాంటి అభాగ్యులను పైకెత్తడానికి చేసే దానముకన్న దేవుళ్లని వుద్ధరించడానికి చేసిన దానాలు ఎక్కువగా వుంటాయి.

తాత్కాలికముగ కొద్దివాన తెరిపి యిచ్చింది. ఎదురుగుండా వున్న ముష్టివాడు వెళ్లిపోయాడు. నీళ్లను చిమ్ముకుంటూ ఒక మోటారుకారు అతని యింటిముందునుంచి చప్పుడు చేసుకుంటూ వెళ్లింది. ఆ చప్పుడికి కేశవులు అటు తిరిగాడు, అవును, మొన్న మొన్నటివరకు తను కారులో తిరిగిన వాడే! మళ్లా అతని గత జీవితము గుర్తుకు వచ్చింది.

కాలచక్రము తిరిగింది. బళ్లు ఓడలు అయ్యాయి. ఓడలు బళ్లు అయ్యాయి.

కేశవులికి అదృష్టము కలసివచ్చింది. తను ముందర సేకుకంపెనీలో గుమాస్తాగా చేరి. యజమాని ప్రాపకము సంపాదించి.. చివరకు యజమాని గతించగానే.. తానే సొంతముగా సేకుకంపెనీ పెట్టి...అందులో లాభాలు బాగా సంపాదించాడు.

ఆజీవితములో :

పిండివంటలతో భోజనముచేస్తూ...పట్టుదుకూలము కట్టూ...సుందరహర్మ్యాలలో నివసిస్తూ ...కార్లలో తిరుగుతూ చలికాలములో కాశ్మీరశాలువలు కప్పుకుంటూ వారముకి వచ్చినవారికి పెట్టూ.. యిళ్లలో వుండడాకుని కొందరికి చదువు చెప్పిస్తూ.. వీలయినంత మందికీ జీవనోపాధి కల్పిస్తూ గడిపాడు రోజులని.

ఆ రోజులలోలాగ పెళ్లాముని ఏడ్పించడమూ లేదు. ఆవిడ సణగడమూ లేదు. తన కుటుంబములో ఎవరికయినా కొద్ది పడిసముపడ్తే డాక్టర్లకి కబుర్లు వెళ్లేవి.

లోకముమటుకు సమయానుకూలముగా తన ముందుకు వచ్చి భజన మొదలెట్టేది. లోపల మటుకు కుళ్లుగా వుండేది. తమదగ్గర వారాలు చేసుకున్న ఒక ముష్టి వెధవ యిప్పుడు తమకే వారాలు పెట్టేట్టు వున్నాడు అని వాళ్ల బాధ. ఆ బాధ నలిగక్కుకోవడానికని మొగముమీద ఎక్కడా లేగు ఆ అదృష్టగీత......యింక ఎక్కడో వుందని చాటుగా అనేవాళ్లు. యిది కూడా పూర్వజన్మ సుకృతమని వాళ్లు మరచిపోయారు. తను దీనావస్థలో వున్నప్పుడు పూర్వజన్మలో పెట్టి పుట్టవద్దా అని వ్యాఖ్యానించినవారు యిప్పుడు అలాగే చెప్పుకుని ఎందుకు సమాధానపడరూ? అని అనుకునేవాడు కేశవులు. తమకన్న తక్కువవాడు పైకి వెళ్లగానే ముందర పైనున్న వాళ్లు కుళ్లుతారు అని అనుకునేవాడు కేశవులు.

కేశవులికి ఆ రోజులలో విసుగూ, విరక్తి లేదు. అతను కూడా జీవితావసరములని మిన్నగా పొందుతున్నాడు.

౨

మళ్లా ఆకాశము మూసుకువస్తోంది. కప్పల బెకబెక ఎక్కువవుతోంది. చుట్ట వెలిగించి మళ్లీ ఆలోచనలో పడ్డాడు.

తనయితే బాగా సంపాదించాడు కానీ నిలవ చేయలేకపోయాడు. కారణము అతను తన పూర్వపు కష్టదినాలని మర్చిపోలేకపోవడమే. తను ఒక చీకటికొట్టులోంచి వెలుగుమొగము చూడకుండ కొన్ని ఏళ్లు వుండి ఒక్కసారిగా వెలుతురులోకి వచ్చినట్టు లేమినుంచి కలిమిలోనికి ఒక్కసారిగా వచ్చాడు. స్వయముగా కష్టాలను అనుభవించినవాడు యింకొకరి కష్టాలను అగర్భశ్రీమంతులకన్న కష్టమంటేఏమిటో ఎఱుగనివారికన్నా బాగా అర్థముచేసుకోగలడు. బాగా సహాయము చేయగలడు కూడాను. కటిక దరిద్రుడు బాగా డబ్బున్న ఆసామి అయినట్లయితే అతను లోభిగానైనా మారవచ్చు. లేకపోతే దుబారాకోరుగానే మారవచ్చు. డబ్బు అంటే ఏమిటో ఎఱుగక మొగము వాచియున్నవాడు కనుకనూ బీదజీవితానికే అలవాటుపడ్డవాడు కనుకనూ, అదనపు సౌకర్యాల అవసరము కలుగనివాడు లోభి అవుతాడు. లేనివాడు ఎల్లాగూ లేదు; వున్నప్పుడయినా ఎందుకు అనుభవించకపోవాలి అనుకునేవాడు దుబారాకోరు అవుతాడు.

తను రెండవరకముగా మారాడు. అతను దుబారాకోరు అయ్యాడు. కానీ తను స్వంతానికికన్న యితరులకి విచ్చలవిడిగా ఖర్చుపెట్టేవాడు.

దుర్భరమయిన లేములవల అతనిజీవితము మారింది. యితరుల కష్టాలని గుర్తించి వారికి సానుభూతి సహాకారాలు చూపించడమే ఆ మార్పు. తనది జాలిగుండె. యితరుల కష్టనష్టాలంటే అతని హృదయంలో జాలితో కాదు. సానుభూతితో నిండిపోయేది. తను కర్చిపోయేవాడు. వారికి సహాకారము యిచ్చేవాడు.

ఎక్కడ వున్నాసరే ఎవరయినా "బాబూ, తిండికి లేదు" అంటే చాలు, జేబులో ఎంతవుంటే అంతా యిచ్చేవాడు. ఎవరయినా "చలికాలము బాబయ్యా, బట్టలు లేవు" అంటే, వారికి బట్టలు యిచ్చేవాడు. "వుండడానికి యిల్లులేదు బాబయ్యా, గంపెడు సంసార" ముంటే ఎల్లాగో వాళ్లకి సహాకారము యిచ్చేవాడు.

చదువుకోవడానికి ధనసహాయము చేయమని ఎవరైనా వస్తే తను వారికి పుస్తకాలు కొనిపెట్టేవాడు. జీతాలు కట్టేవాడు. బట్టలు యిచ్చి తిండి పెట్టేవాడు.

ఎవరయినా వుద్యోగముకోసము వస్తే వారికి జీవనోపాధి చూపంచేవాడు. ఎవరయినా పెండ్లికి జబ్బుగా వుంది, వైద్యసహాయము చేయించలేమంటే వారికి వైద్యసహాయము చేయించేవాడు. యింక వివాహాలమాట చెప్పనే అక్కరలేదు.

ఔషధము ఒక మోతాదులో పుచ్చుకుంటే రోగాన్ని పోగొట్టుంది. ఆ మోతాదే ఎక్కువవుతే రోగినే పోగొట్టుంది. సుగుణాలు దానము ధర్మము మొదలైనవి మోతాదు ప్రకారము కలిగివుంటే రాణిస్తాయి. అదే మోతాదు ఎక్కువవుతే అతని నాశనానికే దారితీస్తా యన్న విషయాల్ని తను గ్రహించలేకపోయాడు.

అతని స్నేహితులు బంధువులు తనతో వాదనకి వచ్చేవారు యీ దానము యింత చేటుగా పనికి రాదని. ముందరముందర ఏమవుతుందో గ్రహించుకోమని సలహాలు యిచ్చేవారు. తను వారి మాటలు పెడచెవిని పెట్టాడు. ఆ మాటలను నిర్లక్ష్యము చేశాడు. పైగా వారిని కసురుకునేవాడు. "యిప్పుడు పుట్టుకువచ్చిన అపేక్షలో నాకు సలహాలు మీ రేమీ యీయనక్కరలే"దని కసురుకునేవాడు. వారి మనసుని కష్టపెట్టడానికి ఏమాత్రము సంకోచించేవాడు కాదు. కనుక అతనికి ఎవరూ సలహాలు చెప్పడము మానివేశారు.

బీదతనము అతన్ని పెంకివాడుగా చేసింది. సాధారణముగా బీదతనము దీనుడుగా చేస్తుంది. కానీ తనకిమటుకు వేరయింది. తనకి ఎంత తోస్తే అంత. తన మాటకు ఎదురు ఎవరయినా చెప్తే సహించేవాడు కాదు.

కానీ తన జాలిగుండె తన నాశనానికి దారి తీసింది. చాలమంది తన జాలిగుండెని తనమీదికే ప్రయోగించారు. అతని దగ్గరకు కల్లాబొల్లి ఏడ్పులతో వచ్చేవారు—తిండికి లేదని, బట్టకు లేదని. తన చుట్టూ చేరి దానకర్ణుడని, యింద్రుడని, చంద్రుడని పొగిడేవాళ్లు.

నౌకర్లుకూడా అతన్ని మోసగించేవాళ్లు. అనుభవముమీద ఆ విషయాన్ని తను తెలుసుకోగల్గాడు. వాళ్లు అతని కళ్లలో కారము కొట్టడానికి ఏమాత్రము సంకోచించేవారు కాదు. తన యింట్లో వస్తువులు పోతూవుండేవి. తను ఎవర్నీ గదమాయించలేకపోయేవాడు. వస్తువు ఒకచోట, అనుమాన మొకచోట వుంటుంది. ఎందుకు అనవసరముగా, అన్యాయముగా ఒకరిని దండించి బాధించాలి; ఫలానివారు తీశారని తెలియకుండా మన జాగ్రత్త మనము పడాలి అని అనుకునేవాడు తను.

యీ బలహీనతను నౌకర్లు కనిపెట్టి నిర్భయంగా వస్తువులు తీసేవారు. కర్మను చాలక ఎవర్నయినా, అడుగుతే "మేమేం ఎఱుగము బాబూ! మీలాంటి ధర్మరాజుల కడ తీస్తే మేము పురుగులు పడి చావమా?" అనే వాళ్లు. నౌకర్లని మాన్పిద్దాము అంటే "బాబూ, మీరు పెట్టిన దీపాన్ని మీరే ఆర్పేస్తారా?" అంటూ పైపెచ్చు అనేవాళ్లు.

మోసగాళ్లకి దయ పాపభీతీవుండవు. తమకు అన్నము పెట్టినవారింటికే కన్నము పెడ్తారు. పళ్లను చెట్టుఎక్కి కోసుకునేవారికన్న కర్రలు పెట్టి రాళ్లు రువ్వి కోసుకునే వాళ్లు ఎక్కువేమో అని తను అనుకుంటూ వుండేవాడు. అవును; బెల్లము వుంది, చీమలు పట్టి ఆ బెల్లాన్ని గుల్ల చేయడము ఎంతసేపు జాగ్రత్తగా వుంచకపోతే? పట్టిన చీమల్ని వదలించడము చాల కష్టము.


3

ఆకాశము నిర్మలముగా అక్కడక్కడ వుంది. కొద్దిగా సూర్యకాంతికూడ పడింది. కానీ మేఘాలుకూడా బాగ ఒక పక్కనుంచి వస్తున్నాయి. కేశవులు మళ్లా జీవితాన్ని నెమరువేసుకొంటున్నాడు.


అపుడు తనకు నలభై అయిదేళ్లు. పోయినవాడు పోగా యిపుడు అయిదుగురు పిల్లలు తనకు మొదట మొగపిల్లవాడు: తర్వాత వరుసగా యిద్ద రాడపిల్లలు; తర్వాత వరుసగా ఒక మగపిల్లవాడు, తర్వాత ఆడపిల్ల. పై యిద్దరు ఆడపిల్లలు పెద్దవాళ్ల వడమువలన వాళ్లకి పెళ్లి పేరంటాలు చేయవల్సిన అవసరము తనకు కల్గింది. యిప్పటి హిందూ సంఘంలో ఆడపిల్ల పెళ్లి అంటే ఎంతో కష్టము. కట్నాల డిమాండుకి ఆడపిల్లలను కన్న తిండ్రులు తట్టుకోలేకున్నారు. కొంచెము స్థితిపరుడు, విద్యావంతుడు దొరకా

(18 వ పేజీ చూడుడు)

సాధారణముగా వాతావరణములోని ఈగాలి వలని ఇన్ని వుపయోగము లున్నవని రసాయన శాస్త్రజ్ఞులవల్లనే విదితము జేయుబడినది. కాన స్వభావసిద్ధముగా ఎందుకునూ పనికరాని, లేదా పనికిరానివని ఎంచబడిన ఎన్నో పదార్థములనుండి అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలమోఘములైన అనేక ఉపయోగకరములైన పదార్థములను నూతనపద్ధతులతో తయారుచేయుటలో ముందంజ వేయుచున్నారు. పరిశ్రమల నభివృద్ధినొందించుటకై. ఏదేశమయినను భాగ్యవంతము కావలెనన్న పరిశ్రమ అభివృద్ధి నొందవలె. పరిశ్రమలభివృద్ధి నొందవలెనన్న రసాయన శాస్త్రమభివృద్ధి నొందవలె. కాన దేశాభ్యుదయానికి శాస్త్రజ్ఞు లెంతో ముఖ్యము.



భారతదేశానికి ఫెర్గుసన్ ట్రాక్టర్లు. ఇంగ్లండు, కావెంట్రీలో ఉన్న కర్మాగారం రోజుకే 250 ట్రాక్టర్లు తయారుచేస్తోంది. రోజుకు వెయ్యి తయారుచేయగల మరో కర్మాగారం తయారవుతూంది. నెహ్రూ గత అక్టోబరులో లండను వెళ్లినప్పుడు ఈ ట్రాక్టర్లకు ఆర్డరిచ్చాడు. న్యూ ఢిల్లీ స్టేషనులో ఈ 20 ట్రాక్టర్లు కొత్తగా దిగినవి.



జనీవాలో జరిగిన మోటారు ప్రదర్శనంలో ప్రదర్శింపబడ్డ 1135 రకాల
46 రకాలు బ్రిటిష్ రకాలే. ప్రదర్శనశాల దృశ్యం.

చిత్రాల

బ్రి




వ్యవసాయకుని పనుల్లో, రాతి నేలల్లో గోతులు తవ్వటం, కర్రలు పాతటం, బరువైన పనులు. ఈ పనులన్నీ ఈ యంత్రమే చేస్తుంది. ఈ యంత్ర సహాయంతో చాలా పని బరువు వ్యవసాయకునికి తగ్గిపోతుంది.

వ్యాపార



లండనులో, భూగర్భంలో పోయే "ట్యూబ్" అనే రైలుమార్గం ఉంది. ఆ రైళ్లకు రేడియో యంత్రాలు అమర్చి, ఎప్పటికప్పుడు రైలుపరిస్థితి స్టేషనులో తెలిపేందుకు వీలుగా చేస్తున్నారు. సిగ్నల్ కాబిన్ వద్దనున్న ఈ రేడియో సెట్టు, రైలు విషయాలు తెలుపుతుంది.

బ్రిటన్, బెర్లి
ఇనప గర్డర్లను
గాటో విమ
2 టన్నుల బ
విమానంలోనుం



పూర్వకాలపు నౌకల నమూనా బొమ్మలను జైళ్ళలో ఖైదీలు ఊసుపోకకు తయారు చేశారు. ఈ చక్కని నౌకల మోడల్సును, విజ్ఞానార్థం అట్టేపెడుతున్నారు.






మోటార్లలోనూ

లో వార్తలు:

టన్



పాదచారులు, వీధులు ఇటునుంచి అటు దాటేందుకు నడిరోడ్లలో ప్లాస్టిక్ మార్గాలు నిర్మిస్తున్నారు.



గాజుతో చేసిన శిరస్త్రాణము. ఈ టోపి, స్టీల్ హెల్మెట్లంత గట్టిగానూ ఉంటమేకాకుండా ఇటునుంచి అటు కనబడేట్టు ఉంటుంది. గ్లాసుదారాలను, రజనులో పదును పేకగా పొదిగి ఇవి తయారుచేస్తారు.




నుకు విమానాలలో
కూడా పంపించింది.
గా నాశ్రయంలో
రవున్న ఈ గర్డరును
చి దింపుతున్నారు.


విజ్ఞానాలు

ఇళ్ల కొరతలకై బ్రిటన్ కొత్త పట్టణాలు కట్టుతుంది. ఎప్పుడో పడిపోయిన ఛేపింగ్ పట్టణ శిథిలాలలో నుంచి చిగ్రెంగ్ ఫీల్డు అనే కొత్తపట్టణం కట్టి 60,000 గృహాలు నిర్మించడానికి ప్రారంభించింది.

పొలాలలోని పెంట, మురుగు మొదలైనవన్నీ కలిసిన చెత్తనంతా ఈ యంత్రము చెక్కితవ్వి, సమమైన ఎరువుగా తయారుచేసి, కుప్పలు కుప్పలుగా పొలంలో అందిస్తుంది.







థేమ్సునదిక్రింద కొత్త సొరంగం నిర్మిస్తున్నారు. సొరంగం భాగము.



బాలానందం:

రైతు కూతురు యుక్తి

శ్రీ చారాల వెంకటనరసింహమూర్తి

అనగా అనగా ఒక ఊరిలో ఒక పేదరయితు ఉండేవాడు. రయితయినప్పటికిని సెంటు భూమిగూడ తన స్వంతమునకు లేదు. ఒక పూరిల్లు, తన ఏకైక పుత్రికమాత్రమే యాతని ధనము. ఒకనాడు కూతురు తండ్రితో "నాన్నా! నాన్నా! మనము రాజుగారివద్దకు పోయి పేదరికమునుగూర్చి వాపోయి 'ఒక ఎకరము బీడుభూమిని దయచేయిస్తే మేము పొట్టపోసు కుంటాము' అని ప్రాధేయపడుదాము" అని చెప్పింది.

రాజు వారిమొఱ ఆలకించి జాలిగుండెకల వాడయి ఒక ఎకరము బీడు భూమితో పాటు అర ఎకరముమేర సారవంతమయిన భూమిని గూడ ఇచ్చాడు.

ఒకనాడు వారు పొలంలో పనిచేయుచుండగా ఒక బంగారు సన్నెకల్లు కనుపించెను. తండ్రికూతుర్లు తమ అదృష్టమునకు సంతోషించిరి. తండ్రి కూతురిని చూసి 'అమ్మాయి, అమ్మాయి, రాజుగారిదయవల్లకదా మనకీ బంగారం దొరికింది. కృతజ్ఞతా సూచకంగా దీనిని రాజుగారికి బహూకరిద్దాం' అన్నాడు. 'అలా వద్దు. కల్వంలేకుండా సన్నెకల్లు ఇయ్యవద్దు. బంగారుకల్వంగూడ సంపాదించి రెండూ బహూకరిద్దాం' అన్నది కూతురు. తండ్రి ససేమిరా అని రాజుగారివద్ద కేగి 'రాజా! ఈ బంగారు సన్నెకల్లు మీరు దయచేసిన పొలం దున్నుతుంటే దొరికింది. నా సంతోషంకొద్దీ మీకు బహూకరిస్తున్నాను. అంగీకరించం'డని కోరాడు. రాజు వానివంక తీక్ష్ణముగా చూసి 'నీ కిది ఒకటేనా దొరికింది, కల్వంగూడా ఉంటుంది' పట్రమ్మన్నాడు. 'అయ్యా, కల్వం దొరకలేదు, ఇది ఒకటే' అని విన్నవించుకున్నాడు రయితు. రాజు వినకుండా వానిని బందిఖానాలోనుంచి, నీవు కల్వంగూడ తెచ్చిందాకా నీగతి యింతే నన్నాడు. రయితు జైల్లో 'అమ్మాయి! నీమాట వింటే నాకీ రాత పట్టేది కాదుగదా' అని కన్నీరు మున్నీరుగా ఏడవడం మొదలెట్టాడు. రాజీ సంగతి విని వానిని పిలిపించి మీ అమ్మాయి 'ఏమి చెబితే నీవు వినలే'దని అడిగాడు. 'సన్నెకల్లు ఒకటే ఇస్తే రాజు, కల్వం సంగతి ప్రశ్నిస్తాడు. మనం బంగారుకల్వం ఎక్కడ్నుంచి తెస్తాం' అన్నది. ఆమాట వింటే నాకీ గీత ఉండేదికాదని బావురున ఏడ్చాడు. ఆపిల్ల తెలివికి సంతోషించి రాజు ఆమెను పిలిపించి 'అమ్మాయి! నీవు బలే తెలివిగలదానవు లాగ వున్నావు. నిన్నొక యక్షప్రశ్న అడుగుతాను. సమాధానం చెబితే మీనాన్నను వదలటమే కాదు, నిన్నే పెళ్లిచేసుకుంటాను కూడా' అన్నాడు.

'నీవు గుడ్డలు కట్టకోకుండా, విప్పేసుకోకుండా, స్వారీచేయకుండా, సారథ్యం చేయకుండా రోడ్డుమీద కాకుండా, రోడ్డుపక్కల కాకుండా నావద్దకు వస్తే నిన్ను పెళ్లిచేసుకొంటాను,' అన్నాడు రాజు.

పిల్ల సరేనని పరిగెత్తింది. రయితు బ్రతుకు జీవుడా యని బయటపడ్డాడు. రయితుకూతురు ఇంటికి పోయి గుడ్డలు మార్చి జాలర్ల వల కట్టుకుంది. ఒక గాడిదను తెప్పించి వలచివర్లను గాడిదతోకకు బిగించి గాడిదను రాజుగారింటి వయిపు దవుడు తీయించింది. బొటనవ్రేళ్లు మాత్రం నేలను తాకుతున్నయి. తాను చెప్పిన షరతులన్నీ ఆ అమ్మాయి పాటించినందుకు సంతోషించి రాజు రయితుకూతుర్ని వివాహం చేసుకున్నాడు.

కొంతకాలమయిన తరువాత కొందరు కట్టెల వర్తకులు ఆవూరు వచ్చిరి. ఎడ్లబండ్లను, గుఱ్ఱపుబండ్లని విడి, విడిగా ఆపి మకాం వేసారు. గుఱ్ఱపుపిల్ల ఒకటి తన జట్టును విడిచి ఎద్దులదగ్గరకు పోయి పడుకొనెను. తన గుఱ్ఱపుపిల్ల నియ్యమని అడిగినను వారు నిరాకరించుటచే రాజుకు ఫిర్యాదు చేసెను. ఎద్దులదగ్గర పుట్టిన గుఱ్ఱపుపిల్ల ఎద్దులవానిదే నని రాజు తీర్పు చెప్పెను. వర్తకుడు అలో! లక్ష్మణా! యని ఏడుస్తూ రాణీ రయితు బిడ్డట. పేదల కష్టాలు విచారిస్తుంది అని తలచి రాణిగారి దగ్గరకు పోయి వాపోయాడు. రాణి మనసు కరిగి ఒక ఉపాయం చెప్పింది; తను ఈ ఉపాయం చెప్పినట్లు బయట పెట్టవద్దని వాగ్దానం చేయించుకుంది. ఆమె ఆదేశానుసారం, రాజుగారు ఉదయముననే దేవాలయానికి పోయే మార్గంలో గుఱ్ఱపుపిల్లను పోగొట్టుకున్న వర్తకుడు వలవేసి చేపలు పట్టి, నిజంగా చేపలు లేకున్నను వాటిని భద్రంగా తీసి వేరే బుట్టలో వేయడం చేయుచుండెను. రాజుగారటే వచ్చి 'ఇదేం జాలరీ, నీరు లేనిచోట చేపలు పడుతున్నా' వని ప్రశ్నించెను. 'ఎద్దులు గుఱ్ఱపుపిల్లను కన్నప్పుడు రోడ్డుమీద చేపలు పట్టడంగూడ సులభమే' నన్నాడు.

ఇందులో ఏదో ఆంతర్యం ఉన్నట్లు గ్రహించి వానిని పట్టి బాధించి నిజం చెప్పమన్నాడు రాజు. బాధ పడలేక తాను గుఱ్ఱపు పిల్లను పోగొట్టుకొనడం, రాణి ఉపాయం చెప్పడం వివరించాడు. రాజు ఉగ్రుడయి ఇంటికి పోయి 'రాజ్యాంగపురహస్యాలు బయట పెడుతున్నావు. నీ విట ఉండకూడదు. లేచి పొ'మ్మన్నాడు రాణీని. 'నీకు నాకు సంబంధం ఇంతటితో సరి కనక కడసారికోరిక కోర'మన్నాడు రాజు. నీకు ప్రియమయినది నీవు పోతూ తీసుకపొమ్మన్నాడుగూడ రాజు. రాణి ముఖం విచ్చింది. ఒక గ్లాసులో ద్రాక్షసారాయి పోసుకొచ్చింది. దీనిని మనిద్దరం త్రాగడమే నా కోరి కన్నది రాణి. రాజు గుటగుట త్రాగి మైమరచి పడిపోయాడు. రాణి రాజుతోసహా తన పూర్వపు గుడిసె చేరుకొని మైమరచిన రాజును వేరే శయ్యపై పరుండబెట్టెను. మరునాడుదయమున స్పృహ రాగా లేచి కూర్చుని నే నిక్కడ ఎందు కున్నానని రాణిని ప్రశ్నించాడు. 'నాకు ప్రియమయినది తీసుకొని వచ్చుటకు నాకాజ్ఞ ఇచ్చారు. మీకంటే ప్రియమయన వస్తువు వేరే నాకేముంది?' అని జవాబిచ్చింది రాణి. రాజు తల వంచుకొని సిగ్గుపడ్డాడు. రాణితోసహా స్వగృహం చేరుకొని బుద్ధితో ప్రవర్తించాడు రాజు.

అభూతపు చదువు

చి॥ పొణుగుపాటి సుబ్బారావు

అనగనగా పూర్వం "భట్టోజీ దీక్షితు"లనే గొప్ప పండితు డుండేవాడు. అతని కన్ని శాస్త్రాలూ కరతలామలకమే. అన్నిటికంటే వ్యాకరణశాస్త్రం చాల బాగా వచ్చును. అయితేం? ఎవ్వరికీ చెప్పేవాడు కాడు. అందువల్ల పెద్దభూత మైపోయినాడు. ఎవరికైనా చదువుచెప్పితే భూతంజన్మ పోతుంది. ఎట్లా? ఎవరు తనదగ్గర చదువుతారు? భూతంపేరు చెప్పితేనే పారిపోతారే. ఏమీ తోచక అలా నెత్తిత్తి తిరుగుతూ, భూలోకసంచారానికై మారువేషాల్లో వచ్చిన పార్వతీపరమేశ్వరులను చూచి తన సంగతి యావత్తూ మొఱ్ఱపెట్టుకున్నాడు. అప్పుడు వారు దయతలచి "నువ్వు చదువుకున్న విద్య ఇతరులికి చెప్పకపోవడంవల్ల నీకీ గతి వచ్చింది. మరేం ఫరవా లేదు. ఊరవతల పాడుపడివున్న దెయ్యాల మేడలో వుంటూ వుండు. రాత్రి అయేసరికి ఆ మేడ కలకలలాడుతూ దీపాలతో వైకుంఠంలాగ వుంటుంది. రాత్రి అయేసరికి నీకు మనిషిరూపం వస్తుంది. ఓ కుర్రాడు నీదగ్గర చదువుకొని నీ భూతం జన్మ పోగొడ్తాడు" అని చెప్పి అదృశ్యమయ్యారు.

ఇట్లా వుండగా కొన్నాళ్లకి ఓ కుర్రాడు చదువుకోసం కాశీ వెళ్లడానికి బయల్దేరి వస్తూ రాత్రి అవడంవల్ల ఆ వూరు చేరుకొనడానికి వస్తూ కలకలలాడుతూవున్న మేడ చూసి ఈ రాత్రి యిక్కడ పడుకొని వుదయాన్నే పోదామనుకొని మేడదగ్గరకు వచ్చేసరికల్లా ఒక యిద్దరు ముత్తైదువలు ఆదరంతో లోపలకి తీసికెళ్లి కడుపునిండా పాలూఅన్నము పెట్టి మేడమీద వున్న భట్టోజీ దీక్షితులదగ్గరికి తీసికెళ్లేరు. అతడు ఆదరంతో "ఇన్నాళ్లకి నాకు ముక్తి కలిగే అవకాశం వొచ్చిం దని లోపల సంతోషిస్తూ అబ్బాయీ, "ఎక్కడకు వెడుతున్నావు? ఏమిటి పని?" అని అడిగేడు. కుర్రాడు సంగతి యావత్తూ చెప్పినతర్వాత దీక్షితులు "నీకు సంవత్సరం విద్య ఒకమాసంలో చెప్పెదను. ఇట్లాగే ఒక్క ఏడాదిలోగా పన్నెండేళ్ల చదువు పూర్తిగా చెప్పగలను. ఇక్కడ హాయిగా వుంటావా?" అని అడిగేడు. కుర్రాడు తను బయల్దేరినవేళ మంచి దని పొంగిపోయి "ఓ! అలాగే" నన్నాడు. అప్పుడు దీక్షితులు వెంటనే చదువు ప్రారంభించి అర్ధరాత్రి అయినవెంటనే కుర్రాణ్ణి ఊళ్లోకి పోయి పడుకొని తిరిగి రేపు రాత్రిమాత్రమే ఇక్కడకు రా. పగలు ఎంతమాత్రం రావద్దు. వస్తే తల చెక్కలయిపోతుం దని చెప్పేడు.



కుర్రాడు సరేనని చెప్పి రాత్రి వెళ్లిపోయేడు. రోజూ రాత్రి రావడమూ, పగలు వూళ్లో వుండడమూ ఇట్లా ఆర్నెల్లు జరిగింది. ఈ ఆరు నెలలకీ ఆరేళ్ల విద్య వచ్చింది. పగటిపూట వూళ్లోకి వచ్చిన శాస్త్రవేత్తల నందరినీ వాదంలో హడలుకొట్టించేవాడు. ఇంత చిన్నకుర్రా డింత చదువు ఎట్లా చదువుకున్నాడని చూడడానికని కాశీనుంచి కూడా పెద్ద హేమాహేమీలు వచ్చి వాదించి వోడిపోయి "అబ్బాయీ! నీ కింత చదు వెలా వచ్చిం"దని అడిగేరు.

కుర్రాడు సంగతి యావత్తూ చెప్పగా అందరు నవ్వి ఆ మేడలో దెయ్యాలూ



పసిపిల్లల పోలీసులు: పిల్లలలో పెద్దతరగతులవాళ్లు, పసిపిల్లలకు పోలీసులుగా వ్యవహరిస్తూ రోడ్డులుపులలో వాళ్లను జాగ్రత్తగా దాటిస్తున్నారు. విదేశాలలో విద్యార్థులే ఈకాపలా పని, స్కూలు పరిసరాలనుంచి పసిపిల్లల ఇళ్లవరకూ చేస్తూఉంటారు.

భూతాలూ - గబ్బిలాలూ తప్ప ఇంకేం లేవు. అని చెప్పి అందులో ఎవ్వరూ వుండటంలేదు. పాడుపడి వుందని నలుగురూ అన్నారు.

అది కాదు. అది గొప్ప దివ్యభవనం. అందులో మా గురువుగారున్నారని కుర్రాడు చెప్పేడు. లోకులంతా, పద! కావలిస్తే చూద్దువు గాని అని తీసికొని వెళ్ళేరు. కుర్రాడు పగలు రావద్దని గురువుగారు చెప్పినమాట మరచిపోయి వెళ్ళి చూచేసరికి మేడంతా పాడుపడి గబ్బిలాలతోనూ భూతాలతోనూ, బూజులతోనూ గాడిదలతోనూ భయము వేస్తూ కనబడ్డది. అది చూచి కుర్రాడు "బాబోయ్" అని గుండె "గతుకు గతుకు" మనుకుంటూ ఒకటే దారి పట్టేడు. రాత్రివేళ ఈ ప్రదేశం ఎవరూ చూడడానికే భయం వేస్తుంది. అని పారిపోగా గురువు కొంతసేపు అశరీరవాక్కుతో భయం లేదు. రాత్రివేళలో తప్పకుండా రా! అని పిలిచి రాకపోతే వాడిఖర్మ. మనుకొన్నాడు. కొంతవరకైనా విద్య ఇతరులకు చెప్పడంవల్ల అతనికి భూతంజన్మ పోయింది. కుర్రా డంతమాత్రం చేతనే గొప్ప పండితు డయ్యాడు.

పిల్లలు వ్రాసిన గేయాలు :

బండరాముడు

చి॥ యల్. యమ్. సెట్టిబాబు

వేడిగాడ్పులు వీయ వేసవి
మాడుటెండలు వచ్చిపడగా
మూల మూలల బాలబడులూ
మూయబడినాయీ...... 1

బండరాముం డనెడి బాలుడు
బడులు మూసిన వెంటనే తన
పాత పొత్తాల్ పీకివేసీ
పారవేశాడూ...... 2

ఉప్పుకారము చేతబట్టీ
ఊరి బయటా తోటవైపూ
చెడ్డ పిల్లల జతలచేరీ
చక్క వెళ్ళాడూ...... 3

గోలచేస్తూ పిల్లలందరూ
గున్నమామిడి కాయలన్నీ
రాలకొట్టగ యీలవేస్తూ
రాళ్లు రువ్వారూ...... 4


పిల్లలందరు పెట్టు కేకలు
పెద్దవై మరి తోట నిండగ
తోటచివరా దెబ్బ సీడను
తాత లేచాడూ...... 5

పరుగు పరుగున ప్రక్కనుండీ
వచ్చుచుండగ పిల్లలందరు
తోటకాపరి తాత యనుచూ
తెల్లబోయారూ...... 6

పరుగు పరుగున పిల్లలందరు
పారిపోవగ పల్లెవైపూ
తాత యొక్కడు, తరిమి తరిమీ
తోట దాటాడూ...... 7

పరుగు పరుగున, పోవుచుండే
బండరాముడు బోర్లపడగా
తోట కాపరి వెంట వచ్చీ
పట్టుకొన్నాడూ...... 8

పట్టు బడినా బండరాముని
గట్టిగా నొక చెట్టుమొదలుకు
కట్టివేసీ, కొట్టికొట్టీ
కదలి వెళ్ళాడూ...... 9



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౨౭

అన్నమయ్యగారి రచన: (సంపు. ౨; ప. ౭౬)

శ్రీరాగం - ఆదితాళం(ఖండగతి)

[పల్లవి]

(౧) స ని సా రి రీ రి రి రీ రి గ రి స ప సా స । సా గ రి స ని రి స ని ప నీ స
ని త్యా త్ముడై యుండి నిత్యుడై వెలుగొందు స త్యా త్ముడై యుండి స త్యు
రి గ రి రి సా స
మై తా నుండు

(౨) రి ని సా రి రి రి రి రి మ ప నిపపమ రి గ రి రి స
ని త్యా త్ముడై యుండి ని త్యుడై వెలుగొంగు
రి మ రి మ పా పా ప ప మ ప నీ ప మ రి రి । రి గ రి స ని ప ని స రీ గ
ప్ర త్య క్ష మై యుండి బ్ర హ్మ మై యుండు సం స్తు త్యు డీ తిరు వేంకటా ద్రి
రి రి సా , , , , , గ రి స
వి భు డు

[చరణం]

రి రి రి రీ రీ రి రి స రి గా రి రి సా స । స గ రి స ని ని రి స ని ప
ఏ మూ ర్తి లోకంబు లె ల్ల నే లెడు నా త డే మూ ర్తి బ్ర హ్మా దు
నీ స రి గ రి రి సా స
లె ల్ల వెద కెడు నా త

నీ రి గ రి స రి మా రి రి మ ప ధ ని ప మ రి గ రి । సా , గ రి స స ని నీ
డే మూ ర్తి ని జ మో క్ష మి య్య జా లెడు నా త డే మూ ర్తి
సా మ రి మ రి మ పా , , , , , ,
లో కై క హి తు డు

రి మ పా ప ప ప పా ప పా పా ప ప ని మా ప । పా నీ ని నీ నీ ని
ఏ మూ ర్తి ని జ మూ ర్తి యే మూ ర్తి యు న గా ను యే మూ ర్తి త్రైమూ ర్తు
ని మ ప నీ సా సా స
లే క మై న యా త

నీ గా రి సా సా రి ని రి స ని ప మ ప ని స రి । స రి ని స పని మ ప
డే మూ ర్తి స ర్వా త్ము డే మూ ర్తి ప ర మా త్ము డా మూ ర్తి తి రు
రి మ ప ప స ని ప మ మా ప ని ప మ రి గ రి స॥ (నిత్యాత్ము)
వేం క టా ద్రి వి భు డు

ఇట్లే క్రింది చరణములు :

(౨) ఏ దేవు దేహమున - నిన్నియును జనియించె - నే దేవు దేహమున - నిన్నియు నణంగె మరి,
యే దేవు విగ్రహం బీ సకల మింతయును - ఏ దేవు నేత్రంబు లిన చంద్రులు;
ఏ దేవు డీ జీవు లిన్నింటిలోనుండు - నే దేవు చైతన్య మిన్నిటికి నాధార,
మే దేవు డవ్యక్తు డే దేవు డద్వంద్వు - డా దేవు డీ వెంకటాద్రివిభుడు॥ (నిత్యా)

(౩) ఏ వేల్పుపాదయుగ మిలయు నాకాశంబు - యే వేల్పుపాదకేశాంతం బనంతంబు,
యే వేల్పునిశ్వాస మీ మహామారుతము - యే వేల్పునిజదాసు లీ పుణ్యులు;
ఏ వేల్పు సర్వేశు డే వేల్పు పరమేశు - డే వేల్పు భువనైకహితమనోభావకుడు,
యే వేల్పు కడు సూక్ష్మ మే వేల్పు కడుఘనము - ఆ వేల్పు తిరువేంకటాద్రివిభుడు॥ (నిత్యా)

లఘుటీక : శ్రీ వెంకటేశ్వరుని ఆత్మ నిత్యము; అట్లే అతని వెలుగొందు శరీరమున్ను నిత్యమే. ఇట్లే అవి రెండూ సత్యములే. ప్రత్యక్షముగా చర్మచక్షువులకు గోచరించినా అతడు బ్రహ్మమే: సర్వవ్యాపి సర్వాంతర్యామిత్యాది గుణసహితుడే.

నిజమోక్షము = సత్యమైన మోక్షము. ఇట్లే నిజమూర్తి; త్రైమూర్తులు = త్రిమూర్తులే; ఈ సకలమింతయును = కళాసహితమైన - నామరూపాదిగుణవిశిష్టమైన యిదంతా; ఇనచంద్రులు = సూర్యచంద్రులు; అవ్యక్తుడు = అతని స్వరూపం పూర్తిగా ఎవరికిని వ్యక్తం కా దనుట; అద్వంద్వుడు = శీతోష్ణ జయపరాజయాది ద్వంద్వాలను మీరినవాడు; భువనైకహితమనోభావకుడు = లోకకల్యాణమే మనస్సులో భావించేవాడు.

ఏవిధంబున త్రోవ లేకా
యేడ్చుచుండగ బండరాముడు
తల్లిదండ్రులు తెలిసివచ్చీ
త్రాడు విప్పారూ...... 10

తల్లిదండ్రులు తిట్లు తిట్టగ,
తోడి బాలురు దొంగ యనుచూ
వెక్కిరించగ, బండరాముకు
సిగ్గు జెందాడూ...... 11

బండరాముని వలెను మీరూ
ముండు టెండలో, చెడ్డవారితో
తిరిగి తిరిగీ దొంగవలెనూ
దెబ్బపడకండోయ్...... 12

కాలానా కబుర్లు

"అగచాట్లా - అవినీతా?

శ్రీ జి. యస్. సూరి

పరీక్షల విషయంలో విద్యార్థుల అవినీతి మితిమీరిపోతున్నదని దేశంలో అలజడి బయలుదేరింది. ఉపాధ్యాయులు రిపోర్టులను రవాణా చేశారు; విద్యాశాఖాధికారులు శిఫార్సులను సరఫరాచేశారు. ఉపసంఘాలు ప్రత్యేకతీర్పులను నివేదించారు. పత్రికాధిపతులు సంపాదకీయాలను వ్రాశారు. వీటి నన్నిటిని ముందుపెట్టుకొని, ఏవిధంగా విద్యార్థుల భరతం పట్టించవలసిందీ నిర్ణయించబోతున్నారు అఖిలభారత విద్యాశాఖామంత్రులు.

బడిపిల్లలగోడవలు ప్రధాని నెహ్రూపండితుడి చెవిలోగూడ దూరినవి. మొన్న లండన్ వెళ్లినప్పుడు జార్జి బెర్నార్డుషాగారితో గూడ ఈవిషయాన్ని చర్చించారుట. ఈ కాలపు విద్యార్థులు డిగ్రీ సంపాదనకు ఏది చేయటానికైనా సంసిద్ధులవుతున్నారని విన్నవించారుట. వర్తక రాజకీయాలు మినహా తతిమా ప్రతిజీవనోపాధికీ డిగ్రీలు అవసరమనే నియమం ఉన్నంతవరకూ ఇటువంటి అపసవ్యపు సంఘటనలు జరగకమానవని ఆ ప్రఖ్యాత చమత్కారి సమాధానం ఇచ్చి ఉంటాడు. ఈమూలసూత్రం తిన్నగా అర్థంచేసుకున్నట్లయితే మన విద్యాశాఖాధికార్లు ఇంత ఖంగారుపడి అంత తతంగానికి పూనుకునేవాళ్లే కాదు. కంటిజబ్బువల్ల తలనొప్పి వచ్చినవాడికి కళ్లజోడ వల్ల నొప్పినివారణ అవుతుందిగాని అమృతాంజనం రుద్దినందువల్ల ప్రయోజనం ఉంటుందా మరీ!

అయినా ఈ అవినీతి చర్యలు ఈనాడు తలఎత్తినవి కావు. పరీక్షలంటూ మన దేశంలో అవతరించినప్పటినుండీ ఇవి ఏదో రూపంలో అమలులో ఉన్నవే. ఈనాటి హేమాహేమీలలో చాలామంది ఇప్పుడు ముక్కున వేలు వేసుకున్నా తమనాడు కొద్దో గొప్పో ఎంగిలిపడ్డవాళ్ళే. అధమపక్షం తమ పిల్లలకోసమో, అల్లుళ్లకోసమో మార్కుల యాచన చేసినవాళ్లే. కాకపోతే ఇప్పుడు కొన్ని కొత్తపద్ధతులు ప్రచారంలోకి వచ్చి ఉండవచ్చు. ఏటేటా మోటారు కార్ల మాడల్సు మారిపోతున్నట్లు పరీక్షలు నెగ్గటానికి ప్రయోగించే సాధనాలుకూడ మారుతున్నందుకు సంతోషించాలి గాని కుర్రకారు మీద దండయాత్రకు బయలుదేరకూడదు.

ఈసందర్భంలో అనాదినుంచి వస్తున్న ఆచారం కాపీకొట్టటం. గుడ్డిలో మెల్ల అనుకున్న విద్యార్థిఅన్నరుపేపర్లనుంచి అంతకు తీసిపోయినవాడు కాపీ చేయటం అందరికీ తెలిసినదే. దీనికి ఎంతో నిపుణత కావలసి ఉంటుంది. కాపలావాళ్లు కనిపెట్టకుండా కాగితాలను అందుకొని, ఏకకాలంలో చదవటం, చదివినవానిని అవకాశం ఉన్నంతవరకు మార్చటం, మార్చినదానిని వ్రాయటం, వ్రాయగానే కాగితాలను అసలువాడికి చేర్చటం అందరికీచేతనైన విద్యకాదు. కేవలం అవివేకి తప్ప మక్కీకి మక్కీ ఎక్కించడు. అందులో ముఖ్యంగా ఒకడు చేసిన పొరబాటునే రెండోవాడుగూడ ముద్ర కొట్టటం ఎంతమాత్రం జరుగకూడదు. ఇటువంటి తప్పులే పేపర్లు దిద్దేవాడికి అనుమానం కలిగేట్లు చేసేంది. ఇదే విధముగా టెక్స్టుబుక్కులలో నుంచి ఎత్తి వ్రాయటం. గొప్పగొప్ప పుస్తకాలలోనుంచి సంగ్రహించి చిన్న చిన్న పుస్తకాలుగా బడిపంతుళ్లు వ్రాస్తారు. ఈ చిన్నచిన్న పుస్తకాలనుంచి ఎత్తి విద్యార్థులు జవాబులు వ్రాస్తారు. ఇందులో తప్పేమిటో మాకుమాత్రం కనబడదు.

ఈ పుస్తకాలను పరీక్ష జరిగే చోటికి భద్రముగా జారవేసి, విరోధుల కంట పడకుండా దుస్తులలో పదిలం చేసి, అవసరం తగిలినప్పుడు ఇంద్రజాలకుడి వలె బయటికి తెప్పించి, పని పూర్తికాగానే మహేంద్రజాలకుడివలె మాయం చేయగలిగినవాడి సామర్థ్యానికి మెచ్చుకోటానికి బదులు శిక్షించబోవటం కేవలం అన్యాయం. పుస్తకాలు పట్టుబడుతాయని తోచినవాడు చిన్న కాకితాల మీద భూతద్దంతోగాని చదవటానికి వీలులేనంత చిన్న అక్షరాలతో కావలసిన సామగ్రిని ఎక్కించి, మనిషిని అంతా వెదకినా దొరకకుండాని క్షేపించి, కావలసినప్పుడు ఉపయోగించి ఒడ్డున బడటానికి ప్రయత్నిస్తాడు. ఇవేగాక శరీరం మీదనే పచ్చ పొడిపించుకున్నట్లు కొన్ని తారకమంత్రాలను సిరాతో వ్రాసుకొనిపోయి, గాలి ఆడనట్లు చమటను అభినయించి, కావలసిన సామగ్రిని కాగితంపైకి రవాణా చేయటం కూడా కద్దు. మా సహపాఠి ఒకడు పరీక్షలు వారం రోజులు అయేసరికి వీపు మినహా దేహమంతా పొడలమాదిరి అక్షరాలు, అంకెలు మాపులు మొదలైన వాటితో నిండిపోయి పీర్ల పండగనాటి పులివేషధారిగా మారిపోయినాడు. అంత కళ ప్రదర్శించగలిగినవాడు ప్రమోషన్కు అర్హుడు కాడని ఎవరనగలరు?

ఈ పద్ధతులు కష్టసాధ్యమని తోచినవాళ్లు ఇతర మార్గాలను అనుసరించవలసి వస్తున్నది. వాటిలో ముఖ్యమైనది మార్కులు వేయించుకొనటం. స్కూలుప్రమోషన్లకు సంబంధించినంతవరకు సులువుగానే పని జరిగిపోతుంది. లోపాయికారీగా ట్యూషన్లు అని పేరు చెప్పి, మింగుడుపడని సబ్జెక్టును బోధించే అయ్యవారికి నెల కింత ముట్టచెప్పడమూ, స్కూలు కమిటీ మెంబర్ల చేత శిఫారసు చేయించడమూ, స్థానిక సంస్థలు నిర్వహించే బడి అయినట్లయితే ఇంక్రిమెంట్లు అధికారినో, బదిలీచేసే అధికారినో పట్టుకొనటమూ, ఇత్యాది ఉపాయాలను ప్రయోగించటం జరుగుతుంది పబ్లిక్ పరీక్షల విషయంలో మరి కాస్త శ్రమ పడవలసి వస్తున్నది. పేపర్లు ఏవూరిలో ఎవరు దిద్దుతారో తెలుసుకొని, వారి పరిచయస్థులను ఆశ్రయించి, కనిపెట్టి వడ్డించేట్లు తంటాలుపడడం జరుగుతుంది. యూనివర్సిటీ పరీక్షలలో కూడ ఇది చాలవరకు వ్యాపించిన సంగతి అందరికీ తెలియనిది కాదు. మొత్తంమీద పరీక్షలకు పూర్వంకంటె అవి జరిగినతరువాతనే ఎక్కువ ప్రయత్నాలు చేయటం చూస్తున్న విషయమే.

ఈలాంటి తిప్పలు పడలేనివాళ్లు ఇంకా సులభమైన మార్గాన్ని కనుక్కోక తప్పిందికాదు. పుస్తకాలన్నీ మొదటినుంచి చివరదాకా చదవటం అనవసరమని గ్రహించిన బుద్ధిమంతులు పరీక్షపేపర్లను ముందుగానే సంపాదించి, ప్రశ్నలకు కావలసినంతవరకే విషయాన్ని కంఠతా పెడతారు. డిటెక్టివులను మించేట్లు చాకచక్యం చూపి, ఏ ముద్రాక్షరశాలలో పేపర్లు అచ్చుఅయేదీ పసిబట్టి, సామదానదండోపాయాలను ప్రయోగించి, చిత్తుకాపీలను తెచ్చుకుంటారు. వీటిని సంపాదించినవాళ్లు కొందరు తమ అక్కర గడుపుకొని, వీటిమీద తమకు అయిన ఖర్చులను రాబట్టుకోటమేగాక బేరం పెట్టి లాభాలను తీయటంగూడ కద్దు. వెకిలి పిల్లలు కొందరు ఆటకాయితనంగా వీటిని కాలేజీగోడలకు అతికించడమో, ప్రిన్సిపాలు కారుకు అంటించడమో చేసి, వ్యవహారమంతా బట్టబయలు చేస్తారు. వీళ్ల అవివేకమే ప్రస్తుతపు హంగామాకు దారి తీసింది. వీరి కొంటెతనంవల్లనే అధికార్లు ఇప్పుడు దండయాత్రకు బయలుదేరవలసివచ్చింది.

ఈమధ్య ఉత్తర హిందూస్థానంలో తమాషా పద్ధతి అవలంబించారు. పరీక్షహాలులో పేపర్లు ఇవ్వగానే ఒకకాపీని ఏ కిటికీనుంచో బయటకి పంపేవాళ్లు. పదినిమిషాలు కాగానే బడికి సమీపంలో ఉన్న ఒక ఇంటినుంచి లౌడ్ స్పీకరు ద్వారా ప్రశ్నలకు జవాబులు చెవిటివాడికి కూడా వినబడేటట్లు ప్రసారం అయేవి. వాటిని వింటూ సమాధానాలు వ్రాసి చిరునవ్వులతో విద్యార్థులు బయటికి వచ్చారు. పోలీసువార్ల సహాయంవల్ల గాని ఈ రేడియోలను మాయటం సాధ్యం కాలేదుట.

మొదటనే చెప్పినట్లు దీని కంతటకి కారణం పరీక్షలకు ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత. ప్రతి ఉద్యోగానికి ఫలాని డిగ్రీ ఉండాలని, ఫస్టు క్లాసులో ఉత్తీర్ణులై ఉండాలనీ, ఇన్ని మార్కులు వచ్చి ఉండాలనీ నిర్ణయించటంవల్ల ఈ అపసవ్యాలకు అవకాశం కల్గింది. పైలుతరగతులే తీసివేస్తున్నప్పుడు ఇన్ని క్లాసులెందుకు ఉంచాలో ఊహించలేము. ఇటువంటి అర్థంలేని వివక్షతలు తీసివేయకతప్పదు. డివిజన్సు, పరీక్షలు జమీందారీలమాదిరి రద్దుఅయిపోతే విద్యార్థులలో అవినీతి అంటూ ఉండదు. ఒక వైపు వాళ్ల అవినీతికి కారణభూతులు అవుతూ, మరొకవైపు వారిని దండించబోవటం అన్యాయమని ఎవరు అనకుండా ఉండగలరు?

బాపూజీ ఆశించిన పంచాయితీ రాజ్యం

(7 వ పేజీ తరువాయి)

కలిసి ఎన్నుకొంటారు. వీరి కాలపరిమితి అయిదు సం॥రాలు. ప్రతిపంచాయితీకి ఎగ్జిక్యూటివు ఆఫీసరు ఉంటాడు. బిచ్చగాళ్ల విషయంలో ఒక చక్కని నియమం చేశారు. సరియైన బిచ్చగాళ్లకు ప్రత్యేకస్థలాలు కేటాయించారు. వాళ్లు ఆ స్థలాలు దాటి రాకూడదన్నారు. అది దాటి వస్తే మూడునెలలు శిక్షగాని 50-0-0 లు జరిమానాగాని విధించవచ్చును.

బొంబాయిరాష్ట్రం కూడా బిల్లు తయారు చేసింది. ఇంతవరకు స్థలాభావంచే విపులంగా కాకుండా ఆయా రాష్ట్రములలో పంచాయితీ విధానాన్ని గూర్చి సూక్ష్మంగా తెలియజేసాను. ఇక మనరాష్ట్రంవిషయము తీసికొందాము.

మన రాష్ట్రంలో

మన రాష్ట్రంలో రెండు రకముల పంచాయితీలు గలవు. (1) మేజరు (2) మైనరు. సాలీనా మూడువేల రూపాయిల పైబడి రాబడి వస్తే అది మేజరు పంచాయితీ అంటారు. మూడువేలలోపు వస్తే మైనరు పంచాయితీగా పరిగణింపబడుతూంది. మేజరు పంచాయితీలకు తమ రాబడి అదనంగా అభివృద్ధిచేసుకోటానికి వీలున్నాయి. కాని మైనరు పంచాయితీలకు మాత్రం లాండుసెస్సుల రాబడియే ముఖ్యమైనదిగా పరిగణింపబడుతూన్నది. రాష్ట్రం మొత్తంమీద 400 మేజరు పంచాయితీలు, 7 వేలు మైనరు పంచాయితీలున్నూ ఉన్నాయి. ఈ ఉన్న పంచాయితీలను సక్రమంగా నడిపి పని చేయిద్దామన్నా వాటికి తగినంత అధికారాలు లేవు. జిల్లాబోర్డులకు లోబడి యున్నందున ఏ కార్యక్రమము చేబట్టలేకపోతూన్నాయి. కాంగ్రెసు అధికారంలోకి రాగానే పంచాయితీల సంస్కరణకు పూనుకొంటూన్నామన్నారు. 1938 సం॥రములో మద్రాసులో జరిగిన రాష్ట్ర పంచాయితీ మహాసభలో అయిదువేల మంది సభ్యులము వివిధ పంచాయితీల నుండి వెళ్లి పాల్గొన్నాము. కాంగ్రెసుమంత్రులందరూ వచ్చారు. ఆతీర్మానాలన్నీ తక్షణమే అమలుజేస్తామన్నారు. మధ్యలో మన మంత్రులు రాజీనామా ఇవ్వడము, అడ్వైజర్ ప్రభుత్వము ఏర్పడటము జరిగింది. అడ్వయిజర్లు 1941 సంవత్సరములో ఒక బిల్లు ప్రకటించారు. అది 1946 లో శాసనముగా తయారుచేయబడింది. కాని దాన్ని అమలుచేసే బాధ్యత నూతనమంత్రివర్గానికి వదిలివేయబడింది. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలయినా ఎంతసేపూ గ్రూప్ రాజకీయాల్లో మునిగి తేలటమే గాని గ్రామాల పురోభివృద్ధికి ఏ పార్టీ మంత్రివర్గం పూనుకొనలేదు. యం. యల్. ఏ. లకు కూడా గ్రామాల దీనస్థితి చెవికి నాటలేదు. దాదాపు 10 సం॥ రాల తరబడి పంచాయితీల అధ్యక్షులు హక్కుగా ఏర్పరుచుకొని చెలాయిస్తున్నారు. ఈ అధ్యక్షులలో చనిపోయిన వారు కొందరు, గ్రామాంతరము పోయినవారన్నూ చాలమంది ఉన్నారు. పదిలెందు ఏ మాత్రము వాత్సల్యమున్నా మునిసిపాలిటీలకు ఎన్నిక జరిపించినవారు పంచాయితీలకు కూడా జరిపేవారు. మన ప్రభుత్వమునకు నూతన రాజ్యాంగము పల్లెలపట్ల అడ్డు తగిలింది. మిగిలిన రాష్ట్రాలు పంచాయితీల ఏర్పాట్లుకు వారలకు మాత్రము ఈలాంటి సాకు దొరకలేదు. మన రాష్ట్రానికే వచ్చింది ఎట్టకేలకు నేటికిఒక బిల్లు ప్రకటించింది.

మన రాష్ట్ర ప్రభుత్వపు బిల్లు- జరుగవలసిన మార్పులు

ఈ బిల్లుమీద ప్రజాభిప్రాయం తీసుకొని దాన్ని శాసనసభలో ఉపపాదించి అది తీర్మానించబడి చట్టంగా రూపొందేనాటికి దాదాపు ఒక సం॥ రానికి తక్కువ లేకుండా పట్టవచ్చును. ఈలోపుగా అన్నీ సక్రమంగా ఉంటే నూతన రాజ్యాంగము అమలులోకి వస్తుందనీ, ఆనాటికి ఎన్నికలు జరుపవచ్చుననీ మంత్రివర్గంవారు భావిస్తుండవచ్చును. లోకల్‌బోర్డు ఎన్నికలు లోగడ ఓటర్ల లిస్టు ప్రకారం జరుపుతామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. కాన నూతన రాజ్యాంగానికి ముడిపెట్టకుండా వెంటనేబిల్లులో దిగువ మార్పులు తీసికొని వచ్చి పంచాయితీల ఎన్నికలుజరపాలి. లేనియెడల గ్రామాలకుద్రోహం చేసినట్లవటమేగాక, బాపూజీఅంత రాత్మకు కూడా సంక్షోభం కలుగజేసినవారవుతారు.

ఇక మన బిల్లువిషయము పరిశీలిద్దాం. ప్రతి 5000 జనాభా గ్రామంలోనూ పంచాయతీ ఏర్పర్చటము బాగానే ఉన్నది. ఎన్నికలుకూడా బాలట్ పేపరుద్వారా, వార్డులుగా విభజించి జరపుతామనే నియమము బాగానే ఉన్నది. గ్రామాధికారి ఓటింగ్ హక్కు లేకుండా ఎక్సఅఫిషియో సభ్యుడుగా ఉంటారన్నారు. 1938 సం॥ములో జరిగిన రాష్ట్రపంచాయతీసభలో గ్రామోద్యోగీయులు సభ్యులుగా ఉండవచ్చునా, కూడదా అనే విషయముమీదనే ఎక్కువ కేంద్రీంచబడి దీర్ఘచర్చ జరిగింది. ఆనాడు రామదాసు పంతులు మొదలగువారు గ్రామోద్యోగీయులను ఏదో విధంగా చేర్పించుటకై ప్రయత్నించారు. కాని మర సోదరపంచాయితీడెలిగేట్లసహాయంతో గ్రామోద్యోగీయులు సభ్యులుగా ఉండరాదనే తీర్మానమే నెగ్గించగలిగాము. ఆ తీర్మానాన్ని పాలించి గ్రామోద్యోగినీ అధికారిగావాని ఎన్నికకు నిలబడే హక్కుగాని ఉండకుండా చేయాలి. ప్రజలకు పరిపాలన హస్తగతం చేస్తామని చెపుతూ ఇలా మళ్లీ ప్రభుత్వోద్యోగీయులకు ఏదోవిధంగా స్థానం కల్పించుట శోచనీయము. పంచాయతీ అధ్యక్షుని ఎన్నికలో ఒక నూతన విధానం ఏర్పాటుచేశారు. ఓటర్లందరూ ఎన్నుకోవాలన్నారు. ఉపాధ్యక్షునికిమాత్రము పంచాయతీ దార్లు ఎన్నుకొనే నియమము ఏర్పర్చబడింది. అధ్యక్షుని ఈలా డైరెక్టు ఎలక్షన్ ఏర్పర్చి ఎన్నుకొనమనుటవల్ల గ్రూప్ రాజకీయాలు నశించవచ్చును. కాని ఇది నూతన విధానమగుటచే కొన్నాళ్లు గడిస్తేగాని దీని బాగోగులను సరిగా చెప్పలేము. అధ్యక్షుని ఎన్నుకొనుట ప్రజల హస్తగతముచేయకపోవుట విచారకరం. ఆయన్ని తొలగించుటకు ప్రభుత్వానికే అధికారం ఇవ్వబడింది. ప్రజలమొర ఈవిషయములోకూడా ఆలకించలేదు. అధ్యక్షుని తొలగించే హక్కుకూడా ప్రజలపరం చేయాలి. అయిదువేల మించి జనాభా గలవూళ్లకే 100-0-0 లకు మించని దస్తావేజులకు, స్టాంపుఫీజు అవసరం లేని దస్తావేజులను రిజష్టరుచేసే అధికారం ఇచ్చారు. ఇలా కాకుండా ఈమాదిరి అధికారం అన్ని పంచాయితీలకు కలుగజేయాలి. గ్రామధర్మసంస్థల నిర్వహణ ఇరిగేషన్ పనులు వీటికే అప్పగించుట బాగానే ఉన్నది. ప్రతిపంచాయతీకి ముఖ్యంగా చిన్న పంచాయితీలకు కూడా ధనంచేకూర్చేమార్గం ఆలోచించలేదు. అనధికార సంఘాలన్నీ గ్రామరాబడిలో 1 లాకు 0-4-0 వరకు గ్రామాలకే చెందించాలని కోరాయి. కనీసము గ్రామ వరుబడిలో (అన్ని విధాలరాబడిలో) 1-0-0 కు 0-4-0 చొ॥న అయినా పంచాయితీకే చెందించాలి. నేడు $12\frac{1}{2}$ % వరకు భూమిపన్నులో ఇస్తామని ప్రకటించారు. ఈమొత్తమును 5 వేల జనాభాలోపుగల పంచాయితీలకి విభజిస్తే ఒకొక్కదానికి ఏ 400,

500 లు కో మించి ఉండేను. ఇది ఏమాత్రము చాలదు. పంచాయితీకోర్టుల కుండే అధికారాలు వరకు మాత్రమే ఈ పంచాయితీలకు సివిల్ క్రిమినల్‌లో అధికారం కలుగ జేయబడు తున్నారు. ఈఅధికారాలే మాత్రం చాలవు. పార్టీలకు, గ్రూపులకు లోబడియున్న నేటి పద్ధతిలో న్యాయము జరగాలంటే ఈదిగువ తెల్పిన నూతన విధానం తోక్కాలి. ఒక్కొక్క ఫిర్కాకు ఒక్కొక్కవిచారణసంఘం ఏర్పర్చాలి. ఈ సంఘములో ఆ ఫిర్కాలోఉన్న పంచాయతీ సభ్యులనుండి అయిదుగురు సభ్యులను ఎన్నుకొని ఒక సంఘముగా ఏర్పర్చాలి. సివిల్, క్రిమినల్ కేసులకు ఈట్రిబ్యునల్ తీర్పుపైన హైకోర్టుకు తప్ప ఇతర కోర్టులకు అధికారం లేకుండా చేయాలి. ఈట్రిబ్యునల్ విచారించే కేసులకు ఒకనిర్ణీత పరిమితి ఏర్పర్చాలి. అనిర్ణీతమైన పరిమితి మించుతేనే టి జిల్లా, మునసబ్, మేజస్ట్రేట్ కోర్టులే విచారించవచ్చును. కాని ఈ ట్రిబ్యునల్ విచారించే కేసులపై హైకోర్టుకు తప్ప మిగిలిన కోర్టులకు అధికారం ఉండకూడదు. ఈమాదిరిగా ఏర్పర్చాలి. అంతేగాని నేటి పంచాయితీ కోర్టులకు యిచ్చే నామమాత్రమైన అధికారంవల్ల ప్రయోజనం లేదు. పంచాయితీదారునకు కనీసము ఈదిగువ అర్హతలు ఏర్పర్చాలి. (1) మాతృభాషలో చదువుట, వ్రాయుట రెండున్నూ కలిగియుండాలి. ఈ రెంటిలో కనీసము సంతకమున్నా చేయగలిగి ఉండాలి. (2) 30 సం॥ ముల లోపు వయస్సు ఉండరాదు. (3) గ్రామోద్యోగిగాని లేక ఏ ప్రభుత్వోద్యోగిగాని పనికిరాదు. (4) అధ్యక్షునికిగాని ఉపాధ్యక్షునికిగాని వయఃపరిమాణము 35 పైని నిర్ణయించుటయూ, వీరి ఉభయులకు మాతృభాషలో చదువుట, వ్రాయుట విధిగా వచ్చిఉండాలనే నియమము ఏర్పర్చాలి. సభ్యులుగాని అధ్యక్షు, ఉపాధ్యక్షులుగాని వరుసగా మూడుమాసాలు గ్రామం వదిలిఉంటే సభ్యత్వం రద్దుఅవుతుందనే నియమము కూడా చేర్చాలి. కోటుగాని ప్లీడరుగాని సభ్యుడుగా ఉండరాదనే నియమం కూడా చేయాలి.

గ్రామాల్లో కాంగ్రెసు ప్రతిష్ఠ నిలవాలంటే వెంటనే పై సంస్కరణములను అమలుచేయాలి. ఇప్పటికే గ్రామాలు ధనికులయొక్కయు, పార్టీ నాయకులయొక్కయు నియంతృత్వమునకు లోనై అవినీతి హెచ్చుపెరిగిపోయింది. పేదవాని గోడు వినేవారు లేకుండాపోయారు. అందువల్ల కమ్యూనిస్టులు తమ మాయోపాయములచే గ్రామాల్లోని పేదజనాన్ని వశపరుచుకొంటూన్నారు. మరల గ్రామాల్లో కాంగ్రెసు మనవలెనంటే ఈ సంస్కరణలు వెంటనే అమలుపరుపుటకంటె వేరే మార్గం లేదు.

కాపిటలిజం:

(8-వ పేజీ తరువాయి)

కేసులలో సాక్ష్యాలలో, ఈ బెదిరింపులన్నీ (బైటపడ్డాయి) పెద్ద పైజు మాసిపోయింది. ఎక్కువ ధరకూడా మాయమయింది.

కొట్లలకు నిత్యం మార్కెట్టు ఉన్న ఒక్క హవాయి జిల్లాలోని టోకు, చిల్లరకొట్ల వ్యాపారమంతా, ఈ త్రిమూర్తుల ప్రభావంలో ఉన్నట్లు తీసేసినట్లు, శాసనసభముందు సాక్ష్యాలలో వెల్లడి అయింది.

గతమూడేళ్ళల్లో, "పెద్దవ్యాపారం" ఈ చిన్నవ్యాపారాలన్నిటినీ మింగి జీర్ణం చేసేసుకొంది. టెక్సాస్‌లో ఉన్న 24 సోప్ ఫ్యాక్టరీలలోనూ పెద్దవ్యాపారుల "త్రయం" తాకకు నిలచినది ఒక్క చిన్న వ్యాపారస్థుడు మాత్రమే. ఆ ముగ్గురూ చిన్న వ్యాపారాలను రూపుమాపేందుకు, అవలంబించిన విధానాలను ప్రభుత్వ కాంగ్రెసు ముందు సాక్ష్యాలతో అతను నివేదించాడు.

భారీవ్యాపారాలలో, ఈ "పెద్దరికం" ప్రభావం మరింతగా ద్యోతకమయింది. ఈక్రింది పరిశ్రమలలో ప్రతిదానిలోనూ, నూటికి 66 నుంచి 91 పాళ్లదాకా వ్యాపారం అంతా, మూడు మూడు కంపెనీలకు హస్తగతమై ఉంది. రసాయనాలు, అద్దాలు, ట్రాక్టర్లు, రబ్బరుటైర్లు, రాగి, తగరంరేకు, ప్యాసెంజరు మోటార్లు, అల్యూమినియంరేకు, ఈపరిశ్రమలన్నీ ముగ్గురు ముగ్గురు అధీనంలో ఉన్నాయి.

ఉక్కుపీపాల వ్యాపారం, మొన్న మొన్నటిదాకా, చక్కని చిన్నఫ్యాక్టరీల చేతుల్లో ఉండి, మంచి సమమైన పోటీతో వ్యాపారం సాగుతుండేది. చిన్నకంపెనీలకు ఉక్కురేకు అందకుండా చేసి, పెద్దకంపెనీలు కలసి వాట్ల గొంతునొక్కి వ్యాపారరంగంలోనుంచి వాటిని బైటికి తోసేశాయి. ఈనాడు ఆరు పెనిక్ ఉక్కుకంపెనీలు, అమెరికన్ ఉక్కుపీపాల వ్యాపారంలో నూటికి 87 పాళ్లు తమ చేతులతో నడుపుతున్నాయి.

మోటారు ఫ్యాక్టరీలవాళ్లు, మోటారుభాగాల వ్యాపారంకూడా చేజిక్కించుకొనేందుకు పన్నిన పన్నుగడలు, అమెరికా కాంగ్రెసు నివేదికలో చూస్తే తెలుస్తుంది.

"వీళ్లు అవలంబించిన మార్గాలు. కారు తయారుచేసే కంపెనీవారు తయారుచెయ్యని కారు స్పేరుపార్టులు ఏవైనా ఏ షాపులోనైనా ఉంటే, అవన్నీ తీయించేసి, నాశనం చేయించారు. మోటార్లు అమ్మే డీలర్లకు ఇవి నాశనం చేస్తే,అదనం డబ్బు ఇస్తామనీ, కారు మాన్యుఫాక్చర్లు చేసినవి తప్ప తక్కిన స్పేరుపార్టు అమ్మితే తమ ఏజన్సీనుంచి తొలగిస్తామన్నారు. పాతవినాశనం చెయ్యటంతో, క్రొత్త స్పేరు భాగాలు, ధరలు పలికి లాభాలు కూర్చిపెట్టాయి. కారులో అనేక భాగాలు, విడిగా చేయటానికి వీలుఉంది. ఇవి చౌకగా కూడా కారుఉన్నవానికి గిట్టుబాటు అవుతాయి. కాని తమ ధరకే కారుయజమానులు తమ దగ్గరనుంచే ఈ భాగాలు కొనుక్కొనేందుకు, మోటారు మాన్యుఫాక్చర్లు ఇతరుల స్పేరుపార్టులను నిర్మూలించేశారు."

1940-47 మధ్య ఏడుసంవత్సరాలలో, విడిగా స్వతంత్రంగా పనిచేస్తున్న 2450 కంపెనీలు, పరిశ్రమాగారాలు, పెద్దవ్యాపారాలకు మరింత పెద్దరికం చేకూర్చుకోటంలో, అంతరించిపోయాయి. ఈ 2450 కంపెనీలు, 520 కోట్ల డాలర్ల మూలధనాలతో పనిచేస్తుండేవి. "పెద్దవ్యాపారులు" ఆధిపత్యంలో ఈ కంపెనీలు ధనంతో సహా అంతరించిపోయాయి. ఈ ప్రవాహంలో, ఇంకెన్ని, వ్యాపారాలు ఇల్లా విలీనమయిపోయి అంతరించాయో లెక్క లేదు.

ప్రపంచమంతటిలోకి, అమెరికా శాసనసభ సెనేటు సభ్యత్వాలు చాలా ఏరి కోరుకున్న మనుష్యులతో సంక్షిప్తంగా ఉన్న సభగా ఉంటుం దనుకుంటారు. కానీ, "కోటీశ్వరుల క్లబ్బు" ఇంతకన్నా ప్రబలమైనది. దానిలో సభ్యత్వం అమెరికన్ కార్పొరేషనులకు మాత్రమే; అవి అయినా, పదికోట్ల డాలర్లు మించిన మూలధనం కల కార్పొరేషన్లకు మాత్రమే.

1929 లో ఈక్లబ్బులో 20 మంది సభ్యులు ఉండేవారు. 1939లో 28 మంది. 1945లో 40 మంది సభ్యులు. ఈనాడు 48 మంది సభ్యులు.

ఈ కార్పొరేషనులలో చాలావాట్లల్లో ఒక్కొక్కదానిలో పనిచేస్తున్న పనివారి సంఖ్య, అమెరికాలోని కొన్ని రాష్ట్రాల జనాభా సంఖ్యనకూడా మించిఉంటుంది. ఒక్కొక్క కంపెనీ మూలధనం, ఒకరాష్ట్రంలోని ప్రజల యావన్మందియొక్క ధన కనకవస్తువాహనాదులన్నీ కలిపితేకూడిన విలువ మొత్తంకంటె కూడా ఎక్కువ ఉంటుంది.

ఇల్లా కార్పొరేషనుల సంఖ్యా, వాటిమూలధనమూ, పెరిగినకొద్దీ, పట్టణాలలోనూ, రాష్ట్రాలలోనూ ఉన్న ప్రభుత్వాలలో ప్రజావాక్కునికి విలువ అనేది లేకుండా పోతోంది. దీనితో ప్రజలు దిరిగి, కేంద్రంలో, వాషింగ్టన్, కేంద్రప్రభుత్వ ఉద్యోగుల వత్తాసుకై చూస్తూ వాళ్లకు అండగా నిలబడచూస్తారు. కాని "పెద్దవ్యాపారుల" పలుకుబడికి ఎదురుతిరగటం ప్రభుత్వానికి కష్టమే అవుతుంది. వ్యాపారంలో కేంద్రఆధిపత్యం పెచ్చు పెరిగినకొద్దీ, ప్రభుత్వంలో కేంద్రాధిపత్యం కూడా, ఆ చేతులకే అనువుగా అందుతుంది.

మరి అమెరికన్లు ఈవిషయం ఎందుకని గమనించటం లేదు? ప్రభుత్వం అతిపెద్దరికానికి పోతే సహించమని అమెరికన్ పౌరు లంటారు. కాని నిజానికి వాళ్లు సహించలేకుండా ఉన్నదేమిటి? "పెద్దవ్యాపారులు" అధికారం చేజిక్కించుకోటానికి ఉపయోగించిన పద్ధతులే, ప్రభుత్వం ఉపయోగించటం మొదలు పెట్టాక కదా పౌరులకు కష్టం తోస్తోంది?

ప్రభుత్వం సర్వాధిపత్యంతో పబ్లిక్‌గా ఈ రెజిమెంటేషన్ పద్ధతి అవలంబించకుండా చూడాలంటే, "పెద్దవ్యాపారులు" ప్రైవేటుగా చేస్తున్న ఈ "రెజిమెంటేషన్" అడ్డుకోవటం అవసరం కాదా?

పెద్ద పెద్ద "యూనియన్" లంటే చాలా మందికి అయిష్టం ఉన్నమాట నిజమే. కాని "పెద్ద వ్యాపారా" లే కదా పెద్ద యూనియన్ల పుట్టుకకు ఆస్కార మచ్చింది. పెద్ద 'యూనియను'లతో తప్ప, సంప్రదింపులు జరిపి మాటవినే స్థితిలో, ఈ పెద్దవ్యాపారాలు లేవే?

నిజమైన వ్యాపార స్వతంత్రమే కాక, సర్వ పౌర సత్వ స్వతంత్రాలూకూడా, ఈ "వ్యాపారాల" ఏకీకరణాల ఆధిపత్యాలలో నలిగిపోయే అపాయ ముంది.

ఆర్థికస్వాతంత్ర్యము సన్నగించటంతో, సర్వస్వాతంత్రాలూ సన్నగిస్తాయి. కాబట్టి ప్రభుత్వాలు పౌరజనుల ఆర్థిక స్వాతంత్ర్య భద్రతకై ఎక్కువ జాగరూకత వహించాల్సి ఉంటుంది.

నవీనవిజ్ఞానమూ, నవీనయంత్రశాస్త్రాలూ, భారీపద్ధతిలో కంపెనీనిర్మాణమూ ఉండవలసిన అవసరాన్ని కొంత కలుగచేశాయి. కాని ఆర్థికంగా ప్రజాస్వామ్యం సిద్ధించాలంటే ప్రజల, ఆర్థిక, సాంఘిక అవసరాలకు అనుకూలంగా వ్యాపారం జరగటమూ, వ్యాపారములో అవసరాలూ, అవకాశాలూ, గుర్తించి, అనుకూలతలు ప్రభుత్వము కల్గించటమూ, సరిగ్గా జాసమకూడాలి. ఉదాహరణకు: ప్రభుత్వశాఖలే, జడ్జీ, జ్యూరీలుగా పనిచేసి, శాసనాలను అధికారరీత్యా అమలుపరచటం కూడదు. అందుకనే, కాంగ్రెస్ కోర్టులకు అప్పీలుచేసే అధికారాలు వదులుతూ, ప్రభుత్వశాఖలకు కూడా నిబంధనలు ఏర్పరిచాయి.

ఈనాడు ప్రజల ఆర్థిక వ్యవస్థలో, ప్రభుత్వం కలుగచేసుకొంటూ, దేశ ఆర్థిక తత్వంలో రెజిమెంటేషను పద్ధతి ప్రవేశపెట్టొందని అలజడిగా ఉంది. దీనికి కారణం, అమెరికనులు, తగు కాలంలో ముందుగా మేల్కొని, తమతమ ప్రైవేటు ఆర్థికవ్యవస్థలను సక్రమంగా నిర్వహించుకోటానికి తగు జాగ్రత్త వహించకపోవటమే. అమెరికాలో, ఇల్లాంటి కలెక్టివిజమ్ పద్ధతి, వ్యక్తిస్వాతంత్ర్యాలను హరిస్తూ, ప్రవేశించిం దంటే, ఎక్కడో క్రెమ్లిన్ నాయకుల కుట్రల ఫలితంగామాత్రం కాదు - మన హ్రస్వదృష్టివలన-దూరపుచూపులేక, పెద్దవ్యాపారాలను ఇల్లా పెచ్చుపెరగనియ్యటంవల్లనే!

(రీడర్సు డైజెస్టునుండి)

కమ్యూనిజం:

(9 వ పేజీ తరువాయి)

అయిన ప్రతివాడూ సోవియట్ ఉద్యమం ప్రపంచమంతటా విస్తరించేందుకు, తన శాయశక్తులా సహాయం చేయటం విధ్యుక్తధర్మమని విశదపరిచాడు. అతని ఉపన్యాసం అయ్యాక, కార్మికులలో గౌరవంఉన్న ఒక వృద్ధకార్మికుడు చాలాకాలంగా కమ్యూనిస్టుగా ఉన్నవాడు, నిల్చున్నాడు. "అయ్యా! సరియైన ఉద్యమానికి కేనిక్కైనా, సహాయం చేయటంలో, హంగేరియన్ కార్మికుడు, తన కొద్దిసంపాదనలోనే భాగం చందాగా ఇచ్చేందుకు, ఏమాత్రం వెనుదీయడు. కాని ఒకమాట. తూర్పుహంగేరిలో టిజ్జానది వరదలవల్ల చాలామంది హంగేరియన్లు నిరాశ్రయులైపోయారు. ఎక్కడోఉన్న గ్రీకులకు చందాఇచ్చేకన్నా మన దగ్గరలో కష్టాలకు గురిఐన మన దేశస్థులకు మా జీతాలలోనుంచి నూటికి రూపాయి ఇయ్యటం ధర్మం కాదా?" అన్నాడు. సభ్యుల కరతాళధ్వనులతో హాలంతా మ్రోగిపోయింది.

ఆ సాయంత్రానికి ఆ వృద్ధుడుమాత్రం మాయ మైపోయాడు.

లేబరు యూనియన్ ముఖ్యస్థానాలలో, సురక్షితులైన పార్టీ మనుష్యులను నియమించటంలో, పార్టీ శాసనాలను కిమ్మనకుండా ఆచరించే విగా యూనియన్లు తయారయాయి.

• "యూనియన్ కార్మికులంతా దేశభక్తిపూరితులై, తమ జీతాలు తగ్గించుకోవాలని, ఏకగ్రీవంగా ఆమోదించారు." "అందరి సమ్మతి మీదా, "ఏకగ్రీవంగా" అనే యీ మాటల నిజాయితీ తెలుసుకోవాలంటే, పార్టీ పోలీసు పద్ధతులతో పరిచయం ఉన్నవారికిగాని సాధ్య పడదు.

తను పనిచేసే ఫ్యాక్టరీగాని, తన యజమానినిగాని, తన యూనియన్‌నుగాని, తనుగా నిర్ణయించుకొని పనికి చేరటానికి కార్మికునికి ఏమాత్రం స్వతంత్రం లేదు.

1948 వేసవిలో మాధియాస్ రోకియా ప్రభుత్వము హంగేరీ పరిశ్రమల నన్నిటినీ జాతీయం చేసింది. ఆ రోజుల్లో ఒక కలపమిల్లు, మంచి వృద్ధిలో చక్కగా పనిచేస్తూంది. ఆ ఫ్యాక్టరీలోని కార్మికసంఘం, పాతయజమానినే, తమ మానేజరుగా ఉంచుకోటం తమకు శ్రేయస్కరమని తీర్మానించారు. కానీ పార్టీ ప్రతినిధి అల్లా వీలులేదనీ, "సత్-కమ్యూనిస్టును" ఒకణ్ణి ఆ ఉద్యోగానికి అప్పుడే నియమించేశామనీ చెప్పాడు. కార్మికుల అధ్యక్షుడు అభ్యంతరం చెప్పాడు. "కానాలిస్ (పూర్వయజమాని) ఎప్పుడూ మా క్షేమసుఖాలకు ప్రాధాన్యమిచ్చాడు. కమ్యూనిస్టు అయినా కాకపోయినా మాకు అతడే ఉండాలి"అని చెప్పాడు.

అక్కడినుంచి పొలిటికల్ పోలీసులు చెయ్యి చేసుకొన్నారు. కానాలిస్‌ను ఫ్యాక్టరీకి తీసుకువచ్చి, కార్మికులను తీర్మానం ఉపసంహరించుకోమని అతనిచేత చెప్పించారు. కార్మికులు విధిలేక కన్నీళ్లతో తమ నిశ్చయం మార్చుకొన్నారు.

పెద్దపెద్ద ఫ్యాక్టరీలనుంచీ, చిన్న చిన్న షాపులదాకా, పెద్దహోటళ్లనుంచీ, చిన్న కాఫీ దుకాణాలదాకా, ప్రతిదానినీ పార్టీవారు, ఈ విధంగా, సుస్థిరవిధానంలో వశపరుచుకొన్నారు. ప్రతిచోటా ఆధిపత్యం, పార్టీకి "విశ్వసనీయులైన" నాయకులది.

తీవ్రకమ్యూనిస్టువాదిగా ఉండినటువంటి ఒక కార్మికుడు నిట్టూరుస్తూ నాతో ఇల్లా అన్నాడు: "ఎంత తెలివితక్కువవాళ్ల మయిపోయాం! పోగొట్టుకొంటున్న దేమిటో, తెచ్చి పెట్టుకొంటున్నదేమిటో గ్రహించలేని మూర్ఖులమయాం. సంప్రదింపులతో బేరసారాలతో సమాధానం కుదుర్చుకొనే వీలున్న పిడియజమానులను వదులుకొన్నాం. పోలీసు లాఠీలతోటి మెషీన్‌గన్నులతోటి, కదిలితే మెదిలితే మా నోళ్లను మూసే యజమానులను తెచ్చుకొన్నాం."

నాయీ బ్రాహ్మణులు - లోకాచారము

శ్రీ పి. నాగభూషణం

బ్రాహ్మణ కర్మలని చెప్పబడు షట్కర్మలలో నొకటి దానము తీసికొనుట. దానికంటె నికృష్టమైనది బిక్షమెత్తుట. ఇప్పుడివి బ్రాహ్మణ శాఖ లన్నింటిలోను గలవు. భారతవర్షమున వేదమును బాగుగా పఠించి అర్థము చెప్పగల పండితులు వేయింటి కొక్కరైనను లేరనవచ్చును. చదివినవారే లేనపుడు చదివించెడివారెచ్చట నుండి వత్తురు? సంధ్యావందనము యెట్లు చేయవలయునో, గాయత్రి యన నేమియో, ఎట్లు జపించవలయునో, వేయేల చివరకు సంకల్పమైన తిన్నగా పఠించుట తెలియనివారు సహితము దానములు వదలించుటలో, పుచ్చుకొనుటలో ముక్తహస్తు లగుచున్నారు. సర్వాధికారములు గలిగి సర్వమును పొందగలిగినటువంటి బ్రాహ్మణుల గతియే యిట్లుండ, యేనాడో పదదలితులయి దాస్యమను సంకెళ్లతో గట్టిగా బంధింపబడినటువంటి ఈ నాయీబ్రాహ్మణజాతిలో వేదాధ్యయనాదుల గాంచగోరుట ప్రాణరహితుని శరీరములో నాడిని పరీక్షించిన ట్లుండును. కాని ఈ నాయీబ్రాహ్మణజాతిలో బ్రాహ్మణ కర్మలయొక్క విశాలభవనభగ్నావశేషము, ఇప్పటికిని విద్యమానమైయున్నది. కాబట్టి నాయీబ్రాహ్మణు లనుట కవి చాలును. అదెద్దియన:

ఆర్యులు, హిందువులయొక్క షోడశ సంస్కారములలో అథవా యజ్ఞయాగాదిక్రతువులలో నాయీబ్రాహ్మణుడు ప్రవేశించని కర్మగాని, క్రతువుగాని లేదు. గుజరాతు, రాజపుత్రస్థానము మొదలగు ప్రదేశములలో జాతకర్మ సంస్కార సమయమున ప్రసవకార్యము నాయీబ్రాహ్మణుడే చేయించుచున్నాడు. ఈ యాచారము లేని ప్రదేశములందు నాయీబ్రాహ్మణుని యొక్క కత్తినైనను, ప్రసవించిన స్త్రీతల క్రింద నుంచుదురు. అచ్చటచ్చట ఈ నాయీబ్రాహ్మణునియొక్క కత్తితోనే బొడ్డును కోయుదురు. మరియు మాసంబాతిక గడిచిన పిమ్మట రూపాయిపావలా దక్షిణతో తిరిగి యా కత్తి నిచ్చివేయుదురు. పంజాబులో ప్రసూతిని 11 వ రోజున నిష్క్రమణ సంస్కార సిద్ధాంతానుసారము నాయీబ్రాహ్మణుడే శుద్ధిచేసి సూర్యదర్శనము చేయించును. చూడాకర్మ (పుట్టువెంట్రుకలు), తీయు సంస్కారమునకు కర్త నాయీబ్రాహ్మణుడు. నాయీబ్రాహ్మణుని దయచేతనే హిందూచిహ్నమగు శిఖ హిందువుల తలమీద నేటివరకు ప్రకాశించుచున్నది. ప్రకాశించును. నాయీబ్రాహ్మణుడు ముండన సంస్కారము ముందుగా చేయుటచేతనే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యాదులు ఉపనయన సంస్కారమున కర్హు లగుచున్నారు. గురుకులమునుండి విద్యాధ్యయనము ముగించి స్వగృహమునకు మరలు సమావర్తనసంస్కారము—అనగా వేదాధ్యయనానంతరము వివాహనిమిత్తము గురునాజ్ఞ పొందుట, నాయీబ్రాహ్మణుడు క్షౌరము చేయనిచో జరుగనేరదు. స్నాతకు డనబడు నాయీబ్రాహ్మణుడు క్షౌరము చేయనియెడల వరుడు వివాహమాడుట కయోగ్యుడుగా నుండును. గృహస్థరూపరాజ్యమునకు రాజైన వరునకు వివాహసమయమునందుగాని, అంతకుముందుగాని ఈ నాయీబ్రాహ్మణుడే మకుటమును ధరింపజేయును దీనిని రాజపురోహితకార్య మందురు. నాయీబ్రాహ్మణునిచే మొదట ముండన సంస్కారము జరుగకపోయినయెడల సన్యాసి సన్యాసి పదార్హుడు కాజాలడు. మధ్యపరగణాలలో నాయీబ్రాహ్మణునిచే ముండనసంస్కారము చేయబడినచో శవము కూడ కాల్చబడుట (ముక్తిని పొందుట) లేదు. నాయీబ్రాహ్మణుడు భద్రాకరణము చేయుటచేతనే తలకొఱివి పెట్టినవారు పవిత్రులగుచున్నారు. నాయీబ్రాహ్మణుడు బ్రాహ్మకవిధవలకు క్షీరము చేయనిచో వారు పవిత్రులు గాజాలరు. ముండన సంస్కారము జరుగనివారిచేతి భోజనపానీయముల నెవరును ముట్టరు. నాయీబ్రాహ్మణుడు ముండన సంస్కారము చేయనియెడల గోహత్యా బ్రహ్మహత్యాది పాతకులు, పతితులు, వేలకొలది గంగాస్నానములు చేసినను, వందలకొలది చాంద్రాయణవ్రతములు చేసినను, కోట్లకొలది బ్రాహ్మణ సంతర్పణములు జేసినను, పవిత్రులు కాజాలరు. కాబట్టి నాయీబ్రాహ్మణులు పరమపవిత్రులనియు, యజ్ఞయాగాదులు చేయించు యాజ్ఞికులనియు, సిద్ధాంత మగుచున్నది.

"యజ్ఞస్య మాత్రాం విమిమీతే
ఏకో అధ్వర్యుః"—నిరుక్తము.

అధ్వర్యుడనగా యజ్ఞసామగ్రిని సమకూర్చి జాగ్రత్తగా నుంచువాడు. ఈకార్య మిప్పటికిని నాయీబ్రాహ్మణులే చేయుచున్నారు. సమిధాది హోమసామగ్రినంతయు ఏకత్రితము చేయుట, వేదిని నిర్మించుటమొదలగు యజ్ఞ సంబంధకార్యములన్నియు యజ్ఞశాలలో నాయీబ్రాహ్మణుడే చేయుచు యజ్ఞము ప్రారంభించిననాటనుండి పూర్తియగువరకు యజ్ఞశాలలో హోమవేదికవద్దనే యుండును. పురోహితుడుగాని, ఋత్విజుడుగాని, యెచ్చటనైన పొరబడినచో నట్టి పొరపాట్లను వారికి తెలియజేయుచు, చక్కబెట్టుచుండును. ఏలయన అధ్వర్యుడు (నాయీబ్రాహ్మణుడు) "అధ్వరస్య నేతా" యజ్ఞమునకు నాయకుడు. అనగా యజ్ఞమును సక్రమముగా చేయించువాడు అని నిరుక్తమున యాస్కాచార్యులవారు నుడివియున్నారు. మఱియు—

"బ్రహ్మైకో జాతే జాతే విద్యాం వదతి"
—నిరుక్త ఉపోద్ఘాతము. 1-7.

అనగా యజ్ఞమునం దెచ్చటనైన పొరపాటు జరిగినచో దానిని తెలిసికొని హోత మొదలగువారికి తెలియజేసి సవరించుట బ్రహ్మయొక్క పని. ఈ బ్రహ్మ చేయు కార్యములు నాయీబ్రాహ్మణుడు చేయును.

సంయుక్త, పంజాబు, బెంగాలు మొదలగు ప్రాంతములందు అచ్చటచ్చట స్వకులపురోహితుడు దొరకనపుడు వివాహాదికార్యములు నాయీబ్రాహ్మణులే చేయించెదరు. స్వానుభవము.

నాయీబ్రాహ్మణులచే వండబడిన పక్వాన్నాది సకలపదార్థములను సర్వవర్ణములవారు గ్రహించుచున్నారు. మరియు వేశ్యాదుల యిండ్లలో వంటచేయువారుగా నున్నటులే బ్రాహ్మణక్షత్రియాదుల గృహములలో వివాహాది శుభకార్యములందు సకలపదార్థములు నాయీబ్రాహ్మణులే చేయుదురు. సోవళము వండినను ముట్టనటువంటి కన్యాకుబ్జబ్రాహ్మణు లీనాయీబ్రాహ్మణులచే వండిన పదార్థములు నిశ్శంకగా భుజింతురు. నాయీ పాండ్యులు—వీరిని బ్రాహ్మణ నిర్ణయశేఖరులు కూడ బ్రాహ్మణులలో నొక శాఖగా నిర్ణయించిరి. వీరు పూర్వకాలమునుండియు నాయీబ్రాహ్మణులతో వివాహాది సంబంధ బాంధవ్యములు కలిగియున్నారు. ఈ నాయీ పండాలచే రచింపబడిన పంచాగము లిప్పటికిని మిక్కిలి గౌరవింపబడుచున్నవి. వీరిలో నాయీ పండాలలో కొందరు క్షౌరకర్మ చేయుచున్నారు. వీరు బ్రాహ్మణవర్ణస్థులే ననియు స్పష్టముగా సిద్ధాంత మగుచున్నది. కొన్నిచోట్ల జందెములు వేసకొను నాచారము లేకపోయినను "ఏకదేశవికృత మనన్యవత్" అను న్యాయానుసారము నాయీబ్రాహ్మణులయొక్క బ్రాహ్మణత్వమున కేవిధమైన కొరత గలుగనేరదు. నాయీ బ్రాహ్మణులయొక్క యజ్ఞోపవీతము లెప్పు డంతరించినది స్థలాభావముచే నిచట నొకటి రెండు విషయములుమాత్రమే సూచించుచున్నాడను. వానితో సారాసారగుణ గ్రహణపారీణు లందరు గ్రహించగలరు. "నాయీ బ్రాహ్మణు లనఃపతితులగుట జన్మజాతిబంధనములతో ప్రారంభమై బౌద్ధులకాలమున జందెముల దిగనాడి, యవనులకాలమున దుర్గతిపాలయిరి."

జాలిగుండె

(11 వ పేజీ తరువాయి)

లంటే అయిదు వేలైనా కట్నం మీయాలి. పైన ఎంతలేదన్నా కట్నానికి తగ్గ హోదాగా పెళ్లి చేయాలి.

ఆయిద్దరు పిల్లలు ఏడాది తేడా వాళ్లే కనుక వాళ్లిద్దరి పెళ్లి ఒకటి రెండేళ్లలో జరిపాడు. వారి పెళ్లికి పదిహేనువేలు అప్పు చేశాడు నలుగురు అయిదుగురిదగ్గర. షేరు కంపెనీ వుండడమువలన అప్పు తేలికగానే పుట్టింది అప్పుచేసి కూతుళ్ల పెళ్లిళ్లు వైభవోపేతంగా జరిపాడు. అల్లుళ్లకి కట్నము.. అలకపాన్పువరములు.. ఆషాఢపట్టేల వైభవము.. అత్తగారిళ్లకు సారెలు.. అత్తగార్ల లాంఛనాలు, ఆడబడుచులాంఛనాలు అన్నీ సక్రమంగా జరిపాడు. అప్పుచేసి పప్పుకూడన్నట్లు అప్పుచేసి వూళ్ళోవాళ్లందరికి పదివూటలు తృప్తిగా నాలుగు పిండివంటలతో భోజనము పెట్టాడు. వూళ్ళోవాళ్లందరూ మెచ్చుకున్నారు—తను చేసిన వైభవానికి తను తెచ్చిన సంబంధానికి. వియ్యాలవారు పొంగిపోయారు తన సంబంధానికి.

అప్పు చేసిన సంతోషము తనకు రాను రాను తగ్గింది. రాను రాను అప్పు తీర్చడ మేలాగు అనేది పెద్ద సమస్య అయింది తనకు. ముందర అప్పుచేసిన కొత్తలో అనుకునేవాడు, అప్పు తీర్చలేకపోతానా అని. రెండేళ్ల లాభాలు లేవనుకుంటే, పోనీ మూడేళ్లు లాభాలు లేవనుకుంటే ఎక్కడ అప్పు అక్కడ తీరుతుంది అని. కానీ అనుకోవడము తప్ప మరింకేమీ చేయలేక పోయాడు తను. లాభాలు వున్నాయి చిట్టా పుస్తకాలలో. కానీ జాలిగుండె రాగి కానీ అయినా నిలవ చేయడానికి వీలు లేకుండా చేసింది. ముందతను నిర్లక్ష్యము చేశాడు. ఆ నిర్లక్ష్యపు పొరలు తన కళ్లను కప్పివేశాయి. పదిహేను వేలకి వడ్డీ పెరుగుతున్నా తను లెక్క చేయలేదు. అప్పులవాళ్లు కొంచెము ఒత్తిడి లేవదీసేటప్పటికి అప్పు తీర్చాలి అనే దుగ్ధ ఆరంభించింది. జాగ్రత్తగా ఖర్చుపెట్టి అప్పు తీర్చాలి అనుకొనేవాడు తను.

కాని రూపాయి నిలవచేయబోతే తిండికి లేనివాళ్లు, బట్టలకు లేనివాళ్లు, చదువుకి లేనివాళ్లూ కన్నీచేవాళ్లు ప్రాధేయపడ్తూ. వాళ్లకి ఆ రూపాయి వద్దు వద్దు అనుకుంటూనే జారిపోయేది. అనాథశరణాలయములకి, స్మారక నిధులకి సత్రాలకి, విరాళాల రూపకము తన జేబులోంచి రూపాయలు జారిపోయేవి. ఒక్క రూపాయి నిలవ చేయలేనివాడు అన్నివేల రూపాయలు ఎల్లాగు నిలవచేయగలడు తను?

జాలిగుండె తనికి అడ్డు పడ్తోంది. డబ్బు నిలవచేసి అప్పు తీర్చడానికి ఎప్పటి కప్పుడు ఎన్నిసార్లో హృదయపూర్వకముగా ప్రయత్నించాడు. కానీ ఆ బలహీనతను ప్రతిఘటించి తను ఓడిపోయాడు. తను అశక్తు డయ్యాడు. త్రాగుడు దాని స్నేహితులు నుంచి పూర్తిగా బయటపడడము ఎంత కష్టమో యిదీ అల్లాగే అన్పించింది తనకు.

తెరపు యిచ్చినట్టే యిచ్చి బాగా ఆకాశము మూసుకుపోయింది. కనబడ్డాడో, లేడో సూర్యుడు అప్పుడే మాయమయ్యాడు. ఆ మబ్బుతోపాటు చల్లని నీటిగాలి రయ్యిమంటూ వీస్తోంది. ఆరిపోయిన చుట్టని మళ్లా వెలిగించాడు. మళ్లా ఆలోచన పోయింది తన జీవితముగురించి.

అప్పులవాళ్లు రాను రాను ఒత్తిడి చేయసాగారు. పాపము వాళ్లుమటుకు ఎన్నాళ్లు అడుగుతారు. చిట్టచివరకు నెలరోజులలో మా అప్పు తీరుస్తారా? లేకపోతే మా అవస్థ మమ్మల్ని పడనిచ్చి మా పైకము రాబట్టుకోమంటారా అన్నవరకు అప్పులవాళ్లు వెళ్లారు. ఏం చేస్తాడు తనుమటుకు-అప్పు తీర్చాలి ఏమయినాను.

ఆపదలన్నీ కలసి కట్టుగా వస్తాయి. తన షేరు కంపెనీ లాభాలు తగ్గసాగాయి. అప్పు తీర్చాలంటే షేరు కంపెనీని అమ్మేసుకోవాలి. అమ్మేసుకుంటే తన సంసార మెల్లా గడుస్తుంది? పెద్దకుర్రాడు డాక్టరు చదువుతున్నాడు. డాక్టరు డిగ్రీ రావాలంటే యింకా మూడేళ్లు ఆగాలి. రెండవకొడుకు యింటరు సెకండియరులోకి వచ్చాడు. ఆఖరికూతురు ఫోర్తుఫారములోకి వచ్చింది. పిల్లలచదువుకి నెలకు నూటఏభయి ఖర్చు అవుతుంది. కుటుంబఖర్చుకి యింకొక నూటఏభయిరూపాయలవుతుంది. తనే షేరు కంపెనీ అమ్ముకుంటే నెలకు మూడు వందలు వచ్చే ఉద్యోగము ఏభయిఏళ్లవారికెవ రిస్తారు?

కోర్టు కెక్కకుండా అప్పు తీర్చాలి అంటే కంపెనీని అమ్మేయాల్సిందే. మానహాని కాకుండా వుండాలంటే తను షేరుకంపెనీని అమ్మేయాలి. ఎల్లాగూ అమ్మక తప్పదు. మర్యాదగా ముందే అమ్మేసుకుంటేనే మంచిది అని అనుకున్నాడు తను.

షేరుకంపెనీని అమ్మేసుకున్నాడు అప్పు తీర్చడానికి. అంతేకాదు, పెళ్లాము నగలిని అమ్మేశాడు. అప్పు తీరింది. తన చేతి కేం మిగలలేదు.

౪

వాన ఎక్కువయింది. కుంభపోతగా కురుస్తోంది. కుటుంబపోషణమునకు పిల్లలు తమ చదువు మానకోవాల్సి వచ్చింది. తన జాలిగుండె మూలముగా తన పిల్లలు తమ కలలిని ఆశయాల్ని చంపుకోవల్సి వచ్చింది. అవును. దీనికంతకూ తనే బాధ్యుడు.

తనబిడ్డలు చదువు మానుకుని ఉద్యోగాలు చేయడము పూలు అమ్ముకున్న వూళ్లో కట్టెలమ్ముకున్నట్లు వుంది. తను ముందర కట్టెలమ్మినవాడే. కానీ ఆ అలవాటు తనకు తప్పిపోయింది యిప్పుడు మళ్లా కట్టెలమ్ముకోవడమంటే తన కెబ్బెట్టుగా వుంది.

కట్టుకున్న పెళ్లాం వచ్చి అంటుంది "వూళ్లో గాడిద లందరికీ చదువు అబ్బింది. చివరకు తమ అబ్బాయిల దగ్గరకు వచ్చేటప్పటికి కాళ్లు పారజాపే రంటూ కొడుకు. లంటారు "డాక్టరు ప్యాసయివస్తే నేను నెలకు వెయ్యిరూపాయలు కళ్లజూసేవాణ్ని.. యిప్పుడు నీమూలాన ఎనభై రూపాయల గుమాస్తాగిరీ ఏడ్వవలసి వచ్చిం"దని. ఒకరు నేను యింజనీరునయి నెలకి వేలు సంపాదించేవాణ్ని. నీమూలానా ఏభయిరూపాయలే గతి అయ్యాయి అని యింకొకరు.. మా వుసురు కొట్టకపోతుందా అని అందరూ అనేవాళ్లు.

తనచేతి యిదివరకు వేలను వెర్రిగా డబ్బు ఖర్చుపెట్టవద్దని సలహా చెప్పడానికి వచ్చి అవమానపడ్డవారు అవకాశము చిక్కింది కనుక ఆ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని అతన్ని దెప్పేవాళ్లు. "అయిందా నీపని! మేము ఎన్నిసార్లు చెప్పలేదు? నువ్వు వింటావుటయ్యా? ...వూళ్లో అందరి యోగక్షేమాలు నీ కెందుకయ్యా...పాపము వాళ్లు నీమూలాన చదువు మానుకోవలసివచ్చింది...అనుభవించు చేసుకున్నంతా అనుభవించు" అంటూ. లోకము దృష్టిలో యిప్పుడు తను కాజెమ్మ...అసమర్థుడు..... తన వియ్యాలవారు యిపుడు తమ ఫలానివారి వియ్యంకు లని చెప్పుకోవడాని సిగ్గుపడ్తున్నారు. వీలైనప్పుడెల్లా చెప్పుతున్నారు. రాళ్లు రువ్వడానికి అవకాశము చిక్కితే ప్రతివాడు రాళ్లు రువ్వేవాడే యీలోకములో.

తనని దెప్పుతూ...నిందిస్తూ తన మిత్రులు పరిచితులు ఆప్తులు సంతోషము పొందుతున్నారు. తను ఏకాకి. తనకు సానుభూతి చూపించేవాళ్లు లేరు. తను చేసిన నేరము గొప్పదే. ఆ నేర మయినా తను కష్టా లనుభవించడము వాటి స్వరూపము కళ్లార చూడడమువలన కలిగిన ఫలితము. తనకే కనుక ముందరే తిండానికి తిండి కట్టడానికి బట్ట, వుండడానికి యిల్లు వున్నట్లయితే తను యింతగా సానుభూతి సహకారాలు చూపించగలిగేవాడే కాదు. కానీ తన కర్మ మిల్లా కాలింది.

యింతలో పెళ్లాము లోపలినుంచి "పిలిచినా వినిపించుకోరేల? ఏం రాచకార్యము? యింకా వూళ్లో వెధవల విషయమేనా? తిండికి దయచేయవచ్చు" అని అంది.

కేశవులు లేచి నిట్టూర్పు విడచి చుట్ట పారేసి లోకమును నేను అర్థముచేసుకోలేదు, నన్ను లోకము అర్థము చేసుకోలేదు అన్నాడు దీనముగా.

——

దండనాథులు :

బొప్పూడి నరసప్పయ్య

శ్రీ కోన వెంకటరాయశర్మ

చంద్రగిరి నివాసుడైన లింగమనాయకుడు దన కొమార్తె మంగమ్మను మధురనాయకరాజైన చొక్కనాథున కొసంగి క్రీ. శ. 1665వ సంవత్సరమున మహావైభవముగ వివాహ మొనర్చెను. శ్రీకృష్ణదేవరాయల నాటినుండియు మధురను దెలుగు నాయకరాజులే యేలుచుండిరి.

క్రీ. శ. 1659వ సంవత్సరమున చొక్కనాథ నాయకుడు మధురసింహాసనాసీనుడయి యిరువదిమూడేడులు సర్వతోభద్రముగ నేలి క్రీ. శ. 1682 వ సంవత్సరమున జనిపోయినాడు.

ఆకాలమున ననుపానమున నుండిన సహగమనమును మనోదార్ఢ్యముగల మంగమ్మ యెదుర్కొని ప్రతిఘటించి నిలచినది. చొక్కనాథు ననంతర మాతని కొమారుడు రంగకృష్ణముత్తు వీరప్ప నాయకుడు రాజ్యమునకు వచ్చి యేడేండ్లు పరిపాలన మొనర్చి క్రీ. శ. 1689వ సంవత్సరమున మసూచివ్యాధివలన జనిపోయెను. అప్పటికి గర్భవతిగా నున్న యాతనిభార్య ముత్తమ్మ సహగమనము సేయదలచినను శిష్టుల హితోపదేశము వలనను, దన యత్తగారగు మంగమ్మ ధర్మబోధకతమునను ఆ యుద్యమమునుండి విరమించుకొనినది. ఆవల కతిపయదినంబులకు మగబిడ్డను గనియెను. ఆబిడ్డయే విజయరంగచొక్కనాథుడు. మూడు నెలల శిశువుగ నున్నయపుడు ఆకుర్రని సింహాసన మెక్కించి మంగమ్మయే రాజ్యభారవహయై యనేకసారులు రాజ్యసంరక్షణమునకయి యుద్ధముల జేయవలసివచ్చినను వెనుదివియక ప్రధిమ జూపుచుండెగా, మొగలు చక్రవర్తి యౌరంజీబుపాదుషా ఢిల్లీ రాజ్యభద్రపీఠమున నధివసించి ద్రవిడదేశమును గబళింప నుత్సుకతతో నుండెను. ఈ విషయ మెఱింగి యపారబలసంపత్తిగల పాదుషాతో చిన్నిరాజ్యమున కధికారిణియగు తాను ఎదుర్కొని పోరుట ధర్మము రాజనీతి కాదని నిశ్చయించినది

ఔరంగజీబు సేనానియైన 'జులిఫెకారుఖాన్' క్రీ. శ. 1693వ సంవత్సరమున 'జింజి' కోటను ముట్టడించుచు గొంత సేనలు దక్షిణాపథమున కంపెను. అతడు తంజావూరు (*Tanjore*) ప్రభువు 'శహజీ' 'జులిఫెకరుఖాన్'కు లోసి లొంగి ఢిల్లీ సామ్రాట్టున కంకితుడై కప్పము సెల్లింప నొప్పుకొనియెను. ఆవల క్రీస్తుశకము 1697 వ సంవత్సరమున 'మధుర' నాయకరాజ్యమునకు రాగా, దూరదృష్టికల 'మంగమ్మ' ఢిల్లీసేనానితో సఖ్యత నంది కప్పము సెల్లించుట కియ్యకొనినది. అంతతో దన్విందెందక 'జులిఫెకరుఖాన్'కు అమూల్యరత్నాభరణముల బహూకరించి యతని సాహాయ్యమున దంజపురికి డంతకు ముందు దనరాజ్యమునుండి పైకొన్న కొన్ని ప్రదేశములను మరల దనరాజ్యమున గలిపికొనియెను. క్రీ. శ. 1702వ సంవత్సరమున 'ఉదయార్ పాళెము' ప్రభువుతో దటస్థించిన యుద్ధములో మంగమ్మ అప్పటి మొగలుసైన్యాధిపతియైన 'దావూద్ ఖాన్'ను సబహుమానముగా సాహాయ్యము నర్థించగా, నతడు సర్వవిఘ్నముల దోప్పడియెను. అంతతో నూరకొనక మంగమ్మ దావుద్ఖానున కిరువదివేల రూకలును, గివానునకు బదివేలరూకలును, ఔరంగజీబు పాదుషాకు అమూల్యరత్నాభరణములు,మణులు నంపి మొగలు సామ్రాజ్య బాంధవ్యమును సేకరించి మధుర నాయకరాజ్యాభివృద్ధికి దద్బాంధవ్యము నెట్లుపయోగించినదో సువ్యక్తమగుచుండెగా, మహీశూరప్రభూత్తంసుడగు చిక్కదేవరాయలు పరరాజ్యముల గైకొనుటయందు దృష్టి కేంద్రీకరించి యుండెను. అతడు క్రీ. శ. 1690 దవ సంవత్సరమునాటికే కావేరి (*Cavery*) నది వఱకుంగల బారమహాలు, సేలము భాగములను గెలుపొంది బెదనూరు (*Bidnur*)లో నధికభాగము లోగొనెను. క్రీ. శ. 1694 వ సంవత్సరమున జరిగిన సంధిలో జిక్కదేవరాయలు అప్పటిదాక జయించిన భూభాగమునంతను మహీశూరరాష్ట్రమున గలుపుటకు నిశ్చయించెను. ఆపిదప జిక్కదేవరాయలు తన సేనల 'మధుర' రాజ్యము పైకి నరలించెను. కాని యౌరంగజీబు పాదుషా 'మధురరాజ్యము'న కేవిధమైన సాహాయ్యము సేయ వలనుపడమి గ్రహించి మిదుకరించుచునుండెను. ఇది కనిపట్టి చిక్కదేవరాయలు కోయంబుత్తూరు (*Coimbatore*), సేలము (*Salem*) ల పయి దండెత్తి వెవలి యచటి స్థానిక ప్రభువుల గెలుపొంది వారిని దన సామంతులనుగ జేసికొనియెను.

క్రీ. శ. 1695_96 సంవత్సరప్రాంతమున జిక్కరాయలు తన దళవాయియైన కుమారయ్యను మధురరాజ్యమందలి 'తిరుచినాపల్లి'ని ముట్టడించుటకు బంపెను. కాని యీలోగా ప్రక్కనుంచి మహారాష్ట్రులు మహీశూరరాష్ట్రముపయిం బడుటవలన మంగమ్మకు మైసూరుసేనల (*Mysore Forces*) వెనుకకు దఱుముట సులువైనది. అదివఱకు మధుర రాజ్యమునకు లోబడిన దిరువనంతపు (*Travancore*) అధిపతి చొక్కనాథుని కాలములో సరిగా గప్పము సెల్లింపక యుపేక్షించినను, ముత్తువీరప్పనాయని కాలములో దిరువనంతపుర ప్రభ్విణి స్వయముగ వచ్చి ముత్తువీరప్పనాయనికి నెలలేని కానుకల నిచ్చి దాసోహమ్మని యనినది. మధురరాజ్యమున కిట్టి చిక్కులు దటస్థించినవని యోజించుచుండెగా,నతడు మొదట గప్పము సరిగా జెల్లించకుండిన తర్వాత నుమ్మాయమ్మరాణి (తిరువాన్కూరురాణి) క్రీ. శ. 1695_96 ప్రాంతములలో దిరువనంతపురముమీదికి సైన్యముల నంపె కప్పము వసూలుచేయవలసివచ్చినది.

క్రీ. శ. 1684 వ సంవత్సరమున 'రవివర్మ' తిరువాన్కూరున కేలిక యయ్యెను. క్రీ. శ. 1689 దవ సంవత్సరమునుండి మంగమ్మ మధుర రాజ్యమునకు సంబంధించిన వ్యవహారములను జక్కబెట్ట నారంభించిన తోడ్తోడనే రవివర్మ సుంకము సెల్లించుటకు మానికొనుట వలన మంగమ్మ యాతనిపై గత్తి నూయవలసివచ్చెను. ఏటేట 'రవివర్మ' నుండి సుంకముల గైకొనుటకు సేనల నంపుచుండెడిది. ఈపర రాజపేడయు, నిజమంత్రుల పెడయు రవివర్మకు మనోవ్యథ కలిగించుచుండెను. కాని చేయునది లేక మోజనాపరంపరకుం జిక్కి సాధనాంతరముల నన్వేషించుచుండెను. మధురసైనికులు క్రీ. శ. 1696 వ సంవత్సరమున దిరువాన్కూరు రాజ్యమున బ్రవేశించి రాజధానీనగరమగు 'కోర్కులము' (*Coorg*) వఱకు ముందుకు నడవగా, రవివర్మ మధురసైనికులతో సంధి కొడంబడి తన మంత్రుల నిర్మూలనమునకు దోడ్పడినయెడల దనరాజ్యమున గొంతభాగమును, 'కోగ్కలము' నిచ్చుటకును అంగీకరించి దుర్గము మధురసైనికుల వశ మొనర్చెను. రవివర్మ మధురసైనికుల తోడ్పాటుతో దన మంత్రులలో గొందఱను జంపెను. శేషించిన వారు పిక్కబలము జూపిరి. మఱికొందఱు అపారధనరాసుల గుమ్మరించి ప్రాణముల దక్కించికొనిరి. కాగా, రవివర్మ తెంపరియై మధురసైనికు లాక్రమించికొనిన దుర్గమును ఆకస్మికముగ ముట్టడింపగా, దత్సైనికులు దరి, యలజడి నొంది, బ్రదికియుండిన సభముల్ల బడయు వచ్చునను సూక్తిని మదిలో నిడికొని పలాయన మంత్రము పఠించిరి. వారిని దఱిమి పట్టికొని 'రవివర్మ' చిత్రవధ గావించెను.

మంగమ్మకీ వార్త వినుకలియై 'రవివర్మ'కు దగురీతి బుద్ధిజెప్పనగాని విడువనని శరించి క్రీ. శ. 1697 వ సంవత్సరమున మంగమ్మ తన దళవాయి బొప్పూడి నరసయ్యకు విశేషసైన్యము నిచ్చి 'తిరువాన్కూరు' (*Travancore*) పైకి బంపగా వీరాతివీరుడు, రణనీతికుశలుడు, రాజ్యతంత్ర నిపుణుడు నగు నరసప్పయ్య 'రవివర్మ' తో యుద్ధముసేసి, యాతని నోడించి, యతడు సెల్లింపవలసిన సుంక మంతను గైకొని మందుగుండు సామగ్రి, వస్తువాహనములు మొదలగు వానిం బుచ్చుకొని, జయపతాక నెగురవైచినాడు. తిరువాన్కూరునందు నరసప్పయ్య పట్టికొనిన ఫిరంగులు మధుర, తిరుచినాపల్లి కోట బురుజులమీద నగపడుచు మంగమ్మ విజయమునకు నరసప్పయ్య ప్రతాపమునకు జిహ్నితములై విలసిల్లు చున్నవనుటయం దావంతయు సందియము లేదు.

రవివర్మతో పోరు ముగిసినదో లేదో, ఇంతలోనే మంగమ్మ తంజావూరుతో బోరునకు దిగవలసివచ్చినది. తంజావూరు నేలుచున్న 'శహజీ' మహారాజు మధురరాజ్యము నాక్రమించుట కయి దండయాత్ర చేయుచుండినందువలన మంగమ్మ క్రీ. శ. 1700 సంవత్సరమున నాతనిపై యుద్ధమును ప్రకటించి తన ప్రచండచమూపతియగు నరసప్పయ్యను తంజావూరు మహారాజుపైకి బంపెను. అతడు అపారసైన్యముల నడిపించి కాలిరూను (కొల్లడము) నది యుత్తరభాగమున దండు విడిసెను. కాని తంజావూరు ఆశ్వికదళము చాకచక్యమును, ధాటిని, ప్రతిఘటింపజాలక కొంచెకతడవు యోజించి తంజావూరు సేనల వెనుదగిలి యుద్ధకథనము నడపుట యె కర్తవ్యమని తలచి 'కాలిరూను' నదిని దాటి తంజావూరు రాజ్యముపయి బడి కొల్లగొట్ట బ్రారంభించెను. కాలచక్ర పరిభ్రమణమున దంజావూరు రాజ్యమును నరసప్పయ్య 'వినాశ' మొనర్చి, 'శవాజీ' మహారాజు ధైర్యము వికావికలొనర్చెను. ఇయ్యపజయమునకు గారణము తన మంత్రి 'నాగోజీ'యని 'శహజీ' మహారాజునకు దోచినది. ఇంతలో నాగోజిమంత్రి 'సహజీ'ని సందర్శించి "ప్రభూ! పరాక్రమించిన వైరివీరునితో గౌరవప్రదముగ సంధి జేకూఱుతును. ఒకవారము దినములు గడువొసగిన జాలును. సంధి కుదర్పజాలనిచో నా మస్తకము నఱికివైవవచ్చును" - అని విన్నవింపగా, శహజీ మహారాజు సమ్మతించి, యతడర్థించిన సదుపాయములను, కోరిన యవకాశములను గల్పించెను. కాగా, నాగోజీ వీలు చిక్కినవెల్ల ద్రవ్యమును బ్రోవొనరించి మధురరాజ్యమంత్రులకును, నరసప్పయ్య దళవాయి తండ్రికిని, బహుమతులు, కానుకలు నొసంగి తంజావూరు మధుర రాజ్యములకు సంధి నొడగూర్చెను.

ఈ ప్రయత్న ఫలితముగ దంజావూరు రాజ్యమున 'నాగోజి' పలుకుబడి యతిశయించెను. ఇకార్యనిర్వహణమున నీ రెండు రాజ్యముల వారు నిమగ్నులయియుండగా, మహీశూరరాజు కావేరినీటినంతను దన రాజ్యములోని భూములకు మరలించుకొనుట కయి గొప్ప యనకట్ట (*Anicut*) నొక నొకదానిం గట్టి యీ మూలమున నొక చుక్కయేని గ్రిందికి రాకుండ జేసెను. అక్కతన మధుర, తంజావూరు రాజ్యములకు నీటియెద్దడి యేర్పడి కఱవు దటస్థించెను. క్రొత్తగా నేకీభవించిన యీ రెండు రాజ్యముల వారును మైసూరుపై దండెత్త దలచిరి కాని యింతలో వరుణదేవు డనుగ్రహించుటవలన జిక్కదేవరాయలు నిర్మించిన యనకట్ట శిథిలమై కావేరి యెప్పటి యట్ల బ్రవహించి యీ రెండు రాజ్యములకు జలసమృద్ధి నొడగూర్చెను.

మధుర సామంత మాండలికులలో నొకడైన 'మారవ' రాష్ట్రాధిపతి (*Rajah of Ramnad*) మంగమ్మ మహీశూర రాష్ట్రాధిపతులతో బోరుఘటిల్లి పోరాడుచుండుటను జూచి సుంకమును జెల్లింప మానికొని యంతతో నూరకొనక క్రీ. శ. 1698 దవ సంవత్సరమున సాహసించి మధురపై దండెత్తెను. కాని దళవాయి నరసప్పయ్య ఆతని యాటల జాగి రానిక మధురరాజ్య సరిహద్దుల దాటించెను. ఇది జరిగినతర్వాత క్రీస్తుశకము 1700 సంవత్సరమున దంజావూరు 'శహజీ' మహారాజుతో బోరు సల్పుచుండినప్పుడు 'మారవరాష్ట్ర'పతి మంగమ్మకు బ్రత్యర్థియై 'శహజీ' మహారాజునకు దోడ్పడియెను. ఆ యుద్ధమైనతర్వాత క్రీస్తుశకము 1702 లో దన చమూపతి నరసప్పయ్యను ఆతనిపైకి బంపెనుగాని 'దైవమన్యత్ర చింతయేత్' - అనునట్లు లన్యథీకరించినది. ఆ మహాసమరమున నాయకుడై తరలి వైరివీరులకుండియ లవియజేసి వీరస్వర్గ మలంకరించినాడు. కాగా, 'మారవరాష్ట్రము' (*Ramnad*) ఆనాటినుండి స్వతంత్రించిన దన్నమాట!

బొప్పూడి నరసప్పయ్య మధుర నాయకరాజ్యమునకు బ్రధానమంత్రిగను, సైన్యాధిపతిగను బనిచేసినవారిలో నగ్రసరుడు. ప్రతిభాశాలి శూరాగ్రేసరుడు. రాజ్యతంత్ర నిపుణుడు. మంగమ్మకు నరసప్పయ్యమీద విశేషనమ్మకము. అందువలన బరిపాలన మంతను నాతనిపై బెట్టి యయ్యమాత్యచూడామణి యంగీకారము లేనిది యే పనియు జరపకుండెను. ఇంత పలుకుబడి, యధికారము, బలదర్పములు, రాజ్యమున గల్గి యుండినను అహంకృతి యీషణ్మాత్రమేని లేక వినమ్రుడై నిష్పాక్షికముగ వ్యవహారముల జూచుచుండెడివాడు.

నరసప్పయ్యకు శ్వేతముఖులనిన జాల యసహ్యభావ ముండెడిది. క్రైస్తవులనిన సరిపడదు. ఒక యుద్ధమున నితడు పాల్గొని యుండగా దన సైన్యమున సిరంగుల బేల్చువారు క్రైస్తవులని తెలిసికొని వారని దొలగించెనట! ఇవ్విధమైన భావపరంపరలు మెండుకొని యున్నను వారి యభ్యుదయపరంపరాభివృద్ధి పట్ల విశాలహృదయము లేకపోలేదు. ఎట్టి యక్రమదౌర్జన్యములు వారియెడ జూపియుండలేదు. పైగా ఆతని సలహా సాహాయ్యములతో మంగమ్మ రాజ్యమున మతసహనము వ్యాపింపజేసినది.

నరసప్పయ్య దళవాయి 'బొప్పూడి' వంశాలంకారుడు. ఆర్వేల నియోగి బ్రాహ్మణుడు. భారద్వాజగోత్రుడు. సంగీతసాహిత్య నిష్ణాతుడు. ప్రచండదండనాథుడు. రాజకీయ పరిజ్ఞాత. నరసరావుపేటకు దాపున నున్న 'బొప్పూడి' వాస్తవ్యుడు.

వింతలు: విశేషాలు


గులాబితప్ప, సువాసన పుష్పములలో నెక్కువ సంఖ్య తెల్లగానే ఉంటవి.

ఆకాశపు రంగుపూవులు వాసనలేనివిగా ఉంటవట. రంగెక్కువైతే వాసన పూర్తిగ తగ్గునట.

రంగును బట్టి పక్షుల తిండ్లు

కాయరంగు పక్షుల నాకర్షించుటకే. ఎర్ర రంగు పండ్లను ఎక్కువగ పిట్టలు తింటవి. పసుపురంగు కాయలను, ఇంకా తక్కువ సంఖ్య పిట్టలు తింటవి. నారింజరంగుగల కాయలను ఇంకా తక్కువసంఖ్యగల పిట్టలు తింటవి. అన్నిటికన్న తక్కువసంఖ్య పిట్టలు, గులాబి రంగు కాయలను తింటవి. 'వలపర్ల'

లేఖలు



వర్తకగుమస్తాలచట్టం-ప్రభుత్వకర్తవ్యం

ఆర్యా,

దాదాపు పదిసంవత్సరాల నిరంతరాందోళనా ఫలితంగా వర్తకగుమస్తాల శ్రేయస్సుకొరకు మద్రాసుప్రభుత్వంవారు ఒక చట్టాన్ని నిర్మించారు. దీనిఫలితంగా వర్తకగుమస్తాలకు వారమున కొకరోజు శలవు, దినమున కెనిమిదిగంటల పని, క్యాజుయల్ సిక్ లీవులు మొదలైన కనీస సౌకర్యాలు యేర్పడ్డాయి. రోజుకు పద్దానుగుగంటల పనితో నెల కొక రోజు నామమాత్ర విశ్రాంతితో బాధపడుతున్న గుమస్తాలకు యీ చట్టఅవతరణ అమితానందాన్ని చేకూర్చింది. తమ మానసిక, శారీరక అభివృద్ధికి ఎంతో అవకాశం కలుగుతుందని భావించారు.

కాని చట్టం అమలులోనికి వచ్చినతరువాత ఆశించిన ఫలితాలు, రాగల దనుకున్న మార్పు కలగా పరిణమించాయి. దాదాపు సంవత్సరం కావస్తున్నా యింతవరకు అక్టు సక్రమంగా అమలుజరుగుటలేదు. నోటీసుబోర్డుమీదమాత్రం గుమస్తాకు ఎనిమిదిగంటల పని వ్రాసివుంటుంది. కాని క్రియలో పద్దానుగంటల పనే: రిజిస్టరులో ఆదివారం శలవుగా కనపడుతుంది. కాని 'అత్యవసరపని' పేరుతో ఆనాడుకూడ విశ్రాంతి సున్న. యిక క్యాజుయల్ సిక్ లీవులసంగతి చెప్పనక్కరలేదు. యిదీ నేటి వర్తకగుమస్తాల స్థితి! పేరుకు మాత్రం ప్రతిపట్టణంలో ఆఫీసర్లు, సిబ్బంది నియమించబడ్డారు. కాని ఫలితం శూన్యం. వర్తకగుమస్తా లెంత ఆందోళనచేసినా స్థానికఉద్యోగులు చట్టాన్ని సక్రమంగా అమలుజరుపలేక పోతున్నారు. ఫలితంగా వర్తకగుమస్తాల శ్రేయస్సు కొరకు సృష్టింపబడ్డ యీఅక్టు నిరుపయోగంగా పరిణమించింది.

కాబట్టి యీ విషయమై ప్రభుత్వం తగు చర్య తీసుకోవా లనీ, అక్టును సక్రమంగా అమలుజరిపించి వర్తకగుమస్తాల విశ్వాసాన్ని చూరగొనాలనీ కోరుతున్నాను.

తెనాలి. కె. బి. గంగాధరరావు.

ఆంధ్రాసిమ్మెంటుఫ్యాక్టరీ

భారతదేశంలోని కార్మికులలో అనేకతరగతులవా రున్నారు. యీ తరగతు లన్నిటికిని రాజకీయపార్టీలే ముఖ్యకారణములు. రాజకీయపార్టీలలోని నాయకులలో కొందరు తమపార్టీలను బలముచేసుకొనుటకై కార్మికసంఘాల పెద్దలుగాతయారై కార్మికుల కోర్కెలన్నిటిని తాము తీర్చెదమని హామీయిస్తూ యుంటారు. యీ సంఘపెద్దలు కార్మికుల కోర్కెలకొరకు కార్మికులను సమావేశపరచి తీర్మానాలు చేయించి ఆ తీర్మానాలను. ఆ కార్మికులు పనిచేయు పరిశ్రమల యజమానులకు పంపుతూయుంటారు. ఆ యజమానులు కార్మికుల సంఘములనుండి వచ్చిన తీర్మానములలో వారికి యిష్టము వచ్చినచో ఆ సమస్యలను తీర్చుటగాని లేక పెడచెవిన పెట్టుటగాని సంభవించుచున్నది. తమకోర్కెలు యజమానులు తీర్చనందున అనేకరిమైండర్లు పంపుట. అప్పటికి లాభము లేనియెడల చట్టప్రకారం నోటీసుయిచ్చిగాని యివ్వకుండాగాని సమ్మెలుచేయుచున్నారు. ఈ సమ్మెలవల్ల అనేకకార్మికులు నిరుద్యోగులగుట, ప్రాణములగోల్పోవుట జరుగుచున్నది. యేదైనా ఒకపరిశ్రమలోని కార్మికులు సమ్మె చేయునపుడు ఆ సమ్మె న్యాయమా, అన్యాయమా అని విచారించకుండా ఆ కార్మికులతో సంబంధముగల యితరపరిశ్రమలలోని కార్మికులుకూడా సానుభూతి సమ్మెలు చేయుట, ఆ సానుభూతిసమ్మెవల్ల కొంతమంది నిరుద్యోగులగుట సంభవించుచున్నది. భారతదేశములోని కార్మికులు అనేక కేంద్రసంఘాలలో యున్నారు. అన్ని కేంద్రసంఘముల నాయకులు కార్మికుల కష్టములు తీర్చుటకే పనిచేయుచున్నామని యంటారు.

మనదేశములో 1920 సంవత్సరము అక్టోబరు 30 వ తేదీన లాలాలజపతిరాయి అధ్యక్షతను ఆల్ యిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ యేర్పడింది.

1947వ సంవత్సరములో భారతజాతీయట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ యేర్పడింది. ఈరెండును గాక హింద్ మజ్ దూర్ సభ యను మరియొక కేంద్రసభ యేర్పడింది. ఈవిధముగా మనదేశములో కార్మికుల కోర్కెలను తీర్చే కల్పవృక్షములు అంటూ అనేకసంస్థలు యేర్పడినవి. యే సంస్థకు చెందిన నాయకులు ఆ సంస్థలలోని కార్మికులకు తమతమ రాజకీయసిద్ధాంతములను బోధించుచు ప్రభుత్వమును విమర్శించుచూ యుంటారు. యీవిధముగా కార్మికసంఘాలు రాజకీయనాయకుల చేతులలో కీలుబొమ్మలుగా యుండుటవల్ల ఆ నాయకులు కార్మికులను తమ యిష్టము వచ్చినట్లు నడిపించుచున్నారు. మంచి చెడ్డలుకూడా విచారించక తమ నాయకులు చెప్పిన మార్గములోనే యీకార్మికులు నడుస్తూయున్నారు. దేశసేవ, జాతీయ అభిమానము, అన నేమిటో కార్మికులకు తెలియుటలేదు. గాన వివిధ కార్మికసంఘాలలోని కార్మికులు దేశముయొక్క మానవులయొక్క ఆర్థిక జాతీయసంపద తమమీద ఆధారపడియున్నదని గ్రహించి తమ కోర్కెలను సామరస్యమయిన సంప్రదింపులద్వారా యజమానులతో పరిష్కారము చేసుకొనినచో పరిశ్రమలలో శాంతి యేర్పడును.

కార్మికనాయకులందరు తమవారి అవసరముల కొరకు కార్మికులను సాధనములుగా ఉపయోగించుకొనక కార్మికుల కష్టముల తీర్చుకొనుటకు కార్మికరంగములో పనిచేయునంతవరకు పార్టీసిద్ధాంతములను బోధచేయక ప్రభుత్వము మీద కార్మికులకు దురభిప్రాయము లేకుండా చేయవలెను.

యజమానులుకూడా తాము ధనము పెట్టుబడి పెట్టి పరిశ్రమలలో భాగస్వాములైనట్లే, కార్మికులుకూడా తమ రక్తమును ధారవోసి పరిశ్రమలలో భాగస్వాములైనా రని గ్రహించి యజమానులు కార్మికులన్యాయమైన కోర్కెలను వెంటనే అమలుపరచినచో దేశపురోభివృద్ధికి, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడినవా రగుదురు.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వములు పరిశ్రమలలో శాశ్వతశాంతి నెలకొనగలందులకు కార్మికుల న్యాయమైన కోర్కెలు చట్టములుగా యేర్పాటుచేసి ఫ్యాక్టరీ యినస్పెక్టర్లచే ఆ చట్టములు వెంటనే అమలులోకి వచ్చేటట్లుగా చూడవలెను.

ఈవిధముగా, ప్రభుత్వము, యజమానులు, కార్మికనాయకులు, కార్మికులు, అందరు కలసి పరస్పర సహకారభావముతో పనిచేసినవాడే పారిశ్రామిక, ఆర్థిక, జాతీయ, పురోభివృద్ధి, పరిశ్రమలలోను, కార్మికులలోను శాంతీ యేర్పడును.

ఇట్లు,
అన్నంరాజు జగన్నాధరావు

గ్రామపంచాయితీబిల్లు

ఆర్యా!

గ్రామస్వరాజ్యవ్యవస్థ స్థాపించాలనే సంకల్పముతో చెన్నరాష్ట్రప్రభుత్వము ఒక శాసనం రచించింది. దీన్ని గురించి ప్రజాభిప్రాయం తెలుసుకోవాలనే తలంపుతో ముందుగా ప్రకటించింది. యీ పంచాయితీలు గతి ఆహారసంఘముల వలె గాక జయప్రద మగునని ఆశించుచున్నాము.

గ్రామజీవనము గ్రామఆర్థిక విషయాలకు సంబంధించినంతవరకు స్వతంత్ర అధికారములు యిచ్చి సాధ్యమైనంతవరకు అన్యులఅజమాయిషీని తగ్గించవలెననియు, గ్రామపంచాయితీలను స్వయంసంపూర్ణమైన స్వపరిపాలిత సంస్థలుగా తయారుచేయుట యీబిల్లుయొక్క వుద్దేశ్యమని మద్రాసుప్రభుత్వము ప్రకటించింది. ప్రస్తుతం గ్రామన్యాయస్థానముల చట్టముక్రింద వున్న అధికారములతో యీ గ్రామపరిపాలనవిధానం ఆయా గ్రామాధికార్ల పరంగా సాగుచున్నది. గాన యీసందర్భమున వీరినిగురించి యోచించుట ముఖ్యావశ్యకము.

గ్రామాధికార్లు త్యాగులు, ప్రజాశ్రేయోభిలాషులు, రాజకీయచతురులు అనుటకు వీరి ఉద్యోగనిర్వహణమే నిదర్శనము అనేకమంది నేటి గ్రామోద్యోగులు విద్యార్థిదశలో నుండగా కాంగ్రెసు ఆదేశములను పాటించియు, విద్యార్థికులయ్యు త్యాగశీలముచే గ్రామోద్యోగముల జేసియు ,తమపదవులకు రాజీనామా లిచ్చి సంతంత్రోర్యమములకు నడిచినవారును, ఎన్నికలలో నేటి ప్రజాప్రతినిధులను ప్రభుత్వసభ్యులకు సర్వవిధాల సహకరించినవారును అనేకు లున్నారు.

భారత జాతీయ వాదులుగను, ప్రజాశ్రేయోభిలాషులుగను ప్రజాప్రభుత్వము లేర్పడువరకు నిర్విరామకృషి చేసినవారు ప్రజలకు ప్రభుత్వవిధానముల క్షుణ్ణముగ బోధచేయువారును యీ గ్రామోద్యోగులెగాన యీ సందర్భమున వీరిని సంప్రతింపవలెను. వీరికి గుర్తింపబడి అనుమతి బడసిన (*Registered & recognised*) రాష్ట్ర సంఘములుగూడ గలవు గావున సదరుసంఘములతో సంప్రతింపులు జరిపి సక్రమ నూతనవ్యవస్థా నిర్మాణము చేయుదురుగాక.

గామమునసబు అధికారరీత్యా పంచాయితీలో సభ్యుడుగా నుండును కాని,పంచాయితీమీటింగులలో ఓటునిచ్చు అధికారము వుండదు. యిందు మూలమున గ్రామాధికార్ల విభేదములు ఏర్పడిన ప్రజలలో చీలికలు కలిగి అసలు విధానమునకే భంగము కలుగును గాన గ్రామాధికార్లిగువురును *'Ex officio members'* గా నుండి ఓటు చేయు అధికారము కలిగియుండవలెను. అధ్యక్షు, ఉపాధ్యక్షు *President, Vice President* స్థానములకు నిలుచుటకు అవకాశములు కలిగియుండవలెను. గ్రామోద్యోగుల కుటుంబములు ఆయా గ్రామాదులలో ఉన్నతమును త్యాగశీలము గలవియు గాన, వీరిని చిన్నచూపు చూచుట ప్రభుత్వమునకు శ్రేయోదాయకము గాదు. యీ సంఘములనుంచి వచ్చిన తీర్మానములను గ్రహించియు, సంఘములతో సంప్రతింపులు జరిపియు పంచాయితీ విధానమును జయప్రద మొనగూర్ప ప్రభుత్వమును వేడుచున్నాము.

ఇట్లు
గొర్లె రామినాయుడు.

భారతరాజ్యాంగపరిషత్తు:

(5-వ పేజీ తరువాయి)

కొనుటే ఉత్తమ మని నా అభిప్రాయం. కామన్వెల్తు సమస్యను, నేను యీ దృష్టితోనే ఆలోచించితిని. బ్రిటిష్ప్రధాని, యితర అధినివేశ రాజ్యముల ప్రధానులు యీ దృష్టితోనే ఆలోచించిరి.

"ఈ సమస్యలపట్లా ఇతర ప్రపంచ సమస్యలపట్లా ఇండియా అవలంబిస్తున్న వైఖరి సంకుచితమైనది కాక తన భవిష్యత్తుమీదనూ, తన బలంమీదనూ సంపూర్ణవిశ్వాసంతో కూడుకున్నదన్న అభిప్రాయాన్ని కలిగించుటకే నేనా పనిని చేయలేదు. తన భవిష్యత్తుకు అడ్డుపడ ప్రయత్నించే దేశ మేదయినా భారత దేశము దానికి భయపడదు.

"పరిష్కారం అసాధ్యముగా కనిపిస్తున్న ఈ సమస్య ఇప్పుడు ప్రపంచదృష్టిని ఆకర్షించినది.

"అచ్చగా న్యాయవాదులనే పరిష్కరించనిమ వదిలినట్లయితే ఇది ఎన్నటికీ పరిష్కరించబడదు. మన జీవితంలో న్యాయవాదుల ఉపయోగం వేరే ఉన్నది. అంతేకాని వారిని ప్రతి విషయంలోనికీ తీసుకుని రాకూడదు (నవ్వు). కుడి, ఎడమ అనేది గమనించకుండా కేవలం తమ సంకుచిత దృక్పథంతోనే వ్యవహరిస్తూ ప్రపంచం ముందుకు నడుస్తున్నదన్న విషయాన్ని మరచిపోయిన సంకుచిత జాతీయవాదులు ఈసమస్యను ఎన్నటికీ పరిష్కరింపకలిగెడివారు కాదు. కేవలం గడచిన కాలపు పరిస్థితులనే మననం చేసుకుని ఆ ఊహాప్రపంచంలో నివసిస్తూ, ప్రస్తుత కాలం గడచిన కాలం కన్నా ఎంతో భిన్నమైనదనీ, భవిష్యత్కాలం ప్రస్తుత కాలంకన్నా మరింత భిన్నంగా ఉండబోతున్నదనీ గ్రహించలేకుండా ఉన్న భూతకాలాభిమానులు ఈసమస్యను పరిష్కరించ కలిగి ఉండేవారు కాదు. భారతదేశం మీదనూ ఈ దేశపు అదృష్ట జాతకము మీదనూ విశ్వాసము లేని వ్యక్తులెవ్వరూ కూడా ఈ సమస్యను పరిష్కరించకలిగేవారు కాదు.

గౌరవప్రదమైన సహకారానికి ఇండియా ఆదరణ

"భారతదేశానికి ఆత్మవిశ్వాసంఎంతమాత్రమూ కొరవడ లేదన్న ప్రపంచమంతా గుర్తించాలని నేను కోరుతున్నాను. తాను వెనుక ఎవరితో పోరాడినదో వారితోకూడా సహకరించటానికి ఆ సహకారం గౌరవప్రదంగా ఉన్నప్పుడు, ఆ సహకారం స్వేచ్ఛమీదనే ఆధారపడి, మాకే కాక ప్రపంచానికంతటికీ ఉపయోగపడేటప్పుడు ఆ సహకారాన్ని అందుకుని వారితో సహకరించటానికి భారతదేశం సిద్ధంగా ఉన్నదని ప్రపంచం గుర్తించాలి. వెనుక వారితో పోరాడవలసి వచ్చిన దని కానీ, ఆ వెనుకటి కర్మల ఫలితాలను ఇంకా అనుభవించవలసి వచ్చిన దని చెప్పి కానీ మేమా సహకారాన్ని నిరాకరించము. వెనుకటికాలపు స్మృతులనూ, వాటి దుష్టఫలితాలనూ పరిత్యజించవలసి ఉన్నది.


గత సంఘటనలను మరచిపోలేను

"నేను లండన్ సమావేశంలో కూర్చున్నప్పుడు ఇప్పటికి 19 సం॥ల కిందట ఒక రోజున అర్ధరాత్రి సమయంలో రావీనదిఒడ్డున నేను తీసుకున్న ప్రతిజ్ఞ జ్ఞాపకం వచ్చినది. సంవత్సరం వెంబడి సంవత్సరంగా ప్రతిజనవరి నెలలోనూ 26 వ తేదీన ఎన్ని ఆటంకాలు వచ్చినప్పటికీ పునశ్చరణ చేస్తూవచ్చిన ఆ ప్రతిజ్ఞ నా మనస్సులో మెదిలినది. ఆ తరువాత ఈ సభామందిరంలోనే నిలబడి ఆ తీర్మానపు ఆశయాలను వివరించిన రోజు కూడా నా స్మృతికి వచ్చినది. అది జరిగి ఇప్పటికి 2 సం॥ల 5 నెలలు దాటినది. ఇప్పుడు మన మేవిధమైన స్వతంత్ర ప్రభుత్వాన్ని, ఏవిధమైన రిపబ్లిక్ను నిర్మించబోతున్నామో మనం ఆ ప్రతిజ్ఞలో వివరించి ఉన్నాము. తరువాత జయపూర్ సమావేశంలో ఈ విషయమే మన అందరి మనస్సులనూ ఆక్రమించుకుని ఉన్నది. మనం తీసుకున్న ప్రతిఒక్క ప్రతిజ్ఞకూ భారతదేశ స్వాతంత్ర్యానికీ, గౌరవ ప్రతిష్ఠలకూ అనుగుణంగా ఉండి, వెంటవెంటనే మారిపోతున్న ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో భారతదేశాభివృద్ధికీ, ప్రపంచశాంతికీ దోహదకారిగా ఉండే మార్గాన్ని ఒక దానిని కనిపెట్టవలెనని మనమంతా అప్పుడు ప్రయత్నిస్తున్నాను.

ప్రతిజ్ఞలకు భిన్నంగా ఏదీ జరగలేదు

"కామన్వెల్తుతో కాని, మరే ఇతరవర్గంతో కాని మనం పెట్టుకునే సంబంధాలవల్ల ఎన్ని లాభా లయినా ఉండవచ్చును. కాని అవి ఎంత గొప్పలాభాలయినా మన ప్రతిజ్ఞలకు భిన్నంగా నడిచి వాటిని సంపాదించకూడదన్న విషయం నాకు మొదటినుంచీ స్పష్టంగా ద్యోతకమయింది. ప్రపంచంలో ఏ దేశమయినా తాను ప్రకటించిన సూత్రాలకు భిన్నంగా నడిచి ఇష్టం వచ్చినట్లు సంచరిస్తే అది ఎన్నటికీ అభివృద్ధి చెందలేదు. మన స్వాతంత్ర్య ప్రతిజ్ఞలోని ప్రతి అక్షరమునూ సఫలం చేయకలిగానని నేను మీ అందరియెదుట చెప్పటానికి సాహసిస్తున్నాను.

"మరొక విషయం విస్పష్టం చేస్తున్నాను. అంగీకరిస్తే ఈ ఒడంబడికను మొత్తంగా అంగీకరించాలి. లేదా త్రోసివేయాలి. అంతేగాని దీనికి ఎట్టి సవరణ ప్రతిపాదించటానికీ అవకాశం లేదు" అన్నాడు.



దక్షిణాఫ్రికాలో భారతీయుల దుర్గతినిగురించిన సమస్య ఐక్యరాజ్యసమితిలో తిరిగి చర్చకు వచ్చింది. కాని భారతదేశానికి అన్యాయమే జరిగింది. రాజకీయ సంఘంలో చర్చ జరిగినప్పుడు దక్షిణాఫ్రికా ప్రతినిధి ఎరిక్‌లో ఇది చర్చించరాని ఆంతరంగిక సమస్య అని వాదించాడు. ఇటీవలనే ఐక్యరాజ్యసమితి ఆమోదం పొందిన మానవస్వత్వ సిద్ధాంతాల ననుసరించికూడా భారతీయులపట్ల దక్షిణాఫ్రికా ప్రభుత్వ విధానం గర్హణీయమైన దనీ, ఐక్యరాజ్య సమితి అట్టి విషయం చర్చించవలసినదే నని భారతి ప్రతినిధి సెటాల్వాడ్ వాదించాడు.

ఈ విషయం చర్చించడానికి దక్షిణాఫ్రికా ప్రభుత్వ ప్రతినిధి ప్రతిపాదించిన తీర్మానం వీగిపోయింది. ఐక్యరాజ్య సమితి ఒక కమిషన్‌ను పంప దక్షిణాఫ్రికాలో భారతీయుల స్థితిగతులను విచారింపచేయా లని భారతప్రభుత్వం ప్రతిపాదించిన తీర్మానానికి అనుకూలంగా 21 వోట్లు, ప్రతికూలంగా 17 వోట్లు వచ్చాయి. 12 దేశాలు తటస్థంగా ఉన్నాయి. ఇందులో ప్రతికూలంగా వోటువేసిన దేశాల్లో బ్రిటన్ అమెరికాలుకూడా ఉన్నాయి. ఈ సూచన ఆచరణయోగ్యమైనది కాదని వారి అభిప్రాయమట. దక్షిణాఫ్రికా, భారతదేశ, పాకిస్తాన్ ప్రభుత్వాల ప్రతినిధులతో రౌండ్‌టేబిల్ సమావేశం ఏర్పాటుచేసి సమస్యపైన సమాధానం తెచ్చుకోవలసిం దని సూచిస్తూ ఫ్రెంచి, మెక్సికన్ ప్రభుత్వాలు చేసిన ప్రతిపాదనకి ప్రతికూలంగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు మాత్రమే వోటు చేశాయి.

తరువాత ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగింది. దక్షిణాఫ్రికా ప్రతినిధి వాదమంతా ఇది ఆంతరంగిక విషయం కాబట్టి చర్చనీయాంశం కాదన్న హేతు వొక్కదానిపైనే ఆధారపడివుంది. అక్కడ భారతదేశ ప్రతినిధి సెటాల్వాడ్ తన తీర్మానాన్ని అంగీకరించాలని ఒత్తిడి చెయ్యలేదు. రౌండ్‌టేబిల్ సమావేశానికి అంగీకరించాడు. ఫ్రెంచి మెక్సికన్ తీర్మానం ఆమోదించబడింది. ఈ తీర్మానాన్ని ఆమోదించి దక్షిణాఫ్రికా ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలుగ చేసుకున్నట్లయితే ఐక్యరాజ్యసమితి భవిష్యత్తుకే ముప్పు సంభవిస్తుం దని ఎరిక్‌లో బెదిరించాడు. అయినా తీర్మానం ఆమోదించబడింది.

అయితే ఇ దెంతవరకూ ప్రయోజనకారి కాగలదు అని ప్రశ్నిస్తే ఎవరూ సమాధనం చెప్పలేరు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి ఆ దేశాన్ని ధిక్కరించడానికి వెరవడంలేదు. రౌండ్‌టేబిల్ సమావేశం జరక్కపోవచ్చును కూడా. మానవస్వత్వ సిద్ధాంతాల ప్రకారం దక్షిణాఫ్రికాలో ప్రభుత్వం ప్రజల్నందర్నీ ఆదరిస్తున్నదో లేదో, ఐక్యరాజ్యసమితి సిద్ధాంతాలను పాటిస్తున్నదో లేదో పరిశీలించే ఉద్దేశ్యంతో ఈ రౌండ్‌టేబిల్ సమావేశం జరగాలట. ఈ తీర్మానానికి సర్వసభ్యసమావేశంలో అనుకూలంగా 47 వోట్లు. ప్రతికూలంగా దక్షిణాఫ్రికా మాత్రం వోటుచేసింది. పదిదేశాలు తటస్థంగా ఉన్నాయి. తీర్మానం అట్టే జోరుగా లేదని ఎరిక్‌లో తృప్తిపడ్డాడు. మానవస్వత్వ సిద్ధాంతాల ప్రసక్తి ఉందని భారతప్రతినిధి తృప్తిపడ్డాడు. అయితే రౌండ్‌టేబిల్ సమావేశం జరక్కపోవచ్చునని దక్షిణాఫ్రికా భారతీయుల నాయకుడు డా॥ నాయుడు అన్నాడు.

ఇటలీ వలసలు: బెవిన్ - స్ఫోర్జా ఒప్పందం

ఐక్యరాజ్యసమితి ఆదర్శాలకూ, సమితిలోని అగ్రరాజ్యసభ్యులు సమితిచేత ధీమాగా చేయించగల్గిన పనులకూ ఎక్కడా సామరస్యం కనబడకపోవటంవల్లనే, ఐక్యరాజ్యసమితి అనేది ఉండాలని ప్రపంచ ప్రజలు ఎంత అభిమానం చూపిస్తున్నా సమితి అంటే నమ్మకం లేకపోతోంది.

ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణక్రింద ట్రిపోలిటానియాపై ధర్మకర్తృత్వము రెండేళ్ళలోగా ఇటలీకి ఇప్పిస్తానని బ్రిటన్ వాగ్దానం చేసింది. ఈ హామీ ఇయ్యటంలో సమితిచేత ఎల్లాంటి పనులూకూడా చేయించగలనని ధీమా బ్రిటన్‌కు ఎంత ఉందో. రెండు ప్రపంచ సంగ్రామాలూ ఐరోపా దేశాలు వలసరాజ్యాలను మూలధనంగా భావించి పంపకాలకై ముసుగులో గుద్దులాటలుగా తగువులాడుకోటం ప్రారంభించి, మరో తాత్కాలిక ప్రత్యక్షకారణం కల్పించుకొని కజ్జాలాడటంతోనే ప్రారంభమయాయి. యుద్ధకాలాలలో యూరప్ దేశాలు స్వతంత్రాలు గోల్పోయి, మానవస్వాతంత్ర్యం, మానవుని ప్రాథమిక హక్కులూ అంటూ చార్టర్లు కల్పించుకున్నాయి "మానవ" శబ్దానికి నిర్వచనం, ఇన్ని యుద్ధాలు గడచినా వీరికి శ్వేతజాతులు, ప్రపంచ ఆధిపత్యం జరుపవలసినవాళ్ళనీ నల్లజాతుల ధర్మకర్తృత్వం పేరిట ఆదేశాలసంపదంతా, (మనుష్యులతో పాటు) తెల్లవారిదేననీ అభిప్రాయం పోలేదు. ఈదేశాలు కేవలం తమ సంపాదించుకోవలసిన "ఆస్తులు" అన్న భావం తెల్లవారిలో జీర్ణించి ఉన్నంతవరకూ నల్లజాతులు ఎదురు తిరగక ముందే, తెల్లవారితో, తెల్లవారే, ఆస్తిసంపకాలకోసం ప్రపంచయుద్ధాలు ప్రారంభిస్తూం డటం తప్పదు.

బ్రిటిష్ కార్మిక ప్రభుత్వ విదేశాంగమంత్రి కూడా, నిరంకుశ సామ్రాజ్యాలనాటి వలస రాజ్యాలను అట్టే నిలపటానికి, ఐక్యరాజ్య సమితి పక్షాన హామీ లిస్తున్నాడంటే, ప్రజాస్వామ్యం స్వాతంత్ర్యం అన్న మాటలకు పాశ్చాత్య ప్రపంచ నిర్వచనం ఎంత వికృతంగా ఉందో చెప్పనక్కరలేదు.

ఇప్పటికి పదిరోజుల క్రిందటి శుక్రవారం నాటికే బ్రిటన్ విదేశాంగ మంత్రి బెవిన్ ఇటలీ విదేశాంగమంత్రితో లోపాయకారగా కలుసుకొని, స్ఫోర్జాకు, ట్రిపోలిటానియాపై ధర్మకర్తృత్వం ఇటలీకి, ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు.

ట్రిపోలిటానియాపై ధర్మకర్తృత్వం తనకు ఇప్పించినందుకు ప్రతిగా, ఎరిట్రియా భవిష్యత్తుపై ఆంగ్లో అమెరికన్ దేశాలు చేసిన ప్రతిపాదనను బలపరుస్తానని ఇటలీ హామీ యిచ్చింది. ఆంగ్లో అమెరికన్ ప్రతిపాదనలు ఇల్లా ఉన్నయి. తూర్పు ఎరిట్రియా ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణ క్రింద ఎథియోపియా ధర్మకర్తృత్వానికి అప్పగించటం— పశ్చిమ ఎరిట్రియాను ఆంగ్లో - ఈజిప్షియన్ సూడాన్‌కు అప్పగించటం.

ఇటలీతో బ్రిటన్ లోగడ చేసికొన్న ఒప్పందం ప్రకారం బ్రిటన్ సైరెనికామీద ధర్మకర్తృత్వం వహించి, సోమాలీలాండును ఇటలీ ధర్మకర్తృత్వానికి వాపసు ఇచ్చేయాలి.

ఈ ఒడంబడిక కుదిరిం దని వార్త తెలిసేటప్పటికి రష్యాప్రతినిధి గ్రోమికో ఇటలీవలస రాజ్యాల విషయమై మరో క్రొత్త పథకం ప్రతిపాదించాడు (ఐక్యరాజ్యసమితి రాజకీయ సంఘములో).

లిబియా, ఎరిట్రియాలపై, ఐక్యరాజ్యసమితి పదియేళ్లుగాక ఐదేళ్లవరకూ మాత్రమే ధర్మకర్తృత్వం వహించాలనీ సోమాలిలాండు మీద పది ఏళ్లపాటు ధర్మకర్తృత్వం వహించాలనీ రష్యా పథకంలో సూచన.

ఇటలీకి ట్రిపోలిటానియాను అప్పచెప్పటం రెండేళ్ల తర్వాతి సంగతి. ఈ లోపుగా బ్రిటన్ అయిదుగురు సభ్యులతో కూడిన సలహాసంఘంతో ట్రిపోలిటానియాను పరిపాలిస్తూ ఉండాలనీ, సైరెనికాను బ్రిటిష్ ధర్మకర్తృత్వంక్రిందే ఉంచుకోవా లనీ బ్రిటన్ అభిలాష.

బెర్లిన్ దిగ్బంధన:

మే 9 న దిగ్బంధనను ఎత్తివేస్తున్నామని, పశ్చిమరాజ్యాల కార్యక్రమంకూడా అప్పుడే ప్రారంభ మవుతుందనీ, బెర్లిన్‌లోని సోవియట్ మిలిటరీ గవర్నరు ప్రకటించాడు. మే 12 అర్ధరాత్రికి బెర్లిన్ దిగ్బంధన అంతమైంది.

పశ్చిమరాజ్యాల మంత్రులు సోవియట్ మంత్రితో మళ్లీ సమాలోచనలు ప్రారంభించే ముందు తమలో తాము మళ్లీ ఒకసారి సంప్రదించుకోటం అవసర మని అనుకొన్నారు.

కాని ఇంకా దిగ్బంధన సరిగ్గా సమాప్తమైందో లేదో అప్పుడే, రూర్ ప్రాంతంపైనా, జర్మనీ అంతటిమీదా, రష్యా అధికారం చలామణీ కావాలంటూ, సోవియట్ మిలిటరీ పత్రికలు, సోవియట్ జర్మన్ ప్రాంతీయ నాయకులు ప్రచారం సాగించారు.

బెర్లిన్ దిగ్బంధన విజయవంతంగా సాగించామని రష్యనులూ, విజయవంతంగా భేదించామని అమెరికా ఫ్రాన్సు బ్రిటనులూ అనుకోటంలో, సంప్రదింపుల్లో పైచేయిగా ఉండటానికి ప్రాకులాటలే కనుబడుతున్నయి. బెర్లిన్ ఉపన్యాసధోరణి సోవియట్ ప్రతికూలంగా ఉండటం, బెర్లిన్‌లో ఓడిపోయినట్లు బ్రిటన్ భావించటమే కారణమని రష్యా అర్థాలు చెప్పుతున్నది దిగ్బంధన ఎత్తివేయటములో రష్యా ఓటమి కనుబడుతూందో, కొత్త ఎత్తుగడో, పశ్చిమరాజ్యాలకు మాత్రం సందేహ నివృత్తి కాలేదు.

పారిస్ విదేశాంగమంత్రుల సమావేశ సాఫల్యం అంతా, రష్యా అమెరికాలు సమాధానపడి, బ్రిటన్ ప్రాన్సులను కూడకట్టుకొని రావటం మీదే ఉంటుం దని బ్రిటిష్ "అభిజ్ఞు" లే అభిప్రాయ పడుతున్నారు.

*   *   *   *

ప్రపంచానికి తృతీయ సంగ్రామ భీతి అంతరించే వరకూ పశ్చిమ యూరప్ రాజ్యాలకు మిలిటరీ సహాయం చేస్తూఉండగల మని అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. 1950 లో ఈ ప్రణాళిక కోసం 140 కోట్ల డాలర్ల ధనం కేటాయించి, తరువాతి సంవత్సరాలలో, యుద్ధభయం ఎంతగా ఉందో ఆ ప్రమాణాన్నిబట్టి తాము చేసే సహాయం యొక్క ప్రమాణం నిర్ణయిస్తామని అమెరికా ప్రకటించుకొంది. అమెరికా ఈ ప్రకటనకూడా జర్మన్ సమస్యపై విదేశాంగ మంత్రుల సమావేశంమీద ప్రభావం చూపింకోగల్గటానికే ఉద్దేశింపబడి ఈ సమయంలో ప్రకటితమయింది కాబట్టి సైనికసహాయం స్వరూపం ఇంత విశదంగా ఇప్పుడే వెలువరించి చెప్పాల్సివచ్చిం దని పిస్తుంది. బెర్లిన్ దిగ్బంధన ఎత్తివేయటానికి అట్లాంటిక్ చార్టరే కారణ మని అనుకొన్నట్లయితే, ప్రకటనలో అట్లాంటిక్ చార్టరుకు మరింత బలం, యథార్థస్వరూపానికి దోహదం ఇచ్చామని చెప్పటంతో, రష్యాను మరింత లొంగదీసుకోటానికి ప్రయత్నమే కావచ్చును.

చైనా యుద్ధం:

చైనాయుద్ధంలో కమ్యూనిస్టులు, చివరికి మిగిలిన షాంఘై పట్టణాన్నికూడా చుట్టముట్టేశారు. హాంకౌలో కమ్యూనిస్టులను నెగ్గామని ప్రభుత్వ సేనలు చెప్పుకొన్న మరుక్షణంలోనే హాంకౌ కమ్యూనిస్టుల వశమయింది. షాంఘైవద్ద కూమింగ్‌టాంగ్ సేనలు తిరోగమనంలో భూదగ్ధవిధానాలు అవలంబిస్తున్నాయి. పట్టణంనుంచి బ్రిటిష్ కాందిశీకులు విమానాలలో హాంకాంగ్ చేరుకొంటున్నారు.

ప్రభుత్వ సేనలు తప్పించుకోటానికి వాంగ్పూనదిదోవ ఒక్కటే మిగిలిఉంది దీనికి వీలుగా ప్రభుత్వసేనలు వూసుంగ్ ప్రాంతంలో గట్టిగా నిలచి పోరాడుతున్నాయి.

కాంటన్ పట్టణంకూడా ప్రజలు ఖాళీచేసి పల్లెలకు పోతున్నారు. షాంఘై సమీపంలో నాన్జింగ్ మొదలైన అనేకస్టేషనులు కమ్యూనిస్టుల వశమయాయి. షాంఘైపతనం ఏక్షణాన్న జరిగితీరవలసిన విధాయక కృత్యమే అన్నట్లుంది.



కామన్వెల్తుసభకు హాజరై, ఢిల్లీకి వచ్చినవెంటనే, విమానాశ్రయంవద్ద నెహ్రూను ప్రథమంగా గవర్నర్ జనరల్, తన సైనిక కార్యదర్శిద్వారా మల్లెపూలదండ సత్కరించెను.

బర్మా సాయుధవిప్లవం

(6-వ పేజీ తరువాయి)

సాయుధవిప్లవం సాగించి పోరాడుతే తాము కోరిన ప్రత్యేక కరెన్ రాష్ట్రాన్ని స్థాపించగలరని, గట్టిగా నమ్మేరు. ఇదే సమయమని కరెన్ నేషనల్ డిఫెన్సు ఆర్గనైజేషన్‌వారు, తమ ప్రాబల్యం క్రింద వున్న ప్రదేశాలలో యూనియన్ ఫ్లాగ్‌కు బదులుగా కరెన్ జాతీయపతాకాన్ని ఎగురవేశారు.

వారి ప్రాబల్యంక్రింద వున్న ఐరావతీ డెల్టాలో వున్న కరెన్ కమ్యూనిస్టులుకాని వారిని అనేక విధములుగా బాధపెట్టిరి. కరెన్ నేషనల్ డిఫెన్సు ఆర్గనైజేషన్‌వారు తుదిక్షణంవరకూ ప్రభుత్వాన్ని నమ్మించి వారి ప్రాబల్యం క్రింద వున్న "థాటన్" "మోల్మీన్" "లాయికా" వంటి నగరాలను హఠాత్తుగా ముట్టడించి ఆక్రమించుకొన్నారు. విప్లవకారులు ఆక్రమించిన ప్రదేశాలలోని పరిపాలనాబాధ్యతను కమ్యూనిస్టులకు అప్పగించి తాము ముందుకు సాగేరు. దేశం అంతటా కరెన్ కమ్యూనిస్టు బలాలు ప్రభుత్వపటాలాలను తీవ్రంగా ప్రతిఘటించేరు. యూనియన్ ప్రభుత్వం నమ్ముకున్న స్వంతపటాలాలలో విప్లవం చెలరేగింది. మిగిలిన సైనికులకు నైతికోత్సాహం క్రమంగా క్షీణించింది. కరెన్లను నమ్మి బ్యాంకు రక్షణబాధ్యత వారిచేతిలో పెడితే వారు విశ్వాసద్రోహం చేసి ఆనగరాన్ని ఆక్రమించి యూనియన్ ప్రభుత్వం జారీచేసిన వుత్తరువులను పాటించడం మానేసేరు. ఈ నగరఆక్రమణవల్ల రాజధాని అగు రంగూను ఇతరప్రదేశములనుండి వేరుచేయబడింది. 1949 జనవరిలో కరెన్ కమ్యూనిస్టు బలాలు "పెగు"నగరాన్ని ఆక్రమించేయి. అచ్చటినుండి విప్లవకారులు "టౌంగూ"ను ఆక్రమించేరు. ఈనగరం విప్లవకారుల చేతిలో నుండుటచే దిగువ, ఎగువ బర్మాలమధ్య రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. విప్లవకారులు వెంటనే రంగూన్ మాండలే మధ్య కల తంతి, టెలిఫోను తీగలను పూర్తిగా త్రెంచివేసిరి. రైళ్ళనడకను ఆపుచేసి రంగూన్-మాండలే ట్రంక్‌రోడ్డుపై రాకపోకలను అటకాయించిరి. అక్కడనుంచి విప్లవకారులు దిగ్విజయంగా టౌంగూనుంచి దక్షిణ దిశగా రైలుమార్గంమీద పురోగమిస్తూ "న్యాంగిల్ బన్"ను 1949 ఫిబ్రవరిలో వశపరుచుకొన్నారు. అక్కడనుంచి రంగూన్‌కు ఉత్తరంగా 50 మైళ్ళ దూరంలో గల "గోబ్యు" రిజర్వాయరును కాపలాకాస్తున్న మిలిటరీ పోలీసులను హఠాత్తుగా కాల్చి చంపేశారు. వెంటనే అచ్చటనుండి రంగూను పోవు నీటిగొట్టములను ధ్వంసం చేశారు. దీనివలన రంగూనుకు తీరని నీటికరువు వచ్చింది. స్నేహంకోసం ప్రభుత్వంచేసిన విజ్ఞాపనలను ప్రభుత్వబలహీనతగా భావించి వాటిని పెడచెవిని పెట్టేరు.

ఇంక ప్రభుత్వం నమ్ముకున్న కచిన్, చిన్ జాతులవారు, అప్పటి కిమును పే వారు కమ్యూనిస్టుల ప్రాబల్యంక్రింద ఉండి వారి ప్రాంతాలలో ప్రభుత్వవ్యతిరేకచర్యలు ప్రారంభించిరి. ఈ మోటుజాతులవారి ప్రాబల్యంక్రింద ఉన్న ప్రదేశాలను ఆసరాగా తీసుకొని కరెన్ కమ్యూనిస్టుబలాలు ఇన్సీన్, మాండలేలను ఆక్రమించేయి. నాటికి బర్మాయూనియన్ అధికారం క్రింద ఒక్క రంగూన్, దానిచుట్టుపట్ల 10 మైళ్ళ దూరం మాత్రమే కలదు. ఈ సంఘటనకు కొలదికాలం మునుపే బర్మాబ్రిటీషు కామన్‌వెల్తునుండి సభ్యత్వం వదులుకొని ప్రక్కకు తప్పుకొంది. తన దేశాన్ని అంతర్యుద్ధంనుంచి రక్షించి తనకాళ్ళపై తాను నిలువలేని స్థితిలో నున్నదని ప్రపంచమునకు తెలిసిన విషయమే! దేశపరిపాలనా బాధ్యతవహించగలమని ఆందోళనచేసి స్వాతంత్ర్యం సంపాదించేరు. ఈనాడు పరిపాలనా బాధ్యత నిర్వహించుకోలేక కామన్‌వెల్తు రాజ్యాల సహాయంకోసం బ్రిటన్‌ను అభ్యర్థించటం కేవలమూ తమ అసమర్థతను తెలియపరుచునని ప్రధాని థాకిన్‌నూ ఊరకుండెను. బర్మాలో "షాన్" జాతివారు ఒక్కరూ మాత్రం తమ అచంచల ప్రభుభక్తిని ప్రదర్శిస్తూ అనేకరంగాలలో బర్మాయూనియన్ సైన్యాలకు తోడ్పడిరి. యుద్ధప్రజ్ఞాసంపన్నులయిన కరెన్ విప్లవకారులు "మాదిరివిధానాన్ని" అవలంబించేరు. తమ ఆక్రమిత ప్రదేశాలను బలపరుచుకొంటూ యుద్ధరంగాలలోనూ వాటిపరిసరాలలో కల ఫ్యాక్టరీలనూ గోదాములనూ కాల్చి ధ్వంసముచేయ మొదలిడిరి. యుద్ధరంగాలలో కల యూనియన్ సైనికులకు ఆయుధ, ఆహార, సామగ్రీ సరఫరా కాకుండ అనేక పెద్ద రోడ్లను ఆక్రమించి దారులను అటకాయించేరు. ప్రతినిమిషమూ బర్మా యూనియన్ వైమానిక దళాలు పోయి కరెన్ స్థావరాలపై బాంబులను వేయసాగేయి.

ఇంతవరకూ కరెన్ కమ్యూనిస్టుబలాలతో కలసి పోరిన "పీపుల్సు వాలంటియర్సు" ప్రభుత్వం చూపించిన ఆశలవలన కొందరు మాత్రం తమకు యీ అంతర్యుద్ధంలో ఏ మాత్రం సంబంధము లేదని ప్రకటించిరి. యుద్ధంలో సంబంధము లేదు అన్న పీపుల్స్ వాలంటియర్సుసంస్థలో కొందరు ప్రభుత్వ సైన్యాలతో సహకరించి అనేక తిరుగుబాటు కీలకాలను వెల్లడిచేసేరు. ఈ రహస్య తిరుగుబాటు కీలక ప్రదేశాలపై బర్మా వైమానిక దళంవారు బాంబులు వేశారు. ప్రధాన కీలక స్థావరాలు వెల్లడిఅయిపోవడంనుంచి ఇన్సీన్‌లో విప్లవకారులు అన్ని వైపులనుంచీ గట్టి దెబ్బలను ఎదుర్కొవలసి వచ్చింది. యూనియన్ ప్రభుత్వంపై సాయుధవిప్లవం సాగిస్తే తాము కోరిన ప్రత్యేక కరెన్‌రాష్ట్రం స్థాపించగలమన్న ఆశ ఛిన్నాభిన్నమైపోయింది.

ఇటువంటి పరిస్థితులలో మోజర్ ఉడ్రో వాట్సు యూనియన్ ప్రభుత్వాన్ని విశ్వసించి వారితో ఏదో ఒకవిధంగా సంధికి రావలసిందని సూచించాడు. తాము అనుకొన్న యుద్ధప్రణాళిక అడ్డు తిరుగుటచే కరెన్ విప్లవాధ్యక్షుడు మిస్టర్ "సాబాయుగ్యే" సంధికి తాము సిద్ధముగా ఉన్నామని ప్రభుత్వమునకు విజ్ఞప్తి చేసేరు.


ఇంతలో బర్మా మంత్రివర్గంలో పీపుల్సు వాలంటియర్సు సంస్థకు చెందినవారూ, ఎల్లో బ్యాండు ప్రతినిధులూ, సోషలిస్టులూ రాజీనామా యిచ్చేరు. ప్రభుత్వం వీరిస్థానంలో బర్మా సుప్రీంకోర్టు జడ్జినీ, బర్మాసేనానినీ నియమించింది.

విప్లవాధ్యక్షుడు సాయుధవిప్లవం సాగిస్తున్న అన్నిపార్టీలవారినీ సంప్రదించకుండా సంధి రాయబారానికి వెళ్ళేడు. ఇది చూచి కమ్యూనిస్టులూ కొందరు కరెన్లూ కలసి సాబాయుగ్యే బేషరతుగాలొంగుబాటువుచున్నాడని, విప్లవకారుల ఆక్రమిత ప్రదేశాలలో తీవ్రముగా ప్రచారం చేసేరు. ఇందువల్ల వీరిలో అసంతృప్తి ప్రబలింది. బేషరతుగా లొంగుబాటే స్థిరమయితే యూనియన్ ప్రభుత్వం వారి జాతిని పూర్తిగా తుడముట్టేస్తుందని ఈ కరెన్సుమరికొన్ని జాతులవారు గట్టిగా నమ్మేరు. అందుకని వీరు శాంతి ఒడంబడికకు స్వస్తి చెప్పేరు. చివరకు జరుగబోయే అంతర్యుద్ధ ఒడంబడికలో అన్ని రంగాలలో కల మిలిటరీ, రాజకీయ వర్గాలవారు పాల్గొనాలనీ, మైనారిటీ జాతివారు కూడా ఇందు పాత్ర వహించాలనీ పట్టుపట్టేరు. యుద్ధ విరమణ సందర్భంలో కరెన్సు అభ్యర్థనలో కల ప్రదేశాలలోకి యూనియన్ ప్రభుత్వ సైనికులు ప్రవేశించకూడదని షరతు పెట్టేరు. ఇందుకు బర్మా యూనియన్ ప్రభుత్వవర్గాలవారు అంగీకరించలేదు. ఈ షరతులవలన శాంతి రాయబారం పూర్తిగా భగ్నమైపోయింది.

మళ్లీ దేశమంతటా అంతర్యుద్ధం చెలరేగింది. ప్రభుత్వం చూస్తే చాలా హీనస్థితిలో ఉన్నది. వారు తలచినట్లు పరదేశాలనుంచి సహాయం రాలేదు. ఇంతకుముందే బర్మా కామన్‌వెల్తునుంచి బయటికి వచ్చివేయడం నుంచి కామన్‌వెల్తు రాజ్యాల సహాయం ఏమాత్రం రాలేదు.

"బర్మాలో పరిస్థితులు నానాటికి విషమిస్తున్నాయి" అని భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బర్మావిషయంగురించి చర్చించడంకోసం ఆసియా మహాసభను ఢిల్లీలో ప్రారంభించేడు. చివరకు దీనివలన నేనా లాభం ఉంటుందని బర్మామంత్రివర్గం ఆశ పెట్టుకొంది. కాని చివరకు యీ ఆసియామహాసభ వారు, "బర్మాలో అంతర్జాతియైన కరెన్లతో ఏదోవిధంగా సంధికి రావటం మంచి"దని సూచించేరు. వారి ప్రత్యేకరాష్ట్రం యూనియన్ నుంచి వేరుచేసి యిచ్చివెయ్యమన్నారు. సభవారి సూచనలు వారికి ఏమాత్రం తృప్తి లేవు. చివరకు లండనులో జరుగబోయే కామన్‌వెల్తు నియన్ ప్రధానుల సభలో ఎవరేనా బర్మా విషయంగురించి చర్చిస్తే ఏదేనా లాభముంటుందని భావించి 1949 ఏప్రిల్‌లో బర్మా ప్రధాని థాకిన్‌నూ ఢిల్లీ వచ్చి పండిట్ నెహ్రూతో ఆ విషయం చర్చించి పిదప కరాచీలో పాకిస్తాన్ ప్రధానమంత్రి మిస్టర్ లియాకతలీఖాన్‌తో సంప్రదించెను. మళ్లీ రంగూన్ పోతూ దారిలో కలకత్తాలో దిగి పత్రికావిలేఖరులతో ముచ్చటిస్తూ, తాను భారతదేశాన్ని ఆర్థిక సైనిక సహాయాన్ని కోరేనని తెలిపాడు. ఇందులకు భారతప్రధాని సంపూర్ణంగా అంగీకరించాడని వివరించాడు. కమ్యూనిస్టులపై తీసుకోవలసే సమిష్టిచర్యలవిషయమాత్రం చర్చకు రాలేదనియూ, బర్మా విషయంలో భారతప్రధాని నెహ్రూ మధ్యవర్తిత్వాన్ని తాను ఎన్నడూ తిరస్కరించలేదనియూ, లండనులో జరుగబోయే కామన్‌వెల్తు యూనియన్ ప్రధానుల సభలో బర్మావిషయంగురించి చర్చించడంకోసం భారత, పాకిస్తాన్, ప్రధానులు సంపూర్ణంగా అంగీకరించారని తెలిపాడు. పిమ్మట అక్కడనుండి రంగూను చేరేడు.

బర్మా విషయంలో భారతదేశం మధ్యవర్తిత్వానికి అర్హులా, అనర్హులా అన్న విషయంలో "న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్" అనే ఒక సుప్రసిద్ధ అమెరికన్ జాతీయ పత్రిక ఈ విధంగా సూచించింది "నేడు బర్మా వ్యవహారాలలో ప్రక్కనున్న యిండియా పాల్గొన్నట్లయితే అవి సులభంగా పరిష్కారం కాగలవు."




బ్రిటన్‌లో, దుక్కి దున్నటంలో పందాలు కట్టారు. ఈ గుఱ్ఱంజత పోటీలో ప్రథమంగా వచ్చింది.

బొప్పాయిపంటలో ఎంత లాభం తీస్తున్నారో బ్రిటిషు వారు!

ఆవము చెట్లకాయలు కోస్తూ రసాన్ని తొట్లల్లోకి పట్టున్నారు. ఈ గింజలు రసంతో సహా రెండోచిత్రంలో ఉన్న మాదిరి "ఆవము"లో ఎండబెట్టి, వాటినుంచి "పాప్పాయ్" అనేపేరిట తయారైన తినుబండారాన్ని పెట్టెలలో అమ్మకానికి పెట్టున్నారు. ఒక్కొక్క పెట్టె 333 రూపాయిలు ఆదాయం తెస్తోంది!





★ పాడిపంటలు ★



…వుమాడలలో కవలదూడలు అసాధారణంగా ఉంటవి. బక్కింగ్‌హాం షైర్‌లో పుట్టిన రెండు కవలదూడల జంటలు.



పశువుల సంతలు: బ్రిటను పశువుల సంతను ప్రోద్బలంచేసి పాడిపంటలను వృద్ధిచేసికొంటూంది.



Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1